## ఏఐ.. పనిలో కొత్తదనం తెస్తుంది
చర్చనీయాంశమైన హర్ష్ గోయెంకా పోస్ట్

2



# మనం
జనం కోసం అక్షర యజ్ఞం..
హైదరాబాద్ - గురువారం 7 ఆగస్టు 2025 | సంపుటి: 9 | సంచిక: 220 | పేజీలు:12 | వెల రూ.5
HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA



## నేషనల్ వాస్కులర్ డే వాకథాన్


2




# బీసీ బిల్లును ఆమోదించకుంటే గద్దె దింపుతం

## జంతర్‌మంతర్ ధర్నాలో మోడీకి రేవంత్ సవాల్

## రాహుల్‌ను ప్రధానిని చేసుకుని రిజర్వేషన్లు సాధించుకుంటం

- ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినా మోడీ గద్దె దిగడం లేదు
- బీసీలకు రిజర్వేషన్లిస్తే మీకొచ్చిన నొప్పేంది
- బీఆర్‌ఎస్ నేతలు మోడీ చెప్పులు మోస్తరా?
- వంద మీటర్ల గోతి తవ్వి పాతి పెట్టినా బీఆర్‌ఎస్‌కు బుద్ధి రాలేదు
- బిసీ రిజర్వేషన్ల బిల్లుపై జంతర్‌మంతర్ వద్ద మహాధర్నాలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 06, ( మనం బ్యూరో): బీసీ రిజర్వేషన్ బిల్లులకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలపకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్ గాంధీని ప్రధానిని చేసుకుని తమ డిమాండ్‌ను సాధించుకుంటామని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ప్రధాని మోడీ మెడలు వంచేందుకే ...మిగతా 2లో

### కేంద్రంపై యుద్ధం తెలంగాణదే కాదు.. యావత్ దేశానిది



తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బీసీ రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం వెంటనే ఆమోదించాలని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఈ యుద్ధం కేవలం తెలంగాణది మాత్రమే కాదనీ, యావత్ దేశానిదని పేర్కొన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై పార్లమెంటు చట్టబద్ధత చేయాలని డిమాండ్ చేస్తూ పీసీసీ నేతృత్వంలో బుధవారం జంతర్‌మంతర్ వద్ద మహాధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మద్దతుగా రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. అణగారిన వర్గాల్లోని ప్రతీ భారతీయుడికి అధికారంలో, భాగస్వామ్యంలో, పురోగతి కోసం జరుగుతున్న యుద్ధమన్నారు. రాష్ట్రపతి బీసీ బిల్లును పరిశీలించి ఆమోదిస్తారని ఆశిస్తున్నట్లు ఆకాంక్షించారు. బీసీ రిజర్వేషన్ల చట్టం సామాజిక న్యాయానికి నాంది పలుకుతుందనీ, దానిని సాధించడం కోసమే కాంగ్రెస్ పార్టీ ఈ భారీ నిరసన చేపట్టిందని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ పేర్కొన్నారు.



## దద్ధరిల్లిన ఢిల్లీ

ధర్నాకు మద్దతు తెలిపిన ఇండియా కూటమి నేతలు, ఎంపీలు

పీసీసీ పిలుపుతో హస్తినకు తరలి వచ్చిన 2000 మంది ప్రజాప్రతినిధులు

హైదరాబాద్, ఆగస్టు 06, (మనం బ్యూరో): బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రం వెంటనే ఆమోదం తెలపాలన్న డిమాండ్‌తో ఢిల్లీలోని జంతర్ మంతర్ దద్ధరిల్లింది. పీసీసీ నేతృత్వంలో ...మిగతా 2లో

### ట్రంప్ సుంకం..

## మరో 25 శాతం

- భారత్‌పై 50 శాతానికి చేరిన అమెరికన్ టారిఫ్
- రష్యా నుంచి చమురు కొంటున్నందుకేనని స్పష్టం చేసిన వైట్ హౌజ్ ప్రకటన



న్యూయార్క్, ఆగస్టు 6: భారత్‌పై మరోసారి సుంకం విధిస్తానంటూ పేలుతూ వచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నంత పనీ చేశాడు. రష్యా నుంచి చమురు కొంటున్నందుకు మరో 25 శాతం సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే మన దేశంపై 25 శాతం ప్రతీకార సుంకం విధించారు. దీంతో భారత్ నుంచి దిగుమతయ్యే ఉత్పత్తులపై 50 శాతం సుంకం వర్తించనుంది. ఈ సుంకం విధించే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్స్‌పై బుధవారం ట్రంప్ సంతకం చేశారు. రష్యా నుంచి ప్రత్యక్షంగా, పరోక్షంగా ...మిగతా 2లో

### మోడీ ధైర్యం చూపాలె: కాంగ్రెస్

తాజా పరిణామంపై కాంగ్రెస్ స్పందించింది. ప్రధాని మోడీ మిత్రుడు ట్రంప్ నిరంతరం మన దేశంపై చర్యలు తీసుకుంటున్నా.. ప్రధాని మోడీ మాత్రం కనీసం ఆయన పేరును కూడా ప్రస్తావించడం లేదంటూ విమర్శించింది. ఇప్పటికైనా మోడీ ధైర్యం చూపించాలని, ట్రంప్ చర్యలకు తగిన సమాధానం ఇవ్వాలని కోరుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టింది.

### జయశంకర్ సార్.. గద్దర్‌లకు పుష్పాంజలి..



తెలంగాణ సాధన కోసం జీవితాన్ని ధారపోసిన ఆచార్య జయశంకర్ సార్ జయంతి.., పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం నింపిన ప్రజా యుద్ధ నౌక గద్దర్ వర్ధంతిని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆ మహనీయుల చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. చిత్రంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

### ధర్నాకు బీసీల

## మద్దతు కరువైంది

బీసీల ముసుగులో ముస్లింలకు వంద శాతం రిజర్వేషన్ల అమలుకు కుట్ర

కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, ఆగస్టు 6, (మనం బ్యూరో): బీసీల రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ ఢిల్లీలో నిర్వహించిన ధర్నాకు బీసీల మద్దతు కరువైందని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బీసీ ముసుగులో ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈమేరకు బుధవారం ఆయన మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో బీసీలకు పూర్తిగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తేనే మద్దతిస్తామని స్పష్టం చేశారు. బీసీలకు ఏ పార్టీ ఏం చేసిందో బహిరంగ చర్చకు సిద్ధమనీ, 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఎన్నడైనా బీసీని ప్రధాని చేశారా అని సవాల్ విసిరారు. ఉమ్మడి ఏపీలో 48 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఒక్క బీసీనైనా సీఎంను చేశారా ? అని నిలదీశారు. బీసీని ప్రధానిని చేసిన ఘనత బీసీకే దక్కుతుందనీ, 27 మంది బీసీ కేంద్ర ...మిగతా 2లో


### బనకచర్లతో తెలంగాణ ప్రజలకు నష్టం
ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై రాజ్యసభలో బీఆర్‌ఎస్ వాయిదా తీర్మానాలు

### బకాయిల కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా
2


## 28 మంది కేరళ పర్యాటకుల గల్లంతు

ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకుపోయిన వందలాది మంది టూరిస్టులు

### సంధ్య థియేటర్ తొక్కిసలాట..

## రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి జాతీయ మానవ హక్కుల కమిషన్ షోకాజ్

హైదరాబాద్, ఆగస్టు 6: తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్)కు జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్ హెచ్ ఆర్సీ) షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ...మిగతా 2లో

## ట్రంప్‌వి అవగాహన లేని మాటలు



డొనాల్డ్ 'డెడ్ ఎకానమీ' కామెంట్స్‌పై ఆర్బీఐ చీఫ్ సంజయ్ మల్హోత్రా

ప్రపంచ వృద్ధికి అమెరికా కన్నా భారత దేశమే ఎక్కువ దోహదం చేస్తోంది

ఢిల్లీ, ఆగస్టు 6: భారత దేశానిది 'డెడ్ ఎకానమీ' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన కామెంట్స్‌పై ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా తీవ్రంగా స్పందించారు. మన ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని, ప్రపంచ వృద్ధికి అమెరికా కన్నా భారత్ ఎక్కువ దోహదం చేస్తోందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ ద్రవ్య నిధి సంస్థ ప్రకారం ప్రపంచ వృద్ధి 3శాతంగా ఉంటే.. భారత్ వృద్ధి అంచనాలు మాత్రం 6.5శాతంగా ఉన్నాయన్నారు. ''ప్రపంచ వృద్ధికి భారత్ దాదాపు 18శాతం దోహదం చేస్తోంది. అమెరికా కంట్రిబ్యూషన్ 11శాతం కంటే తక్కువగా ఉంది. భారత ఆర్థిక వ్యవస్థ బలంగా ఉంది. మరింత పురోగతి సాధిస్తాం'' అని ఆర్బీఐ గవర్నర్ పేర్కొన్నారు. అదేవిధంగా.. భారత జీడీపీపై అమెరికా సుంకాల ప్రభావం ఏమేరకు ఉంటుందన్న దానిపై మల్హోత్రా స్పందిస్తూ.. అమెరికా ...మిగతా 2లో


### 31న చైనాకు మోడీ 2


## మా బకాయిలు ఇప్పించండి

మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన మాజీ సర్పంచులు

హైదరాబాద్, మనం ప్రతినిధి: పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మాజీ సర్పంచులు డిమాండ్ చేశారు. మాజీ సర్పంచ్‌లకు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలంటూ తెలంగాణ సర్పంచుల సంఘం జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం నాడు ప్రభుత్వం నుంచి రావాల్సిన మొండి బకాయిలపై ఇప్పించాలని కోరుతూ తెలంగాణ మానవ హక్కుల కమిషన్‌లో రాష్ట్ర సర్పంచుల సంఘం నేతలతో కలిసి జేఏసీ చైర్మన్ యాదయ్య, కార్యదర్శి రాజేందలు ఫిర్యాదు చేశారు. ఈ ...మిగతా 2లో

## డీకేతో రాజగోపాల్ రెడ్డి భేటీ

కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలపై క్రమశిక్షణ కమిటీ సీరియస్

పార్టీపై బహిరంగ విమర్శలు చేయడం సరికాదు: మల్లు రవి



హైదరాబాద్,ఆగస్టు 06, (మనం బ్యూరో): ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కలేదని తీవ్ర అసంతృప్తితో ఉన్న మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో భేటీ అయ్యారు. వ్యక్తిగత పని నిమిత్తం హైదరాబాద్ వచ్చిన డీకేను రాజగోపాల్ రెడ్డి బంజారాహిల్స్ లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. గత కొద్ది రోజులుగా కోమటిరెడ్డి సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఈ నేపథ్యంలో ఆయన డీకేను కలవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. మంత్రి పదవి ఇస్తానంటేనే తాను కాంగ్రెస్‌లోకి వచ్చానని తెలిపారు. కాంగ్రెస్‌లో తనను పట్టించుకోవడం లేదనీ, భువనగిరి ఎంపీని గెలిపిస్తే మంత్రి పదవి ఇస్తానని పార్లమెంటు ఎన్నికల సమయంలో అధిష్టానం పెద్దలు చెప్పారనీ, అయితే, దానిని విస్మరించి పార్టీలో తనకంటే జూనియర్లకు అవకాశం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, కోమటిరెడ్డి సీఎం రేవంత్, పార్టీ అధిష్టానంపై చేసిన వ్యాఖ్యలను క్రమశిక్షణ కమిటీ సీరియస్‌గా తీసుకుంది. ఈమేరకు చైర్మన్ మల్లు రవి స్పందిస్తూ రాజగోపాల్ రెడ్డితో సమావేశమై ఆయన వ్యాఖ్యలపై వివరణ తీసుకుంటానన్నారు. పార్టీ అంతర్గత వ్యవహారాలపై బహిరంగంగా మాట్లాడటం సరికాదనీ, ఇటువంటి అంశాలను పార్టీ హైకమాండ్ పరిష్కరిస్తుందని తెలిపారు. కోమటిరెడ్డి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని ఈసందర్భంగా మల్లు రవి స్పష్టం చేశారు.



## తెలంగాణలో ఒక్కో రైతుపై రూ.1.52 లక్షల అప్పు

పార్లమెంటులో వెల్లడించిన కేంద్రం

హైదరాబాద్, మనం ప్రతినిధి: తెలంగాణ రైతుల అప్పులు జాతీయ సగటు కంటే రెట్టింపు స్థాయిలో ఉన్నాయని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి రామ్ నాథ్ ఠాకూర్ తెలిపారు. తాజాగా జరుగుతున్న లోక్‌సభ సమావేశాల్లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఒక్కో రైతు కుటుంబంపై జాతీయ సగటు అప్పు రూ.74,121 ఉండగా.. తెలంగాణలో ...మిగతా 2లో

# బీసీ బిల్లును ఆమోదించకుంటే గద్దె దింపుతం



(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీలో మహా ధర్నా చేపట్టామనీ, అసెంబ్లీ పాస్ చేసిన బిల్లును వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలిన డిమాండ్ చేస్తూ పీసీసీ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రిజర్వేషన్లు 42 శాతం ఇవ్వాలని రెండు బిల్లులను ఆమోదించాం. ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ బీసీలపై కక్షగట్టి 50 శాతం మించకుండా చట్టం చేశారు. బలహీన వర్గాలకు అన్యాయం చేసే చట్టాన్ని తొలగించేందుకు ఆర్డినెన్స్ తీసుకొచ్చామని వెల్లడించారు. విద్యా, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ల బిల్లును చట్టం చేసి గవర్నర్ రాష్ట్రపతికి పంపించారు. నాలుగు నెలలు గడిచినా ఆమోదం లేదు. బీసీలకు అన్యాయం చేస్తుంటే గల్లీ నుంచి ఢిల్లీకి వచ్చి ధర్నా చేపట్టామని స్పష్టం చేశారు. కామారెడ్డిలో 42 శాతం బీసీ డిక్లరేషన్ ఇచ్చాం. రాహుల్ గాంధీ, సిద్ధరామయ్య కామారెడ్డిలో హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో మొత్తం 17 మంది సీఎంలు, దేశంలో 300కు పైగా ఏ ఒక్క ముఖ్యమంత్రి చేయని సాహసం చేశాం. క్యాబినెట్ మంత్రులు నాకు సహకరించి ఈ అవకాశం ఇచ్చారు. దేశానికే ఆదర్శంగా నిలబడటానికి తెలంగాణ సీఎంగా నాకు అవకాశం వచ్చింది. రాహుల్ గాంధీ సందేశాన్ని పాటిస్తూ జనగణనలో కుల గణన చేపట్టాలని నిర్ణయించామని సీఎం రేవంత్ తెలిపారు. మోడీ సర్కార్ బిల్లులకు ఆమోదం తెలిపే వరకు పోరాటం కొనసాగిస్తామనీ, అప్పటి వరకు విశ్రమించేది లేదని స్పష్టం చేశారు. బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ చెప్పినా 75 ఏళ్ల మోడీ ప్రధాని పదవిని వదలడం లేదని ఎద్దేవా చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వం సంకల్పిస్తే బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ఒక్కటై అడ్డుకుంటున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. తెలంగాణలో బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇస్తామంటే గుజరాత్ వాళ్లకు వచ్చిన కడుపునొప్పేంటని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో మోడీకి ఆలోచన లేదు సరే..ఆయన మోచేతి నీళ్లు తాగే తెలంగాణ బీజేపీ నేతలు కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావుకు ఏమైందని ప్రశ్నించారు. బీజేపీ వాళ్లు మోడీ మోచేతి నీళ్లు తాగొచ్చు. మరి బీఆర్‌ఎస్ నేతలకు ఏమైంది? మీరు కూడా మోడీ చెప్పులు మోస్తారా? అని నిలదీశారు. బీసీ పేరుతో కాంగ్రెస్ డ్రామాలేస్తున్నదని కేటీఆర్ అంటున్నడనీ, కానీ డ్రామాలు ఆడేదే కల్వకుంట్ల ఫ్యామిలీ అనే విషయం అందరికీ తెలుసని వ్యాఖ్యానించారు. డ్రామా మీ కుటుంబంలో ఉంటే బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలనే చిత్తశుద్ధి మాకుందని వ్యాఖ్యానించారు. మీ ఇంట్లనే పరిస్థితి సక్కగ లేదు. ఒకరు బీసీలకు మద్దతంటరు, ఇంకొకాయ్చున అస్సలు మాట్లాడరు. మరొకరు మధ్యరకం అంటరు. అటు ఇటు గానీ వాళ్లు నా గురించి మాట్లాడుతరా అని పరోక్షంగా కేసీఆర్, కేటీఆర్, కవిత, హరీష్ రావును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వంద మీటర్ల గోతి తవ్వి పాతి పెట్టినా మీకు బుద్ధి రాలేదు. రిజర్వేషన్లకు అడ్డుపడే కేసీఆర్, కిషన్ రెడ్డి, బండి సంజయ్, రాంచందర్‌రావుతో కాదు మాకు పోటీ. మా పోటీ ప్రధాని మోడీ, కేంద్ర ప్రభుత్వంతో అని పునరుద్ఘాటించారు. తెలంగాణ ప్రజల శక్తిని తక్కువ అంచనా వేస్తున్నారు కానీ, బీసీ రిజర్వేషన్ల బిల్లును సాధించి తీరుతమని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## దద్దరిల్లిన జంతర్‌మంతర్

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన ఈ ధర్నాకు బీసీలు పోటెత్తారు. తెలంగాణతో పాటు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 2000 మంది ప్రజాప్రతినిధులు ఈ ధర్నాకు మద్దతుగా తరలివచ్చారు. బీసీ రిజర్వేషన్ల బిల్లు ఆమోదించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

**బీసీ హక్కుల పోరాటం తెలంగాణ నుంచి మొదలైంది : మీనాక్షి నటరాజన్**

దేశంలో ఎవరూ ఊహించని విధంగా తెలంగాణ ప్రభుత్వం బీసీ కోటా బిల్లును తీసుకొచ్చిందని ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ అన్నారు. కుల గణన చేసి 42 శాతం బిల్లును ఆమోదం చేశామనీ, కోటా సాధించే వరకూ ఈ పోరాటం ఆగదని తేల్చి చెప్పారు. ఇది రాహుల్ గాంధీ తెలంగాణ మోడల్, ఇది అందరి హృదయాలను కలిపే మోడల్ అనీ, కులాలు, మతాల పేరు విభజించాలనే, ఓట్లు తొలగించి గెలవాలని మోడల్ దేశంలో ఇంకోటి ఉందని వ్యాఖ్యానించారు. దేశ నిర్మాణంలో భాగమైన బీసీలకు వారి హక్కులు, వాటా అందాలనీ, సామాజిక న్యాయం కోసం సీఎం రేవంత్ రెడ్డి బీసీ కోటా తెచ్చారని పేర్కొన్నారు.

**బీసీ బిల్లుపై ప్రధాని మోడీ పరేషాన్‌లో ఉన్నరు : పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

తెలంగాణలో బీసీ కోటా బిల్లు తేవడం చారిత్రాత్మకమనీ, ఈ బిల్లుతో రాష్ట్ర బీజేపీ నేతలే కాకుండా ప్రధాని మోడీ సైతం పరేషాన్‌లో ఉన్నరని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ వ్యాఖ్యానించారు. 42 శాతం బీసీ కోటా తెచ్చిన రేవంత్ మొనగాడనీ, ఇన్నాళ్లు అడిగితే ఏ లెక్కన అడుగుతున్నరని ప్రశ్నించారనీ, అందుకోసం బీసీల లెక్క చేసి కులగణన చేశామని వెల్లడించారు. దేశంలోని బీసీలంతా తెలంగాణ వైపు.. సీఎం రేవంత్ రెడ్డి వైపు చూస్తున్నరనీ, రాహుల్ గాంధీ ఎప్పుడు మాట్లాడినా తెలంగాణ వైపు చూడండి.. రేవంత్ వైపు చూడండని చెప్తున్నారని పేర్కొన్నారు. నాలుగు మాసాలుగా కేంద్ర బిల్లును తొక్కి పెట్టిందనీ, ప్రధాని మోడీకి మన బాధ, వ్యధ తెలవాలని వ్యాఖ్యానించారు. మోడీ తలచుకుంటే సాయంత్రానికే రిజర్వేషన్లు వస్తాయి. అమలు చేస్తే రాహుల్‌కు పేరొస్తుందనీ, అందుకే కేంద్రం బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించడం లేదని ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు.

**రేవంత్ పేరు చరిత్రలో నిలిచిపోతుంది : ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే**

తెలంగాణ బీసీ కోటా పోరాటానికి మహారాష్ట్రీయులంతా అండగా ఉంటారని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే అన్నారు. తమిళనాడులో కరుణానిధి 69 శాతం రిజర్వేషన్లు సాధించారనీ, అందుకే ఆయన పేరు సువర్ణాక్షరాలతో లిఖించారని పేర్కొన్నారు. 42 శాతం రిజర్వేషన్లు తెచ్చిన సీఎం రేవంత్ రెడ్డి పేరు కూడా తెలంగాణలో నిలిచిపోతుందన్నారు. తెలంగాణలో సామాజిక న్యాయానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. బీసీలకు 42 శాతం కోటా న్యాయమైన డిమాండ్ అనీ, మోడీ సర్కార్ బీసీల ఆవేదనను అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు.

## నేషనల్ వాస్క్యులర్ డే వాకథాన్

**హైదరాబాద్, ఆగస్టు 6:** నేషనల్ వాస్క్యులర్ డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్-సన్ షైన్ ఆసుపత్రుల ఆధ్వర్యంలో వాకథాన్ నిర్వహించారు. 'వాక్ ఏ మైల్ టు లివ్ విత్ ఏ స్మైల్' పేరుతో సంజీవయ్య పార్క్ నుంచి ప్రారంభమైన వాకథాన్‌ను నటుడు రాజీవ్ కనకాల జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. భారతదేశంలో వాస్క్యులర్ సమస్యల వల్ల ఏటా సుమారు 25,000 మంది చేతులు, కాళ్లు కోల్పోతున్నారని పేర్కొన్నారు. ముఖ్యంగా మధుమేహం ఉన్న రోగులలో ఇది అధికంగా కనిపిస్తుందని, త్వరగా గుర్తించి వైద్యం తీసుకుంటే 80శాతం వరకు దీన్ని నివారించవచ్చని తెలిపారు.

## ఏఐ పనిలో కొత్తదనం తెస్తుంది

- చర్చనీయాంశమైన హర్ష్ గొయెంకా పోస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 6:** ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)వల్ల ఉద్యోగాలు పోతాయని సర్వత్రా ఆందోళన నెలకొన్న నేపథ్యంలో ఆర్పీజీ గ్రూప్ ఛైర్మన్ హర్ష్ గొయెంకా ఎక్స్‌లో పెట్టిన పోస్టు చర్చనీయాంశమైంది. అయితే ఏఐ ప్రస్తుతం జరుగుతున్న పనిని మార్చేసి అందులో నూతనత్వం తీసుకొస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రాంప్ట్ ఇంజినీర్లు, ఏఐ ప్రాడక్ట్ మేనేజర్లు, ఏఐ విలువల నిపుణులు వంటి కొత్త ఉద్యోగాలు పుట్టే అవకాశం ఉందన్నారు. కార్యాలయాల రూపురేఖలు మారతాయన్నారు. స్మార్ట్ వర్క్ చేసేవారు వీటిలో బాగా రాణిస్తారని అభిప్రాయం వ్యక్తంచేశారు. గొయెంకా చెప్పినట్లుగా ఏఐ ఉద్యోగాల తొలగింపునకు కాకుండా.. నూతన ఉద్యోగ మార్కెట్కు తెర తీస్తోందని ఓ నెటిజన్ స్పందించారు. 'కాప్జెమిని' వంటి కంపెనీలు ఫ్రెషర్లను నియమించుకుం టున్నాయన్నారు. మరో నెటిజన్ స్పందిస్తూ.. ఏఐ ప్రతి రంగంలో ఉత్పాదకతను పెంచుతుందని.. పెట్టుబడిపై రాబడిని మెరుగుపరుస్తుందన్నారు. దీనివల్ల ఆర్థికవృద్ధి సైతం పెరుగుతుందని పేర్కొన్నారు. కంటెంట్ క్రియేషన్, కోడింగ్, డిజైనింగ్ రంగాల్లో ఏఐ ప్రభావం వల్ల ఉద్యోగాలపై కొంతమేర ప్రభావం పడుతుందని మరో నెటిజన్ అభిప్రాయపడ్డారు. ఇలా గోయెంకా పోస్ట్‌పై కూడా విభిన్న రకాల స్పందనలు.. వాటిలో ఆందోళనలు వ్యక్తం అవుతుండడం గమనార్హం.

## బనకచర్లతో తెలంగాణ ప్రజలకు నష్టం

- ఏపీ బనకచర్ల ప్రాజెక్టుపై రాజ్యసభలో బీఆర్‌ఎస్ వాయిదా తీర్మానాలు

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** రాజ్యసభ సమావేశాల సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ వాయిదా తీర్మానాలను డిప్యూటీ చైర్మన్ హరివంశ్.. గోదావరిపై ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాలని రాజ్యసభ సభ్యులు కేఆర్ సురేశ్ రెడ్డి, దీవకొండ దామోదర్ రావు వాయిదా తీర్మానం నోటీసులు ఇచ్చారు. ఈ ప్రాజెక్టు తెలంగాణ ప్రజలకు నష్టం చేకూర్చుతుందని నోటీసుల్లో పేర్కొన్నారు. సభా కార్యకలాపాలు వాయిదా వేసి బనకచర్లపై చర్చించాలన్న బీఆర్‌ఎస్ ఎంపీలు కోరారు. ఏపీ అక్రమంగా నిర్మిస్తున్న బనకచర్ల ప్రాజెక్టుపై అధికార కాంగ్రెస్ పార్టీ సైలెంట్‌గా ఉందన్నారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ మరోసారి పోరుబాట పట్టినట్లు చెప్పారు. తెలంగాణ ప్రయోజనాలను రేవంత్ రెడ్డి.. ఏపీ సీఎం దగ్గర తాకట్టు పెట్టారని.. ఈ ప్రాంత రైతాంగానికి తీరని అన్యాయం చేస్తున్నారని బీఆర్‌ఎస్ నేతలు మండిపడ్డారు. ఇప్పటికే బనకచర్ల వల్ల తెలంగాణకు జరిగే అన్యాయాన్ని బీఆర్‌ఎస్ పార్టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్‌తో పాటు పలు వేదికలపై ఏపీని ఎండగడుతున్నట్లు పేర్కొన్నారు.

## మరో 25 శాతం

(మొదటి పేజీ తరువాయి)

చమురు కొనుగోళ్లు జరుపుతున్నందునే ఈ టారిఫ్ విధిస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లో ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. ప్రతీకార సుంకాల్లో భాగంగా ఇప్పటికే విధించిన 25 శాతం సుంకాలు ఆగస్టు 7 నుంచి అమల్లోకి రానుండగా.. కొత్తగా విధించిన 25 శాతం అదనపు సుంకాలు ఆగస్టు 27 నుంచి వర్తింపజేస్తున్నట్లు ట్రంప్ తన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లో పేర్కొన్నారు. ఒకవేళ ఈ సుంకాలకు ప్రతీకారంగా భారత్ ఏదైనా సుంకాలు వడ్డించాలని ప్రయత్నిస్తే ఈ టారిఫ్‌లను అధ్యక్షుడు సవరించొచ్చని వైట్ హౌజ్ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. దీనిపై కేంద్రం ఏవిధంగా బదులిస్తుందో చూడాలి.

**చైనా తర్వాత మనపైనే..**

దీంతో చైనా తర్వాత ఆసియాలో అత్యధిక టారిఫ్ లు ఎదుర్కొంటున్న దేశంగా భారత్ నిలిచింది. ప్రస్తుతం చైనా ఉత్పత్తులపై 51 శాతం సుంకం అమెరికా విధిస్తోంది. మలేసియాపై 25 శాతం, శ్రీలంకపై 30, వియత్నాంపై 20 శాతం, ఇండోనేసియాపై 19 శాతం చొప్పున ట్రంప్ టారిఫ్ విధించారు. వాణిజ్య ఒప్పందంలో భాగంగా జపాన్ పై 15 శాతం టారిఫ్ ప్రకటించారు.

## బీసీల మద్దతు కరువైంది

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులను అనేక రాష్ట్రాలకు బీసీ సీఎంలను నియమించిన ఘనత బీజేపీదేనని స్పష్టం చేశారు. కేంద్రంపై నెపం మోపి బీసీ రిజర్వేషన్ల నుంచి తప్పుకోవాలని కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదనీ, యూపీ, బెంగాల్, బీహార్ తరహాలోనూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కనుమరుగు కావడం ఖాయమన్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో బీసీలకు పూర్తిగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందనీ, తీరా చూస్తే బీసీ బిల్లు పేరుతో అందులో 10 శాతం రిజర్వేషన్లను బీసీలకు కట్టబెట్టాలనుకుంటోందని ఆరోపించారు. పక్కా ప్లాన్ ప్రకారమే తెలంగాణలో మెజార్టీ హిందువులను మైనార్టీలుగా చేసే కుట్ర జరుగుతోందనీ, ఎందుకంటే ముస్లింలకు 100 శాతం రిజర్వేషన్లు అమలు చేసి హిందువులను మైనార్టీలుగా చేసే కుట్రలకు కాంగ్రెస్ పాల్పడుతోందని ఈ సందర్భంగా బండి సంజయ్ విమర్శించారు.

## 31న చైనాకు మోడీ

ఖరారైన ప్రధాని పర్యటన షెడ్యూల్

షాంఘై సహకార సదస్సు సందర్భంగా షీ జిన్‌పింగ్‌తో భేటీ

**ఢిల్లీ, ఆగస్టు 6:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ త్వరలో చైనాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ ఖరారైంది. తియాంజిన్ వేదికగా ఆగస్టు 31, సెప్టెంబర్ 1 తేదీల్లో జరగనున్న షాంఘై సహకార సదస్సులో ఆయన పాల్గొననున్నారు. గల్వాన్ ఘటన తర్వాత ప్రధాని మోదీ చైనాలో పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో మోడీ ప్రత్యేకంగా భేటీ అయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. 2015లో తొలిసారి బీజింగ్ వెళ్లిన భారత ప్రధాని ఇప్పటివరకు ఐదుసార్లు ఆ దేశంలో పర్యటించారు. 2019లో చివరిసారిగా చైనాలో పర్యటించారు. ఆ తర్వాత 2020లో లద్దాఖ్ సరిహద్దుల్లో భారత్-చైనా సైనిక ఎల మధ్య ఘర్షణతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటి పునరుద్ధరించేందుకు సైనిక, దౌత్యాధికారుల మధ్య అనేక దఫాల్లో చర్చలు జరిగ్గా ఇటీవలే కొంత పురోగతి కనిపిస్తోంది.

## 28 మంది కేరళ పర్యాటకుల గల్లంతు

- ఉత్తరాఖండ్ వరదల్లో చిక్కుకుపోయిన వందలాది మంది టూరిస్టులు

**డెహ్రాడూన్, ఆగస్టు 6:** ఉత్తరాఖండ్‌లో మెరుపు వరదల కారణంగా 28 మంది పర్యాటకుల బృందం ఆచూకీ గల్లంతైంది. వీరిలో 20 మంది మహారాష్ట్రలో స్థిరపడిన మలయాళీలు కాగా.. మిగిలిన 8 మంది కేరళలోని వివిధ జిల్లాలకు చెందినవారిగా గుర్తించారు. ఈ బృందంలోని ఓ జంట బంధువు మీడియాతో మాట్లాడుతూ వారితో మాట్లాడి ఒక రోజు గడిచిందన్నారు. తాము మాట్లాడినప్పుడు "ఉత్తరకాశీ నుంచి ఉదయం 8.30కు గంగోత్రికి బయల్దేరినట్లు వెల్లడించారు. వారి మార్గంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఆ తర్వాత నుంచి వారితో ఎటుంటి కాంటాక్టు లేదు. ఫోన్లలో బ్యాటరీ అయిపోయిందా.. లేక వారున్న చోట సిగ్నల్ లేదా అనేది అర్థం కావడంలేదు" అని పేర్కొన్నారు. గంగోత్రికి వెళ్లే మార్గంలో ధరాలీ కీలకమైన స్టాప్. నిన్న భారీగా మెరుపు వరద విరుచుకుపడింది. క్షణాల్లో భవనాలు మట్టి కింద కూరుకుపోయాయి. ఇప్పటికే ఐదుగురు మృతి చెందినట్లు ప్రకటించారు. డజన్ల మంది ఆచూకీ గల్లంతైంది.

## మా బకాయిలు ఇప్పించండి

(మొదటి పేజీ తరువాయి)

సందర్భంగా హెచ్‌ఆర్సీ వద్ద తెలంగాణ సర్పంచ్‌ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సుర్వి యాదయ్య గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... తాము అధికారంలోకి వస్తే బకాయిలు వెంటనే చెల్లిస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ప్రభుత్వం వచ్చి 20 నెలలైనా ఒక్క బిల్లు రాలేదని ఆవేదన వ్యక్తంచేశారు. అప్పుల బాధతో కొంతమంది సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నారని అన్నారు. సొంత డబ్బులతో అభివృద్ధి పనులు చేస్తే తమకు బిల్లులు చెల్లించకుండా తీవ్ర ఇబ్బందుతకి గురిచేయడం తగదని హితవు పలికారు. నెలలు గడుస్తున్నప్పటికి తమకు ఇవ్వాల్సిన బకాయిలు మాత్రం ఇవ్వడం లేదన్నారు. రెండు రూపాయల వడ్డీకి తెచ్చి తమ గ్రామాలను అభివృద్ధి చేశామని, బిల్లులు రాక... వడ్డీలు కట్టలేక సర్పంచ్‌ల పరిస్థితి దారుణంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. రూ.1300 కోట్ల పైనే బకాయిలు పెండింగ్ ఉన్నాయని, కేంద్రం నుంచి వచ్చిన రూ.600 కోట్లు ఎక్కడికి పోయాయని వారు ప్రశ్నించారు. తమకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని, లేదంటే నిరాహార దీక్షకు సైతం దిగుతామని హెచ్చరించారు.

## బకాయిల కోసం మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

- డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద కార్మికుల అరెస్ట్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** గత ఐదు నెలలుగా జీతాలు, పెండింగ్ బిల్లులు రాక తెలంగాణ వ్యాప్తంగా మధ్యాహ్న భోజన కార్మికుల తీవ్ర ఇబ్బందులు పడుతున్న సంగతి తెలిసిందే. తమ పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మధ్యాహ్న భోజన కార్మికులు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చి, డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. మహిళా కార్మికులందరినీ బలవంతంగా పోలీసు వ్యాన్లలో ఎక్కించి, ఆయా పోలీసు స్టేషన్లకు తరలించారు.పెండింగ్ బకాయిలు చెల్లించకపోవడమే కాకుండా తమను అరెస్టు చేయడంపై మహిళా కార్మికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదేనా ఇందిరమ్మ రాజ్యం..? ఇదేనా ప్రజా పాలన? అని వారు మండిపడ్డారు.

## ప్రధాన కార్యదర్శికి జాతీయ మానవ హక్కుల కమిషన్ షోకాజ్

(మొదటి పేజీ తరువాయి)

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై పోలీసులు ఇచ్చిన నివేదికపై ఎన్హెచ్ఆర్సీ అసంతృప్తి వ్యక్తం చేసింది. మృతురాలి కుటుంబానికి రూ.5లక్షలు పరిహారం అందించేలా ఆదేశాలు ఎందుకు ఇవ్వకూడదో చెప్పాలని ఆదేశించింది. 'ప్రీమియర్ షోకి పోలీసుల అనుమతి లేదని రిపోర్టులో తెలిపారు. అనుమతి లేకుంటే నటుడు, అభిమానులు ఎందుకొచ్చారో తెలియట్లేదు. ముందే చర్యలు తీసుకొని ఉంటే తొక్కిసలాట ఘటన జరిగేది కాదు. పూర్తిస్థాయి దర్యాప్తు చేసి 6 వారాల్లోపు మరో నివేదిక అందజేయాలి' అని సీఎస్‌ను ఆదేశించింది. నిష్పక్షపాతంగా దర్యాప్తు పూర్తిచేయాలని సీపీకి సూచించింది.

## నాయిన చెప్పినట్లుగానే చేసినం

- బీసీలను కాంగ్రెస్, బీజేపీ మోసం చేస్తున్నయ్?
- అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని కవిత డిమాండ్

**హైదరాబాద్, మనం ప్రతినిధి:** తెలంగాణ సిద్ధాంతకర్త, అలుపెరుగని పోరాట యోధుడు, మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను జూబ్లీహిల్స్‌లోని కార్యాలయంలో తెలంగాణ జాగృతి ఆద్వర్యంలో బుధవారంనాడు ఘనంగా నిర్వహించారు. ఆయన ఆలోచనలను తు.చ. తప్పకుండా పాటించామని ఎమ్మెల్సీ కవిత చెప్పారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... ఉద్యమ సమయంలో మా నాయన కేసీఆర్ చెప్పినట్లుగా తాము చేశామని, ఆయన సూచనలతోనే తెలంగాణ జాగృతి ముందుకెళ్లిందని ఆమె తెలిపారు. తెలంగాణ అస్తిత్వం, వనరులు, సాంస్కృతిక వైరుధ్య పరిరక్షణ కోసం ఏర్పాటైనదే జాగృతి అని ఆమె చెప్పారు. అలా ఉద్యమ స్ఫూర్తితో మొదలైన తెలంగాణ జాగృతి, బీసీల కోసమే... వారి తరఫున తామే ముందుండి అనేక పోరాటాలు నిర్వహించబోతున్నామని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు. బీసీలను కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు మోసం చేస్తున్నాయని కవిత అన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ చేస్తున్న ధర్నాపై విమర్శలు గుప్పించారు. ఈ ధర్నా వల్ల ఎలాంటి ఉపయోగం లేదని అన్నారు. రాష్ట్రపతి అపాయింట్ మెంట్ తీసుకుని అఖిలపక్షాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని పార్టీల నేతలకు ప్రభుత్వం లేఖలు రాయాలని చెప్పారు. ఈ నెల 15లోపు జాగృతి నూతన కమిటీల ఏర్పాటు ఉంటుందని కవిత తెలిపారు. జాగృతిలోకి వచ్చేందుకు ఎంతో మంది రెడీగా ఉన్నారని... తమకు అన్ని వర్గాల మద్దతు ఉందని చెప్పారు.

## ట్రంప్‌వి అవగాహన లేని మాటలు

(మొదటి పేజీ తరువాయి)

సుంకాల ప్రభావాన్ని ప్రస్తుతం అంచనా వేయడం కొంచెం కష్టమేనన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు మాత్రం వృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు. మనం ప్రతీకార సంకాలు విధిస్తే తప్ప.. మన ఆర్థిక వ్యవస్థపై పెద్దగా ప్రభావం ఉండదని చెప్పారు. "వృద్ధిపై ఇప్పటికే అంచనాలు చాలా వరకు తగ్గించాం. అంతర్జాతీయ అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో వృద్ధి అంచనాలను 6.7శాతం నుంచి 6.5శాతానికి సవరించాం. అయినప్పటికీ అంతర్జాతీయంగా అనిశ్చితి నెలకొన్న క్రమంలో సుంకాల ప్రభావం ఏ విధంగా ఉంటుందన్నది అంచనా వేయడం కష్టమే. సమాచారాన్ని ఎప్పటికప్పుడు విశ్లేషిస్తాం. ప్రస్తుతానికి జీడీపీ అంచనాలను సవరించడానికి మా వద్ద తగినంత డేటా లేదు" అని సంజయ్ మల్హోత్రా పేర్కొన్నారు.

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై..**

ప్రపంచ ఆర్థిక పరిస్థితులపై ఆర్బీఐ చీఫ్ మాట్లాడుతూ.. స్థూల ఆర్థిక పరిస్థితులను విధానపరమైన అంశాల వారీగా పర్యవేక్షిస్తూనే ఉంటామన్నారు. వాటికి తగినట్లు నిర్ణయాలు ఉంటాయని చెప్పారు. ప్రస్తుతం చాలా అనిశ్చితి కొనసాగుతోందని, వడ్డీ రేట్లలో 100 బేసిస్ పాయింట్లు ఇదివరకే తగ్గించామన్నారు. ధరల స్థిరత్వాన్ని కొనసాగిస్తూనే స్థిర వృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం చర్చల గురించి మాట్లాడుతూ.. అవి సామరస్యంగా పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## తెలంగాణలో ఒక్కో రైతుపై రూ.1.52 లక్షల అప్పు

(మొదటి పేజీ తరువాయి)

అది రూ.1.52 లక్షలుగా ఉందని రామ్ నాథ్ తెలిపారు. వివిధ రాష్ట్రాల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కేంద్ర మంత్రి ఈ వివరాలను అందించారు.



## మరోసారి భారీ వర్ష సూచన

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం
- రెండు రోజులుపాటు తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు
- ఎల్లో అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

**హైదరాబాద్, మనం ప్రతినిధి :** రుతుపవన ద్రోణి, బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణలో వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాలు భారీ వర్షాలతో తడిసి ముద్దవుతున్నాయి. అనేక చోట్ల కుంభవృష్టి కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి.

ఈ క్రమంలో తెలంగాణలో మరో రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్లగొండ, నాగర్ కర్నూల్, యాదాద్రి భువనగిరి, మహబూబాబాద్, ములుగు, సూర్యాపేట, జనగాం, పెద్దపల్లి, కరీంనగర్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్, సిరిసిల్ల, సిద్దిపేట, మంచిర్యాల, మహబూబ్ నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది.

ఈ జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. పొలాల్లో పని చేసే రైతులు, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని పేర్కొంది. సోమవారం ప్రారంభమైన ఈ వర్షాలు మంగళవారం కూడా కొనసాగాయి.

రాష్ట్రంలోని ఏడు మండలాల్లో 6 నుండి పది సెంటీమీటర్ల మధ్య వర్షపాతం నమోదయిందని తెలిపింది. ఇదిలాఉంటే, హైదరాబాద్‌లో కుండపోత వర్షాలు కురుస్తుండటంతో పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున వర్షపు నీరు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించింది. భారీ వర్షం కారణంగా డ్రైనేజీలు పొంగిపొర్లి రహదారులపైకి నీరు చేరింది. అధికారులు పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు.

## ఇగ అపుండ్రి.. దొంగ దీక్ష డ్రామాలు

- ఢిల్లీలో రేవంత్ రెడ్డి బీసీ ధర్నా అట్టర్ ఫ్లాప్..
- కూతవేటు దూరంలో ఉన్న..దొంగ దీక్షకు రాని రాహుల్ అంటూ
- ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ధర్నాపై హరీశ్‌రావు సెటైర్లు

హైదరాబాద్, మనం ప్రతినిధి : బీసీలకు 42శాతం కోటా పేరిట సీఎం రేవంత్ రెడ్డి అండ్ బ్యాచ్ ఢిల్లీ వెళ్లిన చేసిన డ్రామా అట్టర్ ఫ్లాప్ అయ్యిందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. ఢిల్లీ వేదికగా నిర్వహించిన దొంగ దీక్షకు.. కూతవేటు దూరంలో ఉండి రాహుల్ గాంధీ రాలేదని.. మాకు బీసీల కన్నా బిహారే ముఖ్యమని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే రాలేదని తెలిపారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన బీసీ ధర్నాపై హరీశ్‌రావు ట్విట్టర్(ఎక్స్) వేదికగా విమర్శలు గుప్పించారు.



## చేవెళ్లలో ఘనంగా సుష్మ స్వరాజ్ వర్ధంతి

**చేవెళ్ల, ఆగస్టు 6(మనం న్యూస్):** చేవెళ్ల పట్టణం లోని బీజేపీ నాయకులు బుధవారం సుష్మా స్వరాజ్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. సుష్మాస్వరాజ్ అనాడు పార్లమెంట్‌లో మన తెలంగాణ కోసం గట్టిగా మాట్లాడారు. తెలంగాణ యువత బలిదానాలు చేసుకోవద్దు. మీరు బంగారు తెలంగాణను చూడాలని మనోధైర్యాన్ని నింపిన ఘనత ఆమెదన్నారు. తెలంగాణ ప్రజల హృదయాలలో చిర స్థాయిగా తెలంగాణ చిన్నమ్మగా నిలిచిపోతుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల రూరల్ అధ్యక్షులు శ్రీకాంత్, బీజేపీ నాయకులు శర్వ లింగం, జై శంకర్, చీర, శ్రీనివాస్, కుంచం శ్రీనివాస్, పత్తి సత్యానారాయణ అశోక్, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి , శ్రీనివాస్, శివ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, మధుకర్ రెడ్డి, రవి, శంకరాచారి, పాగా వెంకటేష్, బాల్‌రెడ్డి, గోవర్ధన్, కృష్ణమోహన్, గణేష్, ప్రకాష్, దామోదర్, యాదయ్య, రాఘవేందర్ రెడ్డి, రమేష్, జైసింహా రెడ్డి, రాఘవేందర్, వెంకటేష్ పాల్గొన్నారు.

# ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం ఇచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారులు

**తుర్క యంజాల్, ఆగస్టు 6(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం తెలంగాణ సిద్ధాంత కర్త పేరు కాంచన మహానీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి జయంతి వేడుకలో పాల్గొని, ప్రజా గాయకుడు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వ్యక్తి అమరవీరుల స్తూపం దగ్గర గద్దర్ ఫోటోకి పూలమాల వేసి వర్ధంతి వేడుకను జరుపుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తానన్నటువంటి 250 గజాల ఇంటి స్థలం అదేవిధంగా 25 వేల పెన్షన్ తెలంగాణ ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి కలిసి మెమోరాండం ఇవ్వడం జరిగింది.



ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగే విష్ణువర్ధన్, ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కారింగుల నరేందర్ గౌడ్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బోసు పల్లి వీరేశం, నక్క జంగయ్య గౌడ్, ఇబ్రహీంపట్నం ఇంచార్జ్ దక్షిణ తెలంగాణ కన్వీనర్ దుగ్గాణి శ్యామల, అంబర్పేట్ మున్సిపల్ అధ్యక్షుడు జోర్క రాము ముదిరాజ్, తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు అందేకర్ బాబూలాల్, చిత్రం కృష్ణ,పెద్ద అంబర్పేట్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఎల్బీనగర్ ఇంచార్జ్ భాను ప్రకాష్ రెడ్డి, కాటిపాక స్కైలాబ్,వరలక్ష్మి, నీరజ రాధ, సురేష్, బచ్చి గళ్ళ రమేష్, సీనియర్ ఉద్యమ నాయకుడు రాజు నాయక్, పెద్ద ఎత్తున ఉద్యమకారులు పాల్గొనడం జరిగింది.

# నూతన వసతి గృహాలు నిర్మించాలి: ఎస్ఎఫ్ఐ

- ఆర్డీవో కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా
- వసతి గృహాలు వెంటనే చేపట్టకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తాం
- ఎస్ఎఫ్ఐ నాయకుల డిమాండ్



**చేవెళ్ల, ఆగస్టు 6(మనం న్యూస్):** నూతన ఎస్సీ బాలుర, బాలికల కళాశాల వసతి గృహాలను వెంటనే నిర్మించాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్, అరుణ్ కుమార్ లు డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చేవెళ్ల మండల కేంద్రంలో ప్రభుత్వ ఎస్సి బాలికల, బాలుర నూతన వసతి గృహాలు నిర్మించాలని ఆర్డిఓ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు ఎర్రవల్లి శ్రీనివాస్ బేగరి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, 2018 సంవత్సరంలో చేవెళ్ల ఎస్సీ బాలికల బాలుర కళాశాల హాస్టల్స్ మంజూరు అయ్యాయని అప్పటి నుంచి ఇప్పటి వరకు అద్దె భవనాలలో కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఇచ్చే అద్దె సరిపోక అద్దె భవనాల యజమానులు హాస్టల్స్ నిర్వహణ కోసం భవనాలను ఇవ్వకపోవడం వల్ల హాస్టల్స్ మూతపడే ప్రమాదం ఉందని అన్నారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ అధికారులు స్పందించి నూతన ఎస్సీ బాలుర బాలికల కళాశాల వసతి గృహాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. కళాశాల వసతి గృహాలు నిర్మించకపోవడం వల్ల ఈ సంవత్సరం ఫస్ట్ ఇయర్ విద్యార్థులు చాలా మంది విద్యకు దూరం అయ్యారని, పేద విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని వెంటనే నూతన భవనాలు నిర్మించాలని అన్నారు . వచ్చే విద్యా సంవత్సరం నాటికి నూతన కళాశాల వసతి గృహాలు నిర్మించాలని లేనిపక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ సహాయ కార్యదర్శి చరణ్ గౌడ్, చేవెళ్ల డివిజన్ ఉపాధ్యక్షుడు యశ్వంత్, ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు మాల చందు, మణి గౌడ్, భరత్, సాయి చరణ్, వినీత్, సన్నీ గౌడ్, రాము, అభిరామ్, విష్ణు, వేణు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని తహసీల్దార్‌కు వినతి



**రంగారెడ్డి, ఆగస్టు 6(మనం న్యూస్):** సరూర్ నగర్ డివిజన్ కొత్తపేట చౌరస్తాలోని ఓల్ రంగారెడ్డి కోర్టు స్థలాన్ని బీసీ సమాజం కోసం కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని కోరుతూ సరూర్ నగర్ తహసిల్దార్ వేణుగోపాల్‌కు కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాత కోర్టు స్థలాన్ని హెచ్ఎండిఏ నుంచి ప్రభుత్వమే స్వాధీనం చేసుకొని అక్కడ బీసీ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మించాలని, తద్వారా బీసీ సామాజిక వర్గాలకు ఆర్థిక అభివృద్ధికి మార్గం వేయాలని వినతి పత్రం అందజేయడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నుంచి శ్రీధర్ గౌడ్, ముదిరాజ్ సంఘం నుంచి జైన్ బాబు, కుమ్మర సంఘం నుంచి మల్కాజ్గిరి కుమార్, పద్మశాలి సంఘం నుంచి పున్న భాస్కర్ , బహుసార్ క్షత్రియ సంఘం నుంచి నందకుమార్ , కబీర్ దాస్, గోవర్ధన్, సుభాష్, ప్రవీణ్, కాటం రాజు, ఎం జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం వెంటనే బీసీ బిల్లును ఆమోదించాలి

- కాంగ్రెస్ నేత కాట శ్రీనివాస్ గౌడ్
- ఢిల్లీలో జరిగిన ధర్నాలో పాల్గొన్న కాట



**రామచంద్రాపురం, ఆగస్టు 6(మనం న్యూస్):** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తూ తీసుకొచ్చిన బిల్లును కేంద్రం వెంటనే ఆమోదించాలని కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాటా శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా ధర్నాలో కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరైన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోద రాజనర్సింహాతో కలిసి కాటా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ..బీసీల హక్కుల సాధన కోసం కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ముందుంటుందని చెప్పారు. దేశవ్యాప్తంగా బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రం పట్టించుకోవడం లేదని అన్నారు. బిసి బిల్లుపై పార్లమెంట్లో చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ బిల్లు విషయంలో బిజెపి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని మండిపడ్డారు. బీసీ బిల్లును ఆమోదించేంత వరకు కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తదని కాట శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

# నేపాల్‌లో ఏషియన్ ఛాంపియన్ షిప్ లాఠీ పోటీలు

- పతకాలు సాధించిన ఢిల్లీ వరల్డ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు




**రామచంద్రాపురం, ఆగస్టు 6(మనం న్యూస్):** నేపాల్ దేశంలో జరిగిన ఏషియన్ లాఠీ ఛాంపియన్ షిప్ పోటీలలో పటాన్ చెరు నియోజకవర్గంలోని పటేల్ గూడాలో ఉన్న ఢిల్లీ వరల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు విజయం సాధించారు. లాఠీ పోటీలలో కార్తికా రెండు బంగారు పతకాలు, శ్రీవల్లి రెండు రజత పతకాలు, శాన్వి శ్రీ ఒక్క బంగారం, ఒక్క రజత పతకం సాధించారు. ఈ పతకాలు సాధించడం పట్ల తమకెంతో గర్వంగా ఉందని విద్యార్దినులు తెలిపారు. మన దేశం నుండి నేపాల్ వెళ్ళి పోటీలో పాల్గొనడమే కాకుండా మెడల్స్ సాధించడం చాలా సంతోషంగా ఉందని, తమకు అన్ని విధాల ప్రోత్సహించి, సహకరించిన తమ తల్లిదండ్రులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

ముఖ్యంగా తమ మాస్టర్ మహమ్మద్ అక్బర్ ఖాన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో ఇలాంటి అవకాశాలు వస్తే విజయం సాధించి భారతదేశ ప్రతిష్ట పెంచుతామని చెప్పారు.

## ఇన్‌స్పెక్టర్ సైదులును మర్యాద పూర్వకంగా కలిసిన శివప్రకాష్

**రంగారెడ్డి, ఆగస్టు 6(మనం న్యూస్):** చైతన్య పురి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా పదవీ బాధ్య తలు చేపట్టిన కే.సైదులుని బీఆర్ఎస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. వారిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయ కులు శివప్రకాష్, చైతన్యపురి బీఆర్ఎస్ డివిజ న్ ప్రెసిడెంట్ నాగలక్ష్మి ఉన్నారు. కాగా, ఇంకా కార్యక్రమంలో యాదగిరి ముదిరాజు, బ్రహ్మ చారి, అజయ్ కుమార్, రాకేష్, రామ్మోహన్, ప్రవీణ్ చారి, శరత్, గణేష్, పవన్, తరుణ్, వెంకట్, ఆసిఫ్, వల్లీ, నరేష్ పాల్గొన్నారు.



# విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలి

- చిలుక ఉపేందర్ రెడ్డి

**రంగారెడ్డి, ఆగస్టు 6(మనం న్యూస్):** విధి నిర్వహణలో అంకితభావంతో పని చేయాలి అని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. చైతన్య పురి పోలీస్ స్టేషన్‌లో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సర్కిల్ ఇన్ స్పెక్టర్ సైదులు ను మర్యాద పూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేసి, జ్ఞాపికను అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చిలుక ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు.



ఈ కార్యక్రమంలో ఖిల్లా మైసమ్మ దేవాలయం ఛైర్మెన్ కుంచారపు సురేంద్ర కుమార్ (సురేష్), పెద్దవూర సైదులు, లింగ స్వామి గౌడ్, యాదవ రెడ్డి, షేక్ నాభీ, కృష్ణా రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, పగడాల ఎల్లన్న, ఇస్మాయిల్, విప్లవ్, సలీమ్, డాల్లి, మాచర్ల వరుణ్, గోవింద్ భువనేశ్వర్, హనుమంత్, శేఖర్, సతీష్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.



గత కొన్ని రోజులుగా సరూర్ నగర్ సర్కిల్ -05 టీఐ ఆనంద్ కుమార్ ఏఎంసీ శ్రీనివాస్, డీసీ సుజాతల పై అసత్య ఆరోపణలు చేస్తున్న వి.శ్రీశైలం (బిల్ కలెక్టర్) ప్రచారాన్ని ఖండిస్తూ ఎల్బీ నగర్ జోన్ జాయింట్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న ఎల్బీనగర్ జోన్‌కు సంబంధించిన 1,2,3,4,5సర్కిల్ ఉద్యోగులు, జీహెచ్ఎంసీ రెవెన్యూ అసోసియేషన్.
*-రంగారెడ్డి, మనం న్యూస్*

# జయశంకర్ సదాస్మరణీయుడు

- చేవెళ్ల మున్సిపల్ భాజపా అధ్యక్షులు అనంత్ రెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 6(మనం న్యూస్): తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని భాజపా చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షులు అనంతరెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ ఏర్పాటే లక్ష్యంగా అలు పెరుగని పోరాటం సాగించి ఆచార్య కొత్తపల్లి జయ శంకర్ త్యాగం చిరస్మరణీయమన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఎనలేని కృషి చేసిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ సదాస్మరణీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, విశ్వకర్మ నాయకులు పాల్గొన్నారు.

# 10వ తేదీ వరకు మహేందర్ రెడ్డి ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరం

**చేవెళ్ల, ఆగస్టు 6(మనం న్యూస్):** ఎముకలు, కీళ్ల వ్యాధులతో బాధపడుతున్న వారి కోసం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని పట్నం మహేందర్ రెడ్డి జనరల్ ఆసుపత్రిలో ఈ నెల 10వ తేదీన వరకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మెడికల్ సూపరిండెంట్ డా. రామకృష్ణారెడ్డి తెలిపారు.

ఇందులో భాగంగా నిపుణులైన ఆర్థోపెడిక్ వైద్యులతో రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు సైతం ఉచితంగా చేస్తామని వెల్లడించారు. గత ఆరు నెలల కాలంలో 45 మందికి మోకీలు మార్పిడి, తుంటి ఎముక మార్పిడి చికిత్సలు విజయవంతంగా నిర్వహించామన్నారు. ఎముకలు, కీళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్థోపెడిక్ వైద్యులు డా. సాయి విక్రాంత్, వంశీ తదితరులు ఉన్నారు.






ఇటీవల చైతన్యపురి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న సైదులును మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ డా. వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్. ఆయన వెంట మిత్రులు అరుణ్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.
***- రంగారెడ్డి, మనం న్యూస్;***

**CHANGE OF NAME**

I,GYANUGAPYATA PURNIMA RAO, W/o. GYANUGAPYATA VENKAT RAO, R/o. 1-3-49/147, Janaki Nagar Colony, Old Alwal, Hyd-500010. T.S., my name variviouslymentioned My Documents as GYANU-GAPYATA PURNIMA RAO mentioned in my Aadhaar Card (937651163265) Pan Card (AWJPK0413G) Hence hereafter My Name is Changed from PURNIMA (mention in my SSC) to **GYANUGAPYATA PURNIMA RAO** (Correct Name).

## ముఖ పుస్తకం

ఎన్నెన్ని ముఖాలను దాచుకుందో
ఎన్నెన్ని రంగుల్ని పోగేసుకుందో
అరచేతి మాయా దర్పణంలా మారి
ఎంతమందిని నాలోకి కలిపేసిందో
ఎన్ని చిత్రాలను కనువిందు చేసిందో
ఉన్నవి లేనివి అన్నింటినీ కలిపేస్తూ
కొత్త హంగుల ప్రపంచాన్ని చూపించింది

రూపురేఖలకు సున్నం కొట్టేస్తూ
ఎంతబాగా మైకం కమ్మించిందో
అక్షరాలతో మాట్లాడిస్తూ
ఎంత ఈజీగా లక్షణాల్ని దాచేసిందో
మంచి చెడును తెరపైన కలిపేస్తూ
ఎంత కమ్మగా నమ్మకాన్ని సృష్టించిందో
ముఖాముఖిలో ఆనందాన్ని
ముచ్చటగా మోముపై పరిచేస్తూ
ఎంత తెలివిగా చేయి చేయి కలిపిందో

ముఖ పుస్తకంలో పేజీలకు సంఖ్య లేదు
తిరగేసే కొద్దీ కొత్త కొత్త పరిచయాలు
వాక్యాలుగా పుట్టుకొస్తాయి
ఎంత చమత్కారంగా పలకరిస్తుందో
ఎంత వయ్యారంగా కళ్ళను మెప్పిస్తుందో
అలసిపోని చేయి సొలసిపోని మనసు
నిండుగా దండిగా వుండాలే గానీ
కొత్తబంగారులోకం చూపించేస్తుంది

గాలికెగిరే చెత్తకు కూడా రంగులద్ది
ఆకర్షణతో చుట్టూ తిప్పుకుంటుంది
ఎంత చిక్కగా అల్లుకుపోతుందో
ఎంత గొప్పగా కళ్ళను నమ్మిస్తుందో
పాతాళంలో వున్నా కూడా
ప్రపంచానికి పరిచయం చేస్తుంది
అతికించిన బొమ్మలతో కనువిందు చేసి
మతి చెదిరే విన్యాసం చేయిస్తుంది
ఎంత నిండుగా హత్తుకుపోతుందో
ముఖ పుస్తకమంటే మాటలు కాదుగా

**- నరెద్దుల రాజారెడ్డి**
9666016636

# హరిత విప్లవ పితామహుడు స్వామినాథన్



భారత వ్యవసాయ రంగాన్ని శాశ్వతంగా మార్చిన మహా మానవుల్లో అగ్రగణ్యుడు డాక్టర్ మంకొంబు సాంబశివన్ స్వామినాథన్. దేశానికి హరిత విప్లవాన్ని అందించిన శాస్త్రవేత్తగా, రైతుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన మార్గదర్శిగా, పౌరహక్కుల పరిరక్షకుడిగా, ఆయన వ్యక్తిత్వం విశ్వ వ్యాప్తి సాధించింది. ఆయన శాస్త్రీయ విజ్ఞానం, దూరదృష్టి, రైతుల పట్ల గల అపారమైన ప్రేమ భారత దేశాన్ని ఆహార దిగుమతి దారుడిగా ఉండే స్థితి నుంచి ఆహారస్వావలంబ దేశంగా తీర్చిదిద్దింది. 1925 ఆగస్టు 7న తమిళనాడులోని తంజావూరు జిల్లాలోని కంబం గ్రామంలో జన్మించిన స్వామినాథన్ పూర్తి పేరు మంకొంబు సాంబశివన్ స్వామినాథన్. తండ్రి ఎం.కే. సాంబశివన్ ప్రఖ్యాత వైద్యుడు. ఆయన ఆశయాన్ని కొనసాగిస్తూ వైద్యవృత్తిలో ప్రవేశించాలన్న ఆలోచన కలిగిన స్వామినాథన్, 1943లో బెంగాల్లో సంభవించిన తీవ్ర కరువు దృశ్యాలను చూసి చలించిపోయి, వ్యవసాయ రంగాన్ని తన జీవిత ధ్యేయంగా ఎంచుకున్నారు. మద్రాస్ యూనివర్సిటీలో ప్రాకృత శాస్త్రంలో పట్టభద్రుడైన తరువాత, న్యూఢిల్లీకి చెందిన ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్లో వ్యవసాయ శాస్త్రంలో స్పెషలైజేషన్ చేశారు. అనంతరం కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయం, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో విత్తన శాస్త్రంపై అధ్యయనం కొనసాగించి, నార్మన్ బోర్లాగ్ ప్రభావంతో మెక్సికన్ గోధుమ వంగడాలపై ప్రయోగాలు ప్రారంభించారు.

భారతదేశం 1960వ దశకంలో తీవ్రమైన ఆహార కొరతతో బిక్కుబిక్కు మంటున్న వేళ, విదేశాల నుంచి గోధుమల దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. అటువంటి సమయంలో నార్మన్ బోర్లాగ్ అభివృద్ధి చేసిన పొట్టి గోధుమ జాతులను భారత భూముల కనుగుణంగా మార్చి, దేశ వ్యాప్తంగా అధిక దిగుబడి విత్తనాలను అభివృద్ధి చేసి, రైతులకు అందించడంలో స్వామినాథన్ కీలకపాత్ర పోషించారు. ఇందిరా గాంధీ ప్రభుత్వానికి శాస్త్రీయ సలహాదారుగా వ్యవహరించిన ఆయన సూచనలతో దేశవ్యాప్తంగా హరిత విప్లవం విస్తరించ గలిగింది. గోధుమలతో పాటు బియ్యం, మక్క, జొన్న వంటివి కూడ అధిక దిగుబడిగా పండించ గలగడం వల్ల దేశం ఆహార భద్రత పరంగా స్వయం సమృద్ధిని సాధించింది. వ్యవసాయ ఉత్పాదకత పెరిగినా, అది రైతుల జీవితాల్లో అనుకూల మార్పులు తీసుకు రావలసిన అవసరాన్ని గుర్తించిన స్వామినాథన్, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడంలో పాలకులకు మార్గ నిర్దేశం చేశారు. 2004లో ఏర్పడిన రైతులపై జాతీయ సంఘానికి (National Commission on Farmers) అధ్యక్షత వహించిన ఆయన సూచనలతోనే వెలువడిన నివేదికలు స్వామినాథన్ కమిషన్ నివేదికలుగా ప్రసిద్ధిపొంది, నేటికీ రైతు ఉద్యమాలకు ఆధారంగా నిలిచాయి. ఆ నివేదికల్లో సూచించిన కనీస మద్దతు ధర (MSP) విధానం, రైతుల ఆదాయ భద్రతకు అవసరమైన చట్టపరమైన హామీ, సాగు భూమి పరిమితులు, వ్యవసాయ రుణ భారం, నీటి వనరుల సమగ్ర విధానం వంటి అంశాలు విపరీత ప్రాధాన్యతను సంపాదించాయి.

హరిత విప్లవ ఫలితంగా ఉత్పాదకత పెరగడం వలన రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగం పెరిగి, పర్యావరణానికి, భూమికి హాని కలుగుతున్నదీ ఆయన ముందుగానే గుర్తించారు. అందుకే 1990లో సతత హరిత విప్లవం అనే భావనను ప్రతిపాదించారు. ఇది పర్యావరణ పరిరక్షణతో పాటు నేల ఆరోగ్యాన్ని, నీటి వినియోగ సమర్థతను మెరుగు పరచే విధానాలపై దృష్టి కేంద్రీకరించింది. ఈ సిద్ధాంతంతో వ్యవసాయాన్ని దీర్ఘకాలికంగా సుస్థిరంగా కొనసాగించ వచ్చన్న భావనను ప్రచారంలోకి తెచ్చారు. మద్రాసులో స్థాపించిన ఎం.ఎస్. స్వామినాథన్ రీసెర్చ్ ఫౌండేషన్ గ్రామీణ శాస్త్రీయ పరిజ్ఞాన వికేంద్రీకరణకు, జీవవైవిధ్య పరిరక్షణకు, మహిళల ఆర్థిక శక్తి వృద్ధికి, పేదల జీవితాలలో ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఎంతో కృషి చేసింది. ఇదే సమయంలో అంతర్జాతీయ స్థాయిలో ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (IRRI), ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ (FAO) వంటి సంస్థలకు ఆయన సేవలందించారు.

స్వామినాథన్ జీవితంలో అనేక గౌరవాలు వరుసగా వచ్చాయి. పద్మశ్రీ (1967),రామన్ మెగసెసే అవార్డు (1971), పద్మ భూషణ్ (1972), పద్మవిభూషణ్ (1989), ప్రపంచ ఆహార బహుమతి -(World Food Prize) తొలి విజేతగా (1987), ఇందిరా గాంధీ శాంతి బహుమతి (1999), ఫారిన్ అసోసియేట్ ఆఫ్ యుఎస్ నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వంటి పురస్కారాలు ఆయన సేవలకు గుర్తింపుగా లభించాయి. చివరికి 2024లో భారత ప్రభుత్వం ఆయనకు మరణానంతరంగా అత్యున్నత పౌర పురస్కారం భారతరత్నను ప్రకటించింది. ఇది దేశ వ్యవసాయానికి చేసిన అపూర్వ సేవలకు భారత జనత ఇచ్చిన మహోన్నత కృతజ్ఞత.

2023 సెప్టెంబరు 28న 98 సంవత్సరాల వయస్సులో స్వామినాథన్ మద్రాసులో తుదిశ్వాస విడిచారు. భారత వ్యవసాయ రంగానికి గానే కాక, రైతు జీవితానికి, సమాజానికి, భవిష్యత్ ఆహార భద్రతకు ఆయన చూపిన మార్గం చిరస్మరణీయంగా నిలుస్తుంది. ఆయన నమ్మకం - వ్యవసాయం అనేది కేవలం ఆహార ఉత్పత్తికి మాత్రమే కాదు, అది జీవన విధానానికి మూలాధారం అనే సిద్ధాంతం నేటి సమస్యల సమాధానాల్లో వెలుగు చూపిస్తోంది. మంకొంబు సాంబశివన్ స్వామినాథన్ గారు ఒక శతాబ్దపు శాస్త్రవేత్త మాత్రమే కాక, సార్వభౌమ రైతు హక్కుల చైతన్య దాతగా భారత చరిత్రలో అక్షరాల చిరస్థాయిగా నిలిచిపోతారు.

**ఆగస్టు 7...యం.యస్.స్వామినాథన్ జయంతి**

**- రామ కిష్టయ్య సంగన భట్ల**
9440595494

# చేనేతకు చేయూతనిద్దాం





చేనేత, ప్రసిద్ధి చెందిన ఒక కుటీర పరిశ్రమ. పద్మశాలీ, దేవాంగ, తొగట, తొగటవీర క్షత్రియ, పట్టుశాలి, జాంద్ర, స్వకులసాలి, కైకాల, కుర్ణి, కర్ణ భక్తులు, కరికాల భక్తులు, భవసార క్షత్రియ, నీలి, నీలకంత, నెస్సి, కురిమిచెట్టి, కత్రి, సెంగుందంల కుల వృత్తి. ఈ పరిశ్రమకు అనుసంధానంగా మరికొన్ని చేతి పనులు వృత్తులు ఉన్నాయి. పడుగు (వార్పు), పేక (ఫిల్లింగ్ థ్రెడ్)లు ఒకదానితో ఒకటి అనుసంధానించబడే విధానాన్ని నేత అంటారు. నిలువు వరుస దారాలను కలిపి 'పడుగు' అని, అడ్డు వరుస దారాలను కలిపి 'పేక' అని పిలుస్తారు. అందులో చేతితో మగ్గంపై నేతనేసే విధానాన్ని చేనేతగా పిలుస్తారు.

జాతీయ చేనేత దినోత్సవం 1905 సంవత్సరంలో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమాన్ని స్మరించుకోవడానికి జరుపుకుంటారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది చేనేత కార్మికులు మరియు చేతివృత్తుల వారికి జీవనోపాధిని అందించే భారతదేశ ఆర్థిక వ్యవస్థలో చేనేత పరిశ్రమ గణనీయమైన పాత్ర పోషించింది, పోషిస్తుంది.

ఈ రోజున, చేనేత ఉత్పత్తుల అందాలను ప్రదర్శించడానికి మరియు వాటిని కొనుగోలు చేయడానికి ప్రజలను ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు మరియు ప్రదర్శనలు నిర్వహిస్తారు. భారతదేశ దేశీయ సంస్కృతిని కాపాడటంలో చేనేత నేత కార్మికులు పోషించే పాత్రను పరిగణనలోకి తీసుకోవడం చాలా ముఖ్యం. అత్యంత గొప్ప పాత్ర పోషించేదిగా చెప్పవచ్చు.

జాతీయ చేనేత దినోత్సవం ప్రతి సంవత్సరం ఆగస్టు 7న జరుపుకొంటారు. ఈ దినం శతాబ్దాలుగా భారతదేశ వస్త్ర పరిశ్రమకు వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికులకు ప్రత్యేకంగా భావించవచ్చు. ప్రస్తుతం ఈ ప్రాముఖ్యత మరింత పెరిగింది. ఎందుకంటే ప్రపంచం పెరుగుతున్న పర్యావరణ సంక్షోభాన్ని మరియు స్థిరత్వం గురించి పెరుగుతున్న ఆందోళనలను ఎదుర్కొంటోంది. చేనేత నేయడం పవర్ లూమ్స్ (మరమగ్గాలు) ద్వారా తయారయ్యే వస్త్రాలకు పర్యావరణ అనుకూలమైన మరియు స్థిరమైన ప్రత్యామ్నాయం.

భారతదేశంలోని లక్షలాది చిన్న-స్థాయి చేనేత కార్మికుల జీవనోపాధికి మద్దతు ఇస్తుంది. పారిశ్రామికీకరణ మరియు సామూహిక ఉత్పత్తి పెరుగుదల అనేక మంది చేనేత కార్మికుల జీవనోపాధికి ముప్పు తెచ్చిపెట్టింది.

1905లో కలకత్తాలో బాల గంగాధర్ తిలక్, లాలా లజపతిరాయ్, మరియు బిపిన్ చంద్ర పాల్ వంటి ప్రముఖ నాయకులు ప్రారంభించిన స్వదేశీ ఉద్యమం జ్ఞాపకార్థం ఆగస్ట్ 7వ తేదీని ఎంచుకున్నారు. ఈ ఉద్యమం బ్రిటిష్ పాలన నుండి స్వాతంత్ర్యం కోసం భారతదేశ పోరాటంలో ముఖ్యమైన పాత్ర పోషించిన చేనేత వస్త్రాలతో సహా భారతీయ నిర్మిత వస్తువులను ఉపయోగించాలని సూచించింది. భారతదేశంలో చేనేత నేయడం గురించిన మొట్టమొదటి సూచనలు సుమారు క్రీ.పూ. 1500 నాటివి. శతాబ్దాలుగా, చేనేత పరిశ్రమ అభివృద్ధి చెందుతూనే ఉంది. చేనేత కార్మికులు కొత్త పద్ధతులు, నమూనాలు మరియు సామగ్రిని సృష్టిస్తూ వారి ప్రత్యేకతను, నైపుణ్యాన్ని అభివృద్ధి చేశారు, చేస్తున్నారు.

**నేతన్నకు ఉపాధి కల్పిస్తున్న తెలంగాణ ప్రభుత్వం**

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం చేనేత (పవర్ లూమ్) కార్మికుల ఉపాధి కోసం చేపట్టిన ఒక అద్భుతమైన ఆలోచనతో పెను మార్పులు తీసుకువచ్చిన పథకమే 'చీరల తయారీ పథకం'. తెలంగాణ రాష్ట్రం సిరిసిల్ల ప్రాంతంలో చేనేత వృత్తిపై ఆధారపడిన వారి సంఖ్య చాలా ఎక్కువ. రెక్కాడితే కానీ డొక్కాడని జీవితాల్లో ఒక నూతన పథకం ద్వారా వారికి ఉపాధి కల్పించడానికి పెద్ద పీట వేసింది నేటి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.

చీరల తయారీ పథకం వారికి ఎంతో ఆసరాగా నిలిచింది. గతంలో సిరిసిల్ల ప్రాంతంలో మరమగ్గాలపై నేస్తున్న గుడ్డలపై లాభాల కోసం నిర్మాణాత్మక వ్యవస్థ, ఉపాధి ప్రాతిపదికగా కార్యక్రమాలు జరిగినవి. ఒకప్పుడు చేయడానికి ఉపాధి లేక సిరిసిల్ల నేతన్నలు ఇతర ప్రాంతాలకు ఏళ్ల తరబడి వలస వెళ్లేవారు. తల్లోచోట, కొడుకోచోట, పండుగ పబ్బాలకు మాత్రమే సిరిసిల్లకు వచ్చేవారు. ఈ వాస్తవ జీవితాలను గమనించిన ప్రభుత్వం చేనేత కార్మికులకు సరైన జీవన విధానం కోసం ఒక భరోసా కల్పించాలని నిర్ణయించి, అందులో భాగంగా చీరల తయారీ పథకాన్ని ఆమల్లోకి తెచ్చింది. అక్కడి కార్మికుల జీవితాల్లో వెలుగులు చూడాలని తలపెట్టిన కార్యక్రమం దిగ్విజయంగా నిలిచింది. దానికి ప్రత్యక్ష సాక్ష్యం సిరిసిల్ల ప్రాంతంలోని కార్మికులు, యజమానులలో ఆనందమే.

ఇలాంటి ఆలోచనాత్మక కార్యక్రమాల ద్వారా చేనేతకు ఉపాధి కల్పిస్తూ దేశ ప్రగతికి వెన్నెముకగా నిలిచిన చేనేత కార్మికుడికి భరోసా కల్పించినది తెలంగాణ ప్రభుత్వం.

**- డా. చిటికెన కిరణ్ కుమార్**
9490841284

# తండ్రి చైతన్యమే గద్దర్‌కు స్ఫూర్తి



**డాక్టర్ బి .ఆర్. అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలు శేషయ్యని ఎంతగానో ప్రభావితం చేశాయి. అలా ఆయన క్రమంగా అంబేద్కరిస్టుగా మారి ఒకానొక దశలో తాను సంపాదించిన ఆస్తినంతా సామాజిక కార్యక్రమాలకు వెచ్చించారు. ఆయన అంతిమంగా 'ఆత్మగౌరవం గల వ్యక్తి'గా జీవించారు. ఆ రకంగా శేషయ్య తాను కూడా తన పిల్లలను అంబేద్కర్ లాగా గొప్పగా చదివించి ఉన్నత స్థానాలకు అధిరోహింపజేయాలి అని బలంగా నిర్ణయించుకుని ఆ దిశగా ముందుకు పయనించారు.**
**అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలతో తన తండ్రి శేషయ్య తీవ్రంగా ప్రభావితులైన తీరు విఠల్ రావుని ఎంతగానో ఆకర్షింపజేసింది. అంతిమంగా విఠల్ రావు తండ్రి నుండి ఆత్మగౌరవ పోరాట ఆవశ్యకతని గుర్తించి, స్ఫూర్తి పొంది తాను కూడా అణచివేయబడ్డ తన దళిత బహుజన జాతి విముక్తి దిశగా నడుం బిగించారు.**

గద్దర్ పేరుతో ప్రాచుర్యం పొందిన 'గుమ్మడి విఠల్ రావు' అనే ఒక సామాన్యమైన మానవుడు మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలోని దళిత కుటుంబంలో గుమ్మడి లచ్చుమమ్మ, గుమ్మడి శేషయ్య అనే దంపతులకు 1948, జనవరి 31 నాడు జన్మించారు. కుటుంబ సభ్యులలో అందరికన్నా చివరి సంతానమైన విఠల్ ఆరో యేట నుంచి తల్లి లచ్చుమమ్మతో అమితమైన సాన్నిహిత్యాన్ని కలిగి ఉండేవారు. తల్లి లచ్చుమమ్మ మట్టి వాసనలు గుబాలించే పల్లె పదాలు మరియు జానపద పాటలు చాలా బాగా పాడేవారు.

విఠల్‌రావు తన తల్లి పాడే జానపద పాటల బాణీలను బాగా ఆకళింపు చేసుకున్నారు. తండ్రి గుమ్మడి శేషయ్య తరచుగా విఠల్ రావుకు 'ఆత్మగౌరవంతో జీవించాలి' అని నిర్దేశించేవారు. అంతేకాకుండా ఆయన 'సమతా సమాజాన్ని కాంక్షించి ఆత్మగౌరవ పోరాటాలలో అగ్రగామిగా ఉద్యమించారు'.

గుమ్మడి శేషయ్య కుటుంబానికి జీవనాధారం నిమిత్తం వ్యవసాయ భూమి లేదు. అందువల్ల వ్యవసాయంలేక బతుకు భారమై కష్టాల కడగండ్లలో కొట్టుమిట్టాడారు. ఒక దశలో ఉన్న ఊరిలో ఉండలేని సంక్లిష్ట పరిస్థితులలో శేషయ్య పొట్టకూటి కోసం తన తల్లి (బాలమ్మ)తో పాటు మహారాష్ట్ర ప్రాంతం లోని గోదావరి తీరానికి వెళ్లారు. ఆయన అక్కడ కూలీ పనులు చేసుకుంటూ జీవనాన్ని సాగించారు.

ఆ కాలంతో ఆ ప్రాంతంలో బలంగా సామాజిక చైతన్యం పరిఢవిల్లుతున్న తరుణంలో శేషయ్య ఒక పక్క కూలీ పనులకు వెళ్తూనే మరో పక్క క్రమంగా రాయడం, చదవడం నేర్చుకుని నేర్చుకున్నారు. 'చదువు అనేది ఆయనను మొట్ట మొదటగా సామాజిక విముక్తుడిని గావించింది' అని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. ఆ విధంగా ఆయన నేర్చుకున్న చదువు 'ఆత్మగౌరవ పోరాట జీవితానికి నాంది పలికింది' అని ఘంటాపథంగా చెప్పవచ్చు.

గుమ్మడి శేషయ్య తాను నేర్చుకున్న చదువు ద్వారా క్రమక్రమంగా అనేక సామాజిక సంఘర్షణలు అధిగమించగలిగారు.

ఆయన భవన నిర్మాణ మేస్త్రీగాను పూర్తి పరిణతి చెందారు. ఔరంగబాద్‌లో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ స్థాపించిన మిళింద్ విశ్వవిద్యాలయం భవన నిర్మాణంలో శేషయ్య మేస్త్రీ గాను మరియు కాంట్రాక్టర్ గాను పనిచేశారు. ఆ క్రమంలో ఆయన ప్రత్యక్షంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గారిని చూడడమే కాకుండా ఆయనతో మాట్లాడి ఆయన ఆలోచనా విధానానికి ఎంతగానో ప్రభావితులు అయ్యారు. నిజానికి 'దళిత కులంలో జన్మించిన శేషయ్య సహజంగానే అంబేద్కర్ భావజాలం వైపు ఆకర్షింపబడ్డారు' అ ని చెప్పవచ్చు.

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలు శేషయ్యని ఎంతగానో ప్రభావితం చేశాయి. అలా ఆయన క్రమంగా అంబేద్కరిస్టుగా మారి ఒకానొక దశలో తాను సంపాదించిన ఆస్తినంతా సామాజిక కార్యక్రమాలకు వెచ్చించారు. ఆయన అంతిమంగా 'ఆత్మగౌరవం గల వ్యక్తి'గా జీవించారు. ఆ రకంగా శేషయ్య తాను కూడా తన పిల్లలను అంబేద్కర్‌లాగా గొప్పగా చదివించి ఉన్నత స్థానాలకు అధిరోహింపజేయాలి అని బలంగా నిర్ణయించుకుని ఆ దిశగా ముందుకు పయనించారు.

ఆరు ఏళ్ళు వచ్చే వరకు తల్లే లోకంగా జీవించిన విఠల్ రావుని ఆ కాలంలోనే పాఠశాలలో చేర్పించారు. విఠల్ రావు రెండో తరగతికి వచ్చే నాటికి తండ్రి శేషయ్య మహారాష్ట్ర నుండి స్వస్థలమైన తూప్రాన్ గ్రామానికి వచ్చి అక్కడే జీవనాన్ని సాగించారు.

ఆ క్రమంలోనే విఠల్ రావు క్రమక్రమంగా తండ్రి శేషయ్య ఆలోచనా విధానాలను అంటిపెట్టుకోవడం ప్రారంభించారు. ఆ క్రమం నుండి తండ్రి శేషయ్య పొద్దు గూకాక తన కుమారుడు విఠల్‌రావుని ఒళ్ళో కూర్చోబెట్టుకొని సొంత పాటలు కట్టి పాడేవారు. అలాగే అంబేద్కర్ ఉద్యమానికి సంబంధించిన మరాఠీ పాటలు మరియు ఇతర పాటలు కూడా పాడి వినిపించేవారు. ఆయన అప్పుడప్పుడు తత్వాలు కూడా వినిపించేవారు.

అలాగే ఆయన వేమన శతకం, సుమతి శతకం మరియు నృసింహ శతకాలలోని జ్ఞాన బోధనల పద్యాలను విఠల్‌రావుకి లయబద్ధంగా చదివి వినిపించేవారు.

అదే విధంగా ఆయన ప్రత్యేకంగా కబీర్ గురించి ప్రస్థావించేవారు. ఆ రకంగా శేషయ్య అప్పటినుండి తాను ఎక్కడికి వెళ్లినా కూడా తన కుమారుడు విఠల్ రావుని ప్రత్యేకంగా తన వెంట తప్పకుండా తీసుకొని వెళ్లి అనేక సామాజిక విషయాల పట్ల పరిశీలనాత్మకమైన అవగాహనను కలిగింపజేశారు.

అంబేద్కర్ ప్రబోధించిన ఆత్మగౌరవ, సామాజిక, న్యాయ, ఆర్థిక మరియు రాజకీయ పోరాటాలతో తన తండ్రి శేషయ్య తీవ్రంగా ప్రభావితులైన తీరు విఠల్ రావుని ఎంతగానో ఆకర్షింపజేసింది. అంతిమంగా విఠల్‌రావు తండ్రి నుండి ఆత్మగౌరవ పోరాట ఆవశ్యకతని గుర్తించి, స్ఫూర్తి పొంది తాను కూడా అణచివేయబడ్డ తన దళిత బహుజన జాతి విముక్తి దిశగా నడుం బిగించారు. ఆయన ముందుగా సమాజ దార్శనికతని అలవరచుకొని తన దళిత బహుజన జాతి బతుకులను సమున్నతంగా తీర్చిదిద్దడానికి అనునిత్యం కృషి చేశారు. ఆ రకంగా విఠల్‌రావు జీవితం చిన్ననాటి నుండే అంబేద్కరిజం వెలుగులో 'ఆత్మగౌరవం కోసం బతుకే ఒక పోరాటం'గా ప్రజ్వలించే పోరాట స్ఫూర్తిని రగిలింపజేయడంలో తండ్రి శేషయ్య క్రియాశీల పాత్రని నిర్వహించారు.

**- జె.జె.సి.పి. బాబూరావు**
94933 19690

# బీసీ రిజర్వేషన్ల ప్రదాత బి.పి.మండల్

బిందేశ్వరి ప్రసాద్ మండల్ బీహార్ లోని బనారస్‌లోని యాదవ్ కుటుంబంలో 1918 ఆగస్టు 25న జన్మించాడు.మాధేపురా జిల్లాలోని మోరో గ్రామంలో పెరిగాడు. మండేపురంలో మండల్ తన ప్రాథమిక విద్యని, దర్భాంగాలో ఉన్నత పాఠశాల విద్యని పూర్తి చేసాడు. 1930లలో పాట్నా కాలేజీలో ఇంటర్మీడియేట్ పూర్తి చేసిండు. ఆ తరువాత పై చదువులకై అతను ప్రెసిడెన్సీ కళాశాల కలకత్తాలో చేరిండు. దురదృష్టవశాత్తు, కొన్ని అనివార్యమైన పరిస్థితుల కారణంగా, అతను తన చదువుని విడిచి పెట్టవలసి వచ్చింది.

మండల్ తన 23 వ యేటా జిల్లా కౌన్సిల్ కి ఎన్నికయ్యాడు.1945-51 మధ్య కాలంలో మాధేపుర డివిజన్‌లో జీతం తీసుకోకుండానే జ్యూడీషియల్ మేజిస్ట్రేట్‌గా పనిచేసాడు. అతని రాజకీయ జీవితం భారత జాతీయ కాంగ్రెస్తో మొదలైంది. 1952 లో మొదటిసారి బీహార్ అసెంబ్లీకి శాసనసభ్యునిగా ఎన్నికయ్యాడు. అధికార పక్షంలో ఉండి బీహార్ లోని బలహీనవర్గ కుర్మీలపై అగ్రవర్ణ రాజుపుత్రులు దాడి చేయడాన్ని నిరసించాడు. 1965లో తన నియోజకవర్గంలో భాగంగా ఉన్న గ్రామమైన పామాలో మైనారిటీలు, దళితులపై పోలీసులు చేస్తున్న అత్యాచారాలపై మాట్లాడాలని కోరుకున్నప్పుడు అధికార పక్షంలో ఉండి ఈ అంశంపై మాట్లాడకూడదని ముఖ్యమంత్రి ఆదేశిస్తే తన మనస్సాక్షిని చంపుకోలేక తను నమ్మిన విలువల కోసం ప్రతిపక్ష పాత్ర నిర్వహించడానికి సిద్ధమై సంయుక్త సోషలిస్ట్ పార్టీ (ఎస్.ఎస్.పి)లో చేరాడు. ఎస్.ఎస్.పి రాష్ట్ర పార్లమెంటరీ బోర్డు ఛైర్మన్ గా నియమించబడ్డాడు.

1967లో జరిగిన ఎన్నికలలో ఎస్.ఎస్.పి అభ్యర్థుల ఎంపికపై ఆయన చేసిన కృషి, ఆయన ప్రచారం వల్ల 1962 లో కేవలం 7 సీట్లు కల ఆ పార్టీకి 1967లో 69 సీట్లు వచ్చాయి. బీహార్‌లో మొట్టమొదటి కాంగ్రెస్ యేతర ప్రభుత్వం ఏర్పడింది. అతను పార్లమెంటు సభ్యుడు అయినప్పటికీ మంత్రివర్గంలో చేరారు. ఆరోగ్య శాఖ మంత్రిగా పనిచేసాడు. కానీ పార్టీలో, ప్రభుత్వంలో కొన్ని విభేదాలు రావడంతో కాంగ్రెస్ పార్టీ బయటి నుండి మద్దతు ఇవ్వడంతో 1968 ఫిబ్రవరి 1 న అతను బీహార్ రాష్ట్ర రెండవ బీసీ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించాడు. కాంగ్రెస్ పార్టీ మద్దతు తీసుకుంటూనే రాజీ పడకుండా రాష్ట్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతల అవినీతిపై అయ్యర్ కమీషన్ వేశాడు. ఆ కమీషన్ నివేదికను బయలుపరచకుండా అప్పటి ప్రధాని ఇందిరా గాంధి స్వయంగా ఒత్తిడి తీసుకవచ్చింది. ప్రధానితో అతను మాట్లాడడానికి నిరాకరించడంతో ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గడంతో 30 రోజులకే మండల్ తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అతను తరచూ తన మంత్రులకు, 'ఓట్లను సంపాదించడానికి కులపరమైన విజ్ఞప్తి సహించవచ్చు కానీ ప్రభుత్వాల నిర్ణయాలల్లో ఏ కులతత్వాన్ని సహించ వద్దు' అని చెప్పే మండల్ తన ప్రభుత్వంలో పరిపాలనలో ఎక్కడ కులతత్వాన్ని ప్రదర్శించకుండా పాలించాడు.

1967 మార్చి5న సోషిత్‌దళ్ (అణగారిన ప్రజల పార్టీ )ని స్థాపించాడు. 1967 నుండి 1970 వరకు లోకసభ సభ్యునిగా ఉన్నాడు. 1972లో శాసనసభకు తిరిగి ఎన్నికయ్యాడు. 1972 లో అప్పటి బీహార్ ముఖ్య మంత్రి పాండే మిథిలా యూనివర్సిటీ పేరుతో అందులో కింది ఉద్యోగి నుండి వైస్ ఛాన్సలర్ వరకు ఒకే కులం వారితో నింపాలనే ప్రయత్నాలని వ్యతిరేకించాడు. ఆ తర్వాత 1974లో శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి జయప్రకాష్ నారా యణ నేతృత్వంలో నడుస్తున్న అవినీతి వ్యతిరేక ఉద్యమంలో పాల్గొన్నాడు. 1977 లో జనతా పార్టీ తరపున లోక్‌సభకి ఎన్నికై 1979 వరకు కొన సాగాడు. ఎమర్జెన్సీ తర్వాత ఏర్పాటైన జనతా ప్రభుత్వం ఇందిరా గాంధీని డిబార్ చేయాలని అధికార పార్టీ సభ్యులు తెచ్చిన తీర్మానాన్ని మండల్ వ్యతిరేకించాడు. మండల్ తన రాజకీయ జీవితం లో సోషలిస్ట్ రాజకీయాల ఆలోచనపరుడిగా పనిచేసాడు.

భారత ప్రభుత్వం 1979 వెనుక బడిన తరగతుల కమిషన్ ఏర్పాటు చేయడం జరిగింది. దానికి బీపీ మండల్‌ను ఛైర్మన్‌గా నియ మించారు. ఈ కమిషన్ వెనుకబడిన తరగతుల విద్య ఉద్యోగ స్థితిగతులను గురించి అధ్యయనం చేయనుంది. తర్వాత మండల్ కమీషన్ నివేదిక సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుక బడిన తరగతుల కోసం 27% రిజర్వేషన్లను సిఫా ర్సు చేసింది. ముఖ్యంగా ప్రభుత్వ ఉద్యోగాలు మరియు విద్యా సంస్థలలో. ఈ సిఫార్సు 1990 ఆగస్టు 7న అప్పటి ప్రధాని వి.పి.సింగ్ నేతృత్వం లోని నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వం ద్వారా అమలు లోకి వచ్చింది. కాబట్టి ఆగస్టు 7న మండల్ దివాస్ గా జరుపుకుంటున్నాం.

మండల్ కమీషన్ సిఫార్సుల ప్రకారం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు మరియు విద్యా సంస్థలలో 27% రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించారు.

ఈ రిజర్వేషన్లు సామాజికంగా మరియు విద్యాపరంగా వెనుకబడిన తరగతుల వారికి విద్య మరియు ఉద్యోగ అవకాశాలను మెరుగు పరచడానికి ఉద్దేశించబడింది.

వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు అమలులోకి వచ్చిన తర్వాత, SC మరియు STలతో పాటు OBCలకు రిజర్వేషన్లు 49.5%కి చేరాయి.

మండల్ కమీషన్ సిఫార్సులు మరియు 27% రిజర్వేషన్ల అమలుపై అభ్యంతరాలు మరియు నిరసనలు కూడా ఉన్నాయి. అయితే, మండల్ కమీషన్ సిఫార్సులు మరియు 27% రిజర్వేషన్లు ఆఇల సామాజిక మరియు విద్యాపరమైన అభివృద్ధికి ఒక ముఖ్యమైన ముందడుగుగా పరిగణించబడుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ చేయడం దానికి అనుగుణంగా బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపించడం అదేవిధంగా కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నం చేస్తున్న అన్ని రాజకీయ పార్టీలోని నాయకులకు బీపీ మండల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని తద్వారా మాత్రమే బీసీ రిజర్వేషన్లు సాధ్యమవుతాయని విశ్వసిస్తున్నాను.

**- తాయప్ప**

# బిసిలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్రం ఆమోదించి ఇవ్వాల్సిందే

**వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్**



**మెట్‌పల్లి, ఆగస్టు 6 ( మనం న్యూస్ ):** బిసిలకు 42శాతం రిజర్వేషన్ లు ఇవ్వాల్సిందే అని. మెట్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కూన గోవర్ధన్ అన్నారు. బుధవారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ లు కల్పించాలని. దేశ రాజధాని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరియు తెలంగాణ రాష్ట్ర పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో చేపట్టిన పోరు బాట మహాధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా నాయకుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర చేసిన సమయంలో. బడుగు బలహీన వర్గాల ప్రజల స్థితిగతులను స్వయంగా ఆయన గమనించార న్నారు. వారికి విద్య , ఉద్యోగ, ఉపాధి అవకాశాలే కాకుండా చట్టసభల్లో సైతం రిజర్వేషన్ లు అవసరమని ఆయన భావించారన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మెనిఫెస్టో లో బిసిలకు రిజర్వేషన్ లు అమలు చేస్తామని హామి ఇచ్చిందని గుర్తు చేశారు. ప్రజా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత. కాంగ్రెస్ పార్టీ బిసిలకు రిజర్వేషన్ అమలు చేసి వారికి రాజ్యాధికారం ఇవ్వాలని. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో కుల గణన చేయించి. నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి. వారితో చర్చించి అసెంబ్లీ లో బిసి రిజర్వేషన్ బిల్లు పెట్టి. బిసిలకు రిజర్వేషన్ ఆవశ్యకత పైన చర్చించి అన్ని పార్టీలు ఏకగ్రీవంగా బిసి రిజర్వేషన్ బిల్లు ఆమోదించి. కేంద్రానికి పంపించారన్నారు. కేంద్రంలో ఉన్న బిజేపి ప్రభుత్వం. బిసిల హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తుందని ఆయన ఆరోపించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని వారికి విద్య ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభించాలన్నా.

వారు చట్ట సభల్లో ప్రాతినిధ్యం వహించాలన్నా రిజర్వేషన్లు అవసరమని ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.కే.ఎన్.ఆర్. కళాశాలలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు




**జగిత్యాల ఆగస్టు 06 (మనం న్యూస్):** ఎస్ కే ఎన్ ఆర్ ప్రభుత్వ ఆరట్స్ మరియు సైన్స్ కళాశాల జగిత్యాల లో ఈరోజు ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ అరిగెల అశోక్ మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ చాలా చురుకుగా పాల్గొని తెలంగాణ రాష్ట్ర సాధనలో స్ఫూర్తివంతమైన మార్గ నిర్దేశనం చేశారని తెలిపారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు ఉద్యమంలో పాల్గొని నీళ్లు నియామకాలు నిధులలో తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న వివక్షను ఎత్తిచూపారు. విద్యార్థులు వారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో నిరంతరం పాల్గొనాలని తెలిపారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ,ఎన్సిసి ఆఫీసర్ రాజు, సాయి మధుకర్, గోవర్ధన్ ,సురేందర్, శ్రీనివాస్, ఎన్సిసి క్యాడెట్స్, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బోధన బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ఈ.వీ.ఎం గోడౌన్ కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్




**జగిత్యాల ఆగస్టు 06(మనం ప్రతినిధి):** బుధవార జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్ లో గల ఈ.వీ.ఎం గోడౌన్ కేంద్రాన్ని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ.వి.ఎం భద్రతకు సంబంధించి ప్రతి నెలా తనిఖీ చేయడం జరుగుతుందని, అందులో భాగంగా ఈ రోజు ఈవీఎం గోడౌన్ కేంద్రాన్ని సందర్శించడం జరిగిందని తెలిపారు. కలెక్టర్ వెంట జగిత్యాల ఆర్డీఓ మధుసూదన్, కలెక్టరెట్ ఏ.ఓ. హకీం, ఎలక్షన్ సూపరింటెండెంట్, జగిత్యాల అర్బన్ తహసిల్దార్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో బీఎస్పీని బలోపేతం చేయాలి

## బీఎస్పీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేసిన నేతలు



**పెద్దపల్లి, ఆగస్టు 06:(మనం న్యూస్):** బహుజన్ సమాజ్ పార్టీ నాయకులు,కార్యకర్తలు రానున్న స్థానిక ఎన్నికలలో విజయం సాధించడమే లక్ష్యంగా కృషి చేయాలని నియోజకవర్గ అధ్యక్షుడు బొంకురి దుర్గయ్య పిలుపునిచ్చారు.బుధవారం పెద్దపల్లిలోని బీఎస్పీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ మేరకు దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఇన్చార్జి పేగ నరేష్, జిల్లా అధ్యక్షుడు ఇరుకుల్ల రాజనర్సయ్య హాజరై మాట్లాడుతూ బీఎస్పీ ని మరింత బలోపేతం చేయడానికి వెంటనే మండల,సెక్టార్,బూత్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.నాయకులు,కార్యకర్తలు ఐక్యంగా కృషి చేసి రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాలని కోరారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను,ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమవుతున్న తీరును ప్రజలకు వివరించాలని నేతలు కోరారు.అలాగే, బీసీ ప్రజలను మోసం చేయడానికి ఇతర పార్టీలు పడుతున్న కుట్రలను కూడా ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే,వెంటనే బీసీ జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేసి,వాటిని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కాంపెల్లి బాబు, జిల్లా సీనియర్ నాయకులు గొట్టే రాజు, పొగుల ఆనంద్, పెద్దపల్లి నియోజకవర్గ ఇన్చార్జి సిపెల్లి కొమురయ్య, రామగుండం ఇన్చార్జి జింక ఉదయ్, కోశాధికారి మల్లరపు రవికుమార్, పెద్దపల్లి పట్టణ అధ్యక్షురాలు రామిల్ల శారదా, బీవీపీ జిల్లా కమిటీ సభ్యులు మచ్చ రాహుల్, మచ్చ రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కడదాకా పోరాడిన యోధుడు ప్రొఫెసర్ జయశంకర్



- **ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్**

**మెట్ పల్లి, ఆగస్టు 6 ( మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సకారం చేసేందుకు. కడదాకా పోరాడిన ఉద్యమకారుడు. ప్రొఫెసర్ జయశంకర్ అని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా. పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో జాతీయ రహదారిపై గల. జయశంకర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర సాధనేధ్యేయంగా, ఉద్యమమే ఊపిరిగా జీవించిన తెలంగాణ ఉద్యమ కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అన్నారు.తెలంగాణ భావజాలవ్యాప్తికే తన జీవితాన్ని ధారబోసిన మహనీయుడు జయశంకర్ అన్నాడు. తెలంగాణ మలిదశ ఉద్యమ రథసారథి కేసీఆర్ కు అనునిత్యం అండగా ఉంటూ. తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను సాకారం చేసేందుకు. కడదాక పోరాడిన ఉద్యమకారుడు ఆయన అన్నారు. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలుగుతున్న నేటి తరుణంలో. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడటానికి జయశంకర్ సార్ ఉద్యమ స్ఫూర్తిని, సిద్ధాంతాలను భావితరాలకు అందించాల్సిన ఆవశ్యకత ఇప్పుడు ఎంతగానో ఉందన్నారు. దీనికి తెలంగాణ వాదులందరూ కంకణబద్ధులై ఉంటారని ఆశిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు



**సుల్తానాబాద్, ఆగస్టు 06 (మనం న్యూస్):** సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని బొంతకుంటపల్లి గ్రామంలో తల్లిపాల వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, జూపల్లి తిరుమల్ రావు సహకారంతో బుధవారం స్థానిక గ్రామపంచాయతీ అంగన్వాడీ కేంద్రంలో బాలింతలకు సీమంతంలో భాగంగా చీర, గాజులు, పసుపు, కుంకుమలతో పాటు పండ్లను అందజేశారు. అనంతరం తల్లిపాల విశిష్టతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ.. తల్లి సౌభాగ్యాన్ని, పుట్టబోయే బిడ్డ దీర్ఘాయుష్షును కోరుతూ, కడుపులోని బిడ్డ ఆరోగ్యకరంగా ఎదగడానికి బాలింతలకు సీమంతం నిర్వహించామని తెలిపారు. అలాగే అమృతతుల్యమైన తల్లిపాలలో బిడ్డ ఎదుగుదలకు కావలసిన పోషకపదార్థాలు పుష్కలంగా ఉంటాయని, పుట్టిన గంటలోపు శిశువుకు తల్లి పాలు పట్టించడం వలన దీర్ఘకాల వ్యాధి నిరోధక శక్తిగా ఏర్పడి, మంచి టీకాలుగా పనిచేస్తుందని, అలాగే తల్లికి రొమ్ము క్యాన్సర్, మధుమేహం, అధిక రక్తపోటును నివారించి శరీర బరువును సమతుల్యంగా ఉంచుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు జూపల్లి తిరుమల్ రావు, 320జి జి.ఈ.టి. కో-ఆర్డినేటర్ మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, జిల్లా చీఫ్ కో-ఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా హంగర్ రిలీఫ్ కో-ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, పూసాల సాంబమూర్తి, తమ్మనవేణి సతీష్, ధీకొండ భూమేష్, కోడూరి వెంకటేశం, కన్న రమేష్ గౌడ్, అంగన్వాడి సూపర్ వైజర్ స్వరూప రాణి, టీచర్ జూపల్లి శోభ, ఏఎన్ఎం భూలక్ష్మి, ఆశా కార్యకర్త కవిత, ఫీల్ అసిస్టెంట్ రాజేశ్వరి, కారోబార్ రమేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ లతోపాటు బాలింతలు పాల్గొన్నారు.

# ఆచార్య జీవితం యువతకు స్ఫూర్తిదాయకం

- **కమీషనరేట్ ఇంచార్జీ అడ్మిన్ ఏసిపి మల్లారెడ్డి**

**గోదావరిఖని, ఆగస్ట్ 06(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని ఇంచార్జ్ అడ్మిన్ ఏసిపి మల్లారెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం రామగుండం పోలీసు కమీషనరేట్ కార్యాలయంలో ప్రొ జయశంకర్ జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూల మాలలు వేసిన ఘనంగా నివాళులు అర్పించారు. సందర్భంగా ఇంచార్జ్ అడ్మిన్ ఏసిపి మల్లారెడ్డి మాట్లాడుతూ... సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన జీవిత కాలం రాష్ట్ర సాధనకే త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఎన్నో ఉద్యమాలు 1969 తెలంగాణ ఉద్యమం, ఇడ్లీ సాంబార్ గో బ్యాక్, నాన్ ముల్కీ ఉద్యమం, మలిదశ తెలంగాణా ఉద్యమంలో పాల్గొని దేశ వ్యాప్తంగా వేదికల ద్వారా తన ప్రసంగాలతో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి తెలియజేశారని, ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పి ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజలకు పోలీస్ శాఖ ద్వారా మరింత మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసిపి శ్రీనివాస్, ఏఆర్ ఏసిపి ప్రతాప్, ఏఓ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్లు చంద్ర శేఖర్ గౌడ్, భీమేష్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, దామోదర్, మల్లేషం, వామన్ మూర్తి సూపరింటెండెంట్లు ఇంద్రసేనా రెడ్డి, సందీప్, సంధ్య, సిసి హరీష్, సిపిఓ సిబ్బంది, వింగ్స్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆచార్య ప్రొ.కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు



**సిరిసిల్ల టౌన్ ఆగస్టు 06(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ఆకాంక్షను యావత్ ప్రపంచానికి చాటి చెప్పి ప్రత్యేక రాష్ట్ర సాధనకు జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప మహనీయుడు ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి అధికారులు,పోలీస్ సిబ్బందితో కలసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ సిద్ధాంతకర్తగా తెలంగాణ ప్రజల ఆకాంక్ష కోసం తన జీవిత కాలం రాష్ట్ర సాధనకే త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. ఆరు దశాబ్దాల పాటు తెలంగాణ రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటిచెప్పి ఉద్యమ స్ఫూర్తితో ప్రజలను చైతన్యం చేసిన గొప్ప వ్యక్తి అన్నారు. ఆయన జీవితం నేటి యువతకు ఆదర్శప్రాయం, స్ఫూర్తిదాయకమన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజలకు పోలీస్ శాఖ ద్వారా మరింత మెరుగైన సేవలందించి ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ లు రమేష్, యాదగిరి, కార్యాలయ సూపరింటెండెంట్ లు, జిల్లా పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# టిఎన్జిఓ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన జిల్లా టీఎన్జీవో నేతలు

**జగిత్యాల ఆగస్టు 06( మనం ప్రతినిధి):** నాంపల్లి హైదరాబాద్ లోని కేంద్ర సంఘం కార్యాలయంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేని అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్ , టిఎన్జిఓ రాష్ట్ర అధ్యక్షులు మారం జగదీశ్వర్ జన్మదిన వేడుకలు బుధవారం నిర్వహించిన సందర్భంగా జగిత్యాల టిఎన్జిఓ జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్ రెడ్డి జిల్లా కార్యదర్శి అమరేందర్ రెడ్డి అధ్వర్యంలో ఉద్యోగులు మారం జగదీశ్వర్ కి శాలువా, పూలమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నాగేందర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో నిరంతరం కృషి చేస్తున్న రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ గారికి ఆ భగవంతుని ఆశీస్సులుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమములో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, వివిధ జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, జిల్లా నాయకులు రవీందర్, శ్రీనివాస్ స్వామి, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్



- **జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**పెద్దపల్లి, ఆగస్టు 06 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి కలెక్టర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆచార్య జయశంకర్ జీవిత చరిత్ర సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను జిల్లా ఉన్నతాధికారులు స్మరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని స్టేట్ ఫంక్షన్ లాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపట్టానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదని, 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచి సలహాదారులుగా పని చేశారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసారని, రాష్ట్ర అభివృద్ది కొరకు మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని , ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాబోయే ఎన్నికల్లో కాంగ్రేస్‌ను మట్టికరిపిస్తాం

## ఇదే ఊపుతో కార్యకర్తలను గెలిపిస్తాం

## బిజెపి జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి



**పెద్దపల్లి, ఆగస్టు 06( మనం ప్రతినిధి):** రాష్ట్రవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీకి మంచి ఆధరణ లభిస్తోందని, ఇదే జోరును కొనసాగించి రాబోయే ఎన్నికల్లో కాంగ్రేసును మట్టి కరిపిస్తామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రారావు పర్యటన విజయవంతం చేసిన పెద్దపల్లి జిల్లా కార్యకర్తలు, నాయకులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో ఓటమిని ముందే గుర్తించిన కాంగ్రెస్ నాయకత్వం స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడానికి జంకుతోందని ఎద్దేవా చేశారు. బిసి రిజర్వేషన్ పేరుతో చేస్తున్న కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న నాటకాలకు చరమగీతం పాడుతామని స్పష్టం చేశారు. ఎంపిటీసి జడ్పిటీసి, సర్పంచ్, మున్సిపాలిటీ, సింగిల్ విండో ఎన్నికలు ఎప్పుడు వచ్చిన కమలం జెండా ఎగరడం ఖాయమన్నారు. నల్లా మనోహరరెడ్డి చేరిక బిజెపికి అదనపు బలమన్న ఆయన, కాంగ్రెస్, బిఆర్ఎస్, తదితర పార్టీలకు చెందిన మరింత మంది బిజెపిలోకి రావడానికి సిద్దంగా ఉన్నారని సంజీవరెడ్డి ప్రకటించారు.



# రీ సర్వే పైలెట్ ప్రాజెక్టుతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- పి.ప్రావీణ్య, జిల్లా కలెక్టర్
- రీ సర్వే ప్రాజెక్టులో అన్ని రికార్డులు జియో ట్యాగింగ్ చేయాలి
- భవిత కేంద్రానికి ప్రత్యేక అవసరాల విద్యార్థులు క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలి
- ఆచార్య జయశంకర్ చిత్రపటానికి నివాళులర్పించిన కలెక్టర్
- ఇందిరమ్మ ఇండ్లకు ఇసుకపురత రాకుండా చూడాలి
- అందోల్ ఆర్డీఓ కార్యాలయం, భవిత సెంటర్లను తనిఖీ చేసిన కలెక్టర్



**సంగారెడ్డి, ఆగస్టు 6(మనం ప్రతినిధి):** భూముల రీ సర్వే పైలట్ ప్రాజెక్టుతో భూ సమస్యలన్నీ శాశ్వతంగా పరిష్కారం అవుతాయని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. బుధవారం అందోల్ ఆర్డీవో కార్యాలయాన్ని సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ జిల్లా అధికారి ఐనేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య మాట్లాడుతూ, భూముల రీ సర్వే కోసం ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలోని ఆందోల్ డివిజన్ వట్పల్లి మండల పరిధిలోని షాహేద్ నగర్ (గట్టుపల్లి) గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా రీ సర్వే పైలట్ ప్రాజెక్టు పురోగతిపై కలెక్టర్ సమీక్ష జరిపారు. రీ సర్వే పైలెట్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత తుది రికార్డులను కలెక్టర్ పరిశీలించారు. పహాణీలు, మోకాపై ఉన్న రైతుల వివరాలు, ల్యాండ్ అక్యుపేషన్ ప్రక్రియ భూముల రీ మార్కులు వంటి అంశాలపై మినిట్ స్థాయిలో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పైలట్ ప్రాజెక్టు ద్వారా భూ సంబంధిత సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశించారు. భవిష్యత్తులో భూముల విషయంలో ఉన్న సందిగ్ధతకు ఈ రిసర్వే ప్రాజెక్టు ఒక తుది నివేదికల నిలవాలని కలెక్టర్ సూచించారు. రీ సర్వేకు సంబంధించిన అన్ని రికార్డులు జియో ట్యాగింగ్ చేయడం, భూహక్కుల వివరాలు డిజిటల్ రూపంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆర్‌డీఓ కార్యాలయానికి వచ్చిన ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

### భవిత కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్

అందోల్ ఆర్డీవో కార్యాలయం సందర్శన అనంతరం కలెక్టర్ ప్రావిణ్య అందోల్ లోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్శనలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు భవిత కేంద్రంలోని పిల్లలకు అందిస్తున్న, వైద్య, విద్య, రవాణా, పునరావాస పరికరాల వంటి సౌకర్యాల వివరాలను సమీక్షించారు. బోధనా విధానాన్ని,విద్యార్థుల హాజరు రిజిస్టబు పట్టికను, ఆహార నాణ్యతను జిల్లా కలెక్టర్ పరిశీలించారు.భవిత కేంద్రానికి విద్యార్థులు రెగ్యులర్ గా హాజరయ్యేలా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఫిజియో థెరపీ కౌన్సెలింగ్ స్పీచ్ థెరపీ స్పెషల్ ఎడ్యుకేషన్ సపోర్టు లాంటి సేవలు సమర్థవంతంగా అందించాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించి వారి అభ్యసన ప్రగతిని తరచూ మూల్యాంకనం చేయాలన్నారు.

### ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిది

అందోల్ ఆర్డీవో కార్యాలయంలో నిర్వహించిన ఆచార్య జయశంకర్ జయంతి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పాల్గొన్నారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో పోరాడి మల్లికార్జున స్వష్ఠ సాధనకు ఆచార్య జయశంకర్ మార్గదర్శిగా నిలిచారన్నారు. రైతుల కోసం నిరంతరం పోరాడిన ఆచార్య జయశంకర్ సేవలను ఈ సందర్భంగా ఆమె కొనియాడారు. ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించింది. తెలంగాణ అభివృద్ధిలో ఆయన కలిగించిన ప్రేరణ గుర్తు చేశారు.

### సాండ్ బజార్ సందర్శించిన కలెక్టర్

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కోసం అందోల్ డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌ను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఇసుక సరఫరా పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లకు తగిన మోతాదులో ఇసుక అందించడంతో ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. అక్రమ రవాణాపై గట్టి చర్యలు తీసుకోని అవసరమైన కోట్ల డిమాండ్ కనుగొనండి ఇసుక సరఫరా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ)మాధురి. జిల్లా సర్వే ల్యాండ్ రికార్డ్ సహాయ సంచాలకులు ఐనేష్, ఆందోల్ ఆర్డీవో పాండు, ఆందోల్ తహసీల్దార్ మధుకర్ రెడ్డి, ఎంపీడీవో రాజేష్ కుమార్, ఐఈఆర్పీ అధికారి విజయ చారి, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

- సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేశ్



**హుస్నాబాద్, ఆగస్టు 6(మనం న్యూస్):** సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపే మల్లేశ్ పిలుపునిచ్చారు. ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలపై పోరాడుతున్న 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ శ్రేణులకు అనభేరి,సింగిరెడ్డి అమరుల భవన్ లో గొడ పోస్టర్లు,కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా గడిపే మల్లేష్ మాట్లాడుతూ ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే రాష్ట్ర 4 వ మహాసభలు మేడ్చల్ జిల్లాలో ఆగస్టు 19 నుంచి 22 వరకు జరగనున్నాయని తెలిపారు. ప్రతి పల్లే, పల్లే గ్రామీణ,పట్టణ ప్రాంతాల నుంచి సిపిఐ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, యువతి, యువకులు, విద్యార్థినీ, విద్యార్థులు,రైతులు, కూలీలు సంఘటిత, అసంఘటిత కార్మికులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జాగిరి సత్య నారాయణ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పొదిల కుమారస్వామి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జనగాం రాజ్ కుమార్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సీపీఐ పట్టణ కార్యదర్శి ఎగ్గోజు సుదర్శన్ చారి, సిపిఐ మండల నాయకులు అయిలేని మల్లారెడ్డి,ఎండి అక్బర్, మౌటం బాలయ్య, వంగోజు భాస్కర్, ఏఐవైఎఫ్ పట్టణ కన్వీనర్ దొంతర వేని రజిత, మహిళా సమాఖ్య నాయకురాలు రోళ్ళ భాగ్యలక్ష్మి, దొంతర వేని రాజవ్వ, మర్యాల సులోచన రెడ్డి, పోగుల రాములు, తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్య జయశంకర్ ఆశయాలే స్ఫూర్తి



**సంగారెడ్డి, ఆగస్టు 6(మనం ప్రతినిధి):** తెలంగాణ భావజాతక నేత, విద్యావేత్త ఆచార్య జయశంకర్ 91 వ జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. డీఆర్వో పద్మజా రాణి మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరు ముందుకు సాగాలన్నారు. అదే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అవుతుందని పిలుపునిచ్చారు. ప్రతి ఉద్యోగి, పౌరుడు ఆయన్ను స్ఫూర్తిగా తీసుకొని పని చేస్తే, అదే నిజమైన నివాళి అవుతుంది అని పేర్కొన్నారు.

# ఇందిరమ్మా.. ఇదేందమ్మా..?

- ఇండ్ల కేటాయింపుల్లో ఇష్టారాజ్యం
- పేదలకు అన్యాయం
- బీఎస్పీ పార్టీ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్

**హుస్నాబాద్, ఆగస్టు 6(మనం న్యూస్):** ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని నమ్మబలికిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అవినీతిమయంగా మార్చిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయని బీఎస్పీ పార్టీ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. ఇందిరమ్మ ఇల్లు రాలేదని కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామానికి చెందిన అంతడుపుల శ్రీనివాస్ ఆత్మహత్యకు పాల్పడి హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనని బీఎస్పీ పార్టీ ఇన్‌చార్జ్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్ పరామర్శించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇండ్ల ఎంపిక ప్రక్రియలో ఇందిరమ్మ కమిటీలకు ప్రాధాన్యత ఇవ్వడంతో వారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ డబ్బులు ఇచ్చిన వారిని అర్హులుగా గుర్తించడంతో అసలైన నిరుపేదలకు అన్యాయం జరుగుతుందన్నారు. మాది ఇందిరమ్మ రాజ్యం.. అంటూ గొప్పలు చెప్పుకున్న కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్నింటా విఫలమవుతూనే, ఇచ్చిన హామీల్లో ఐదు శాతం కూడా పూర్తి చేయలేదు అన్నారు. పేదలకు ఇచ్చే ఇండ్లకు దివంగత ప్రధాని ఇందిరాగాంధీ పేరు పెట్టి పథకాన్ని అవినీతి మయంగా మార్చింది అన్నారు. అంతడుపుల శ్రీనివాస్ ఇందిరమ్మ ఇల్లుకు అర్హుడు అయినప్పటికీ ముడుపులు ఇవ్వలేదనే సాకుతో తనకు మొదటి, రెండవ లిస్టులోను పేరు రాలేదన్నారు. ముడుపులు ఇస్తే తనకు ఎప్పుడో వచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో నియోజకవర్గంలో ఏం జరుగుతుందో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు న్యాయం చేయకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఎలగందుల శంకర్, హనుమంత్, పార్టీ అధ్యక్షుడు వేల్పుల రాజు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేసిన జిల్లా జడ్జి



- పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**సంగారెడ్డి, ఆగస్టు 6(మనం ప్రతినిధి):** సంగారెడ్డి పట్టణ కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా జడ్జి సౌజన్య సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి భవాని చంద్ర ఆదేశాల మేరకు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని వార్డు వార్డును తనిఖీ చేయడం జరిగిందని ఇక్కడ పరిసర ప్రాంతాలు అపరిశుభ్రంగా ఉన్నాయని వీటిని వెంటనే పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించడం జరిగిందని అన్నారు రోగులకు అందుతున్న ఆహార నాణ్యత పై రోగులను అడిగి తెలుసుకున్నారు అనంతరం వంటగదిలోని పాత్రలు శుభ్రత పరిశుభ్రత పరిశీలించి రోగులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని కోరారు. ఈ తనిఖీ నందు ప్రభుత్వ ఆసుపత్రి సూపర్డెంట్ మురళీకృష్ణ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం

- ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలి
- సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి




**హుస్నాబాద్, ఆగస్టు 6(మనం న్యూస్):** రాష్ట్ర సాధన కోసం విద్యార్థి దశ నుంచే పోరాడిన మహోన్నత వ్యక్తి తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ అని సిద్ధిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ 92 వ జయంతి, ప్రజాయుద్ధ నౌక గద్దర్ 2 వ వర్ధంతి వేడుకలు ప్రజా సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి మాట్లాడుతూ తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లిన వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అని గుర్తు చేశారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమవుతుందని గ్రహించి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను ప్రజలందరికీ తెలియజేసి చైతన్య పరచాలన్నారు. ఆయన జీవితాన్ని తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం త్యాగం చేశారని కొనియాడారు. మరోవైపు పీడిత అణగారిన వర్గాల ప్రజలను తన గేయాలతో చైతన్యపరిచి సామాజిక మార్పుకు దోహదం చేసిన గొప్ప వ్యక్తి గద్దర్ అని తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో గద్దర్ తన గేయాల ద్వారా ప్రజలను ఉత్తేజ ప్రచారన్నారు. ప్రొఫెసర్ జయశంకర్, గద్దర్ జీవితాలను స్ఫూర్తిగా తీసుకొని నేటి యువత ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ ఎంతో మందికి మార్గనిర్దేశకులన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్, కవి నాదమునుల రామారావు, సామాజిక కార్యకర్త పిడిశెట్టి రాజు, బీసీ సంఘం రాష్ట్ర నాయకులు మార్క అనిల్ గౌడ్, కొత్తపల్లి సత్యనారాయణ, జేఏసీ నాయకురాలు కోడూరి శ్రీదేవి, బోయిని రాజమల్లయ్య, బూరుగు కిష్ట స్వామి, గట్టు రాములు, సతీష్, బైరి శ్రీను, ఇజ్జగిరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్యాలయంలో..

హుస్నాబాద్ పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘం కమిషనర్ టి.మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జయశంకర్ తన జీవితాంతం పాటుపడ్డారని గుర్తు చేశారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో జయశంకర్ సార్ది ప్రత్యేక స్థానమని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి మేనేజర్ సంపత్ రావు, మున్సిపల్ అధికారులు, వార్డు ఆఫీసర్లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఢిల్లీలో జయశంకర్, గద్దర్‌లకు ఘనంగా నివాళి



- ఘన నివాళులర్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- కార్యక్రమంలో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్

**రామచంద్రాపురం, ఆగస్టు 6(మనం న్యూస్):** బీసీ రిజర్వేషన్ల అమలు కోసం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి వచ్చిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ మహనీయులు ప్రొఫెసర్ జయశంకర్, ప్రజాయుద్ధ నౌక గద్దర్ కు ఘన నివాళులు అర్పించారు. బుధవారం ప్రొఫెసర్ జయశంకర్ జయంతి, గద్దర్ వర్ధంతిని పురస్కరించుకొని ఢిల్లీ తుగ్లక్ రోడ్ లోని సీఎం అధికారిక నివాసంలో ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ మహనీయులు స్వరాష్ట్ర సాధన కోసం చేసిన పోరాటంతో పాటు తెలంగాణ సమాజానికి వారు అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ఎమ్మెల్యేలు జయవీర్ రెడ్డి, మనోహర్ రెడ్డి,రాజేష్ రెడ్డి, మల్ రెడ్డి రంగారెడ్డి, ఎంఎల్సీ మహేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు రోహిన్ రెడ్డి, ముఖ్యనేతలతో కలసి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు.

# మహిళలు యంత్రాలను సద్వినియోగపర్చుకోవాలి

- ఆహార పరిశ్రమలో తాజా పోకడలు తెలుసుకోవచ్చు
- యంత్రాల కొనుగోలుకు 35 శాతం సబ్సిడీ
- సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి

**హుస్నాబాద్,ఆగస్టు 6(మనం న్యూస్):** అన్ని రకాల రెడీమేడ్ వంట సామగ్రి వినియోగిస్తున్న ఈ రోజుల్లో ఆహార యంత్రాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, గ్రామాల్లో ఉండే మహిళా సంఘాల సభ్యులు ఈ యంత్రాలను సద్వినియోగపర్చుకోవాలని సిద్దిపేట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి అన్నారు. హుస్నాబాద్ మార్కెట్ యార్డ్‌లో తేజస్ ఆహార ప్రాసెసింగ్ యంత్రాల ప్రదర్శన కొనసాగుతోంది. మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డితో కలిసి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను ఐకేపీ మహిళా సంఘాల సభ్యులు పెద్ద ఎత్తున సందర్శించడం జరిగిందని తెలిపారు. ఆహార ప్రాసెసింగ్ యంత్రాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లక్షకు 35 శాతం సబ్సిడీ అందిస్తున్నాయని వెల్లడించారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో వీటి ప్రదర్శనను హుస్నాబాద్ లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆసక్తి ఉన్న మహిళా సంఘాల సభ్యులు మంత్రి పిఏ మల్లేశం ను కలిస్తే వీటికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేస్తారన్నారు.



# స్థానిక ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరాలి

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్




**హుస్నాబాద్, ఆగస్టు 6(మనం న్యూస్):** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీ జెండా విజయం ఖాయమని.. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ తెలిపారు. హుస్నాబాద్‌లోని భారత రాష్ట్ర సమితి పార్టీ కార్యాలయంలో బుధవారం భీమదేవరపల్లి మండల స్థాయి బీఆర్ఎస్ పార్టీ గ్రామాల వారీగా కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీళ్ల నిధులు నియామకాలపై ఉద్యమించి.. తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించి అన్ని వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి, రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్కే దక్కిందన్నారు. పేద ప్రజల కోసం అనేక పథకాలు అమలు చేసిన కేసీఆర్‌ను చోటామోటా నాయకులు విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ప్రజలకు ఒరగబెట్టింది ఏమీ లేదని, ఇచ్చిన 6 గ్యారంటీలు గాలికి వదిలేసి నాయకులు తరచు ఢిల్లీకి వెళ్లడం తప్ప ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో చేసిన అభివృద్ధి, ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ హయాంలో ప్రజలకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ విఫలమైందని, గ్రామాల్లో చర్చ పెట్టి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. వార్డు మెంబర్ నుంచి ఎంపీపీ, జడ్పీటీసీ వరకు బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలని, పార్టీ గెలుపు కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని తెలిపారు.భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలతో మమేకమై అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి కాంగ్రెస్ పార్టీ నాయకులు నోటికి వచ్చినట్టు మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన రీతిలో గుణపాఠం చెప్పి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టి ఆదరిస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. అంతకు ముందు ప్రొఫెసర్ ఆచార్య జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు.

## తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త
# ఆచార్య కొత్తపల్లి జయశంకర్



- కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 06 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. బుధవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్, అదనపు కలెక్టర్ డి.వేణు గోపాల్ తో కలిసి పాల్గొని, జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆచార్య జయశంకర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతిని రాష్ట్ర పండుగ లాగా నిర్వహిస్తున్నామని, ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఆచార్య జయశంకర్ పాత్ర మరువలేనిదని, 1969 తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకంగా నిలిచి సలహాదారులుగా పని చేశారని, తెలంగాణ ఉద్యమానికి వెన్నెముకగా ఆచార్య జయశంకర్ నిలిచారని కలెక్టర్ పేర్కొన్నారు. ఆచార్య కొత్తపల్లి జయశంకర్ కు తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్రం సాధన కోసం తన జీవితాన్నే అంకితం చేసారని, రాష్ట్ర అభివృద్ధి కొరకు మంచి ప్రణాళికలు సైతం రూపొందించారని , ఆయన ఆశయాల సాధన కోసం మనమంతా సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, సిపిఓ సంజీవరావు, బీసీ సంక్షేమ అధికారి ఇందిర, జిల్లా వైద్యశాఖ అధికారి జయలక్ష్మి, డి సి ఓ రుక్మిణి మరియు జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన కార్మికుల ముందస్తు అరెస్టు



**దమ్మపేట, ఆగస్టు 6(మనం న్యూస్):** పెండింగ్ లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల జీతాలను చెల్లించాలని ,సరైన సదుపాయాలు కోసం బుధవారం హైదరాబాదులో జరగాల్సిన సెక్రటేరియట్ ముట్టడికి బయల్దేరిన కార్మికులను దమ్మపేట పోలీసు అధికారులు అడ్డుకున్నారు. పలువురు కార్మికులు మాట్లాడుతూ కొన్ని నెలలు నుండి జీతాలను నిలిపివేస్తూ ప్రభుత్వం కాలయాపన చేస్తుందని తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఫిబ్రవరీ నెల నుండి బిల్లులు రాక దుర్భర పరిస్థితుల్లో ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం మధ్యాహ్న కార్మికులకు ఇచ్చిన హామీలను గెలిచిన తర్వాత హామీలను నెరవేర్చలేదని ప్రభుత్వం వారిపై చిన్న చూపు చూస్తుందని మండిపడ్డారు. ఓట్లు వేయకముందు ఒక మాట, వేసిన తర్వాత ఇంకొక మాట ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి తగదని అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని శాంతి యుతంగా నిరసనకు బయలుదేరిన కార్మికులను అడ్డుకోవడం బాధాకరమన్నారు. తక్షణం ప్రభు త్వం పెండింగ్లో ఉన్న జీతాలను చెల్లించడంతో పాటు పెరిగిన ధరలకు అనుగుణంగా తమ వేతనా లను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్య క్రమంలో సింహాద్రి సత్యవతి, షేక్ జాన్ బీ ఉన్నారు.

# కాంగ్రెస్ పాలనతో పేదల కల సాకారం

- పదేళ్ల తర్వాత ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల మంజూరు
- ప్రతి అర్హునికి సంక్షేమ ఫలాలు అందచేస్తాం
- రేషన్ కార్డుల పంపిణీ సభలో ఎంఎల్ఏ తెల్లం



**చర్ల, ఆగస్ట్ 6 (మనం న్యూస్):** దశాబ్దకాలం ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల కోసం ఎదురు చూసిన పేదలకు కాంగ్రెస్ పాలనలో అవి మంజూరుతో కావడంతో వారి కల సాకారమవుతోందని భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. బుధవారం చర్లలోని రైతు వేదికలో నూతన రేషన్ కార్డులు, కళ్యాణ లక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో ప్రతి ఒక్కరూ రేషన్ కార్డులు, డబల్ బెడ్ రూం ఇల్లు కావాలని అడిగారని వారి కోరిక ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వ హయంలో తీరడంతో పేద ప్రజలు సంతోషంగా ఉన్నారని వెల్లడించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో అరకొరగా ఇల్లులు మంజూరు చేసి పేదలను ప్రలోభాలకు గురిచేసారని, ఉన్న రేషన్ కార్డులను తొలగించి ఇబ్బందులపాలు చేసారని మండిపడ్డారు. ఇందిరమ్మ యాప్ లోపాల కారణంగా కొన్ని గ్రామ పంచాయతీలలో ఇల్ల నిర్మాణం ప్రారంభం కాలేదని, ఈ పంచాయతీలలో ఆఫ్ లైన్ పద్దతిలో ఇల్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిఆర్డిఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు ఫోన్ ద్వారా విజ్ఞప్తి చేశారు. పేదలు అప్పుల పాలు కాకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వమే ఇల్లు కట్టిస్తోందని తెలిపారు. రేషన్ కార్డుల వల్ల ఎంతో ఉపయోగం ఉందని, దాని ద్వారా ఉచితంగా సన్న బియ్యం పొందడమే కాకుండా మల్టీ కార్డుగా ఉపయోగించవచ్చని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ఠ్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందన్నారు. ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల మంజూరు వంటివి నిరంతర ప్రక్రియ అన్నారు. ఎవరూ తమకు సంక్షేమ పథకాలు అందలేదని ఆందోళన చెందవద్దని, అర్హులయిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే బాద్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఇప్పటికే మూడు నెలల కాలానికి రేషన్ బియ్యం ఒకే మారు అందచేసామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలను ప్రతి ఒక్కటీ అమలు చేస్తోందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసేందుకు డ్వాక్రా మహిళలకు వడ్డీ లేని రుణాలు, ఉచిత బస్ ప్రయాణం, ఆర్టీసి బస్ సర్వీసుల నిర్వహణ, ఆర్థిక స్వావలంబన కల్పించేందుకు యూనిట్ల మంజూరు వంటి పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. గ్రామీణ ప్రాంతాలలో నూటికి నూరు శాతం 200 లోపు యూనిట్లకు ఉచిత విద్యుత్ అందుతోందని తెలిపారు. చర్ల మండలంలో ఇప్పటికే 12,857 మందికి రేషన్ కార్డులు ఉండగా కొత్తగా మరో 734 మందికి మంజూరు చేసామని తెలిపారు. ఒక్క ఈ మండలంలోనే 42,360 మందికి రేషన్ బియ్యం అందుతోందని వెల్లడించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి పట్టం కట్టాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో చర్ల ప్రాదమిక సహకార సంఘం అద్యక్షులు పరుచూరి రవికుమార్, ఎంపిడివో కనపర్తి ఈదయ్య, ఎంపివో వలీహజ్రత్, సివిల్ సప్లయ్ డీటి గుండి రాజులు, టిపిసిసి ప్రదాన కార్యదర్శి నల్లపు దుర్గాప్రసాదరావు పాల్గొన్నారు.

# మంగపేటలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**భద్రాద్రి కొత్తగూడెం, ఆగస్ట్ 06 (మనంప్రతినిధి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం మంగపేట గ్రామంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ తో కలిసి బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మంగపేట గ్రామంలోని అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాల మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు మరియు గర్భిణీ స్త్రీలకు అందిస్తున్న పౌష్టికాహారం తదితర సేవల గురించి అంగన్వాడీ టీచర్ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్నటువంటి గుడ్లను మరియు ఇతర ఆహార పదార్థం నిల్వలను పరిశీలించారు. సందర్భంగా కలెక్టర్ అంగన్వాడీ టీచర్ ను సి హెచ్ ఆర్ క్రింద పిల్లలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు? గర్భిణి స్త్రీలకు ఏ విధమైన పౌష్టికాహారం అందిస్తున్నారు అని అడిగి తెలుసుకున్నారు? గర్భిణీలలో రక్తహీనత లేకుండా చూడాలని, వైద్య సిబ్బంది ద్వారా గర్భిణీలకు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, గర్భిణీలు, పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు ఇప్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ లేకపోవడం వలన కోతులు మరియు పాముల వల్ల ఇబ్బందులకు గురి అవుతున్నామని కలెక్టర్ దృష్టికి అంగన్వాడీ సిబ్బంది తీసుకురాగా, వెంటనే స్పందించిన కలెక్టర్ మట్టి ఇటుకలతో ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టే విధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రాథమిక పాఠశాలో విద్యార్థుల హాజరు శాతం పరిశీలన మంగపేట ప్రాథమిక పాఠశాలో విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించి, విద్యార్థుల పుస్తక పఠనం, చేతిరాతను కలెక్టర్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి సిద్ధంగా ఉన్న ఆహార పదార్థాలను కలెక్టర్ మెనూ ప్రకారం ఉన్నాయా లేదా అని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలోని తరగతి గదిలలో జిల్లా కలెక్టర్ విద్యార్థులతో ముఖాముఖి ముచ్చటించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యంపై పలు ప్రశ్నలు వేసి బోర్డు పై రాయించి విద్యార్థుల సామర్థ్యాన్ని మరియు వారి యొక్క చేతిరాతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు మరియు పెన్నులు బహుకరించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలోప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల ఆరోగ్యం, చదువు అత్యంత ప్రాధాన్యమైనవని అన్నారు. అదేవిధంగా పాఠశాల వసతులు, భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి వ్యత్యాసం రావొద్దని ఆదేశించారు.రోజువారి మెనూ పక్కాగా అమలు చేయాలని ఆదేశించారు.పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులు కింద కూర్చొని ఉండటాన్ని గమనించి పాఠశాలకు త్వరలో అవసరమైన బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు.

### ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మంగపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల హాజరు, ఓపీ, రిజిస్ట్రేషన్ కౌంటర్, ల్యాబ్, ఇన్ పేషంట్ వార్డు, వ్యాక్సినేషన్ రూమ్ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఔషధ నిల్వలు రిజిస్టర్ను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని,ఆస్పత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట తహసిల్దార్ గన్యా, ప్రధానోపాధ్యాయురాలు కోటమ్మ, అంగన్వాడి టీచర్ సుజాత మరియు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీజపూర్‌లో ఎన్‌కౌంటర్ మావోయిస్టు మృతి

**చర్ల, ఆగస్ట్ 6 (మనం న్యూస్) :** ఛత్తీసఘడ్ రాష్ట్రంలోని బీజపూర్ జిల్లా దండకారణ్యపు అడవులు మరీమారు తుపాకుల మోతతో దద్దరిల్లాయి. గంగులూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మద్య బుధవారం జరిగిన ఎదురుకాల్పులలో ఒక పురుష మావోయిస్టు మృతి చెందాడు. గంగులూరు అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, సిఆర్‌ఫిఎఫ్ బలగాలు సంయుక్తంగా కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురు పడటంతో ఇరు వర్గాల నడుమ హోరాహోరీగా కాల్పులు చోటు చేసుకున్నాయి. ఎన్ కౌంటర్ లో ఒక మావోయిస్టు మృత దేహంతో పాటు పెద్ద ఎత్తున ఆయుదాలు, పేలుడు పదార్దాలను భద్రతా బలగాలు స్వాదీనం చేసుకున్నారు.

# వాగులను తోడేస్తున్న ఇసుక బకాసురులు

- పేరుకే ఇందిరమ్మ ఇంటికి - అయ్యేది మాత్రం దొంగలపాలు
- లబ్ధిదారులను సైతం నిండా ముంచుతున్న మధ్యవర్తులు
- ఒకే కూపన్తో యథేచ్ఛగా రెండు రోజుల పాటు తోలకాలు
- అధికారుల పర్యవేక్షణ లోపంతో ఇష్ట రాజ్యాంగ ఇసుక తోలకాలు



**ఆళ్లపల్లి, ఆగస్టు 6 (మనం న్యూస్):** ఇసుక బకాసురులు యథేశ్చగా వాగులను తోడేస్తున్నారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు ఇసుక రవాణా చేస్తున్నామని చెప్తూ మండలం నుండి ఇసుకను తరలించి అధిక ధరలకు అమ్ముకొని లబ్ధి పొందుతున్నారు. ఆయా మండలాలలో వాగులు, వంకలలో ఇసుక ఎక్కువ మోతాదులో ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుక సరిపడా లేదు అని చెబుతూ ఆళ్లపల్లి మండలానికి వచ్చి ఇక్కడి నుండి ఇసుక ట్రాక్టర్లలో లోడ్ చేసుకొని సుదూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అసలైన లబ్ధిదారులు వారి ఇంటి నిర్మాణానికి ఇసుక ఎలా తీసుకువెళ్లాలో తెలియని వారి అమాయకత్వాన్ని మధ్యవర్తులు ఆసరాగా చేసుకుని నాలుగు వేల లోపు వచ్చే ట్రాక్టర్ ఇసుకను ఆరు నుండి ఏడు వేలకు విక్రయిస్తున్నారు. లబ్ధి పొందవలసిన లబ్ధిదారులేమో నష్టపోతుంటే సంబంధం లేకుండా వచ్చి మధ్యలో చేరిన మధ్యవర్తులు లక్షలలో సంపాదించుకుంటున్నారు. ఒక్క కూపన్‌పై ఒకే ట్రాక్టర్ ఒకటే రోజు వెళ్లాల్సి ఉండగా అదే కూపన్ పట్టుకొని మరొక రోజు వచ్చి ఇసుక లోడ్ చేసుకొని వెళుతున్నారు. పర్యవేక్షించవలసిన రెవెన్యూ శాఖ అధికారులు అటువైపు తిరిగి చూడకపోవడంతో వారి ఆగడాలకు అడ్డు అదుపు లేకుండా పోతోందని పలువురు ఆరోపిస్తున్నారు. రెండు ట్రాక్టర్లకు సంబంధించి కూపన్లపై మంగళవారం డేట్ ఉండగా ఆ ట్రాక్టర్లు బుధవారం వెళ్తున్నాయని కొందరు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. దీంతో అక్కడికి చేరుకున్న రెవిన్యూ అధికారులు అది పరిశీలించి ఆ ట్రాక్టర్ డ్రైవర్లు చెప్పింది విని వెనకకి తిరిగి వెళ్లారు. ఆ కూపన్ పై మంగళవారం వెళ్లవలసిన ట్రాక్టర్లు బుధవారం ఎందుకు వెళ్తున్నాయని రెవెన్యూ అధికారులు పలువురు ప్రశ్నించగా ఆ కూపన్ ను వదిలేసి కొత్త కూపన్ తీసుకొని వెళ్లాల్సిందిగా డ్రైవర్లకు సూచించి తిరిగి వెళ్లడం పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొదటగా ఇల్లందు నుండి ఇసుక రవాణా చేసుకుంటామని పర్మిషన్ల కోసం వచ్చి ఒకవైపు ఇసుక రవాణా జరుగుతుంటే అది చాలదన్నట్లుగా టేకులపల్లి మండలం నుండి కూడా ఇటీవలే పరిమిషన్లు తీసుకొని ఇసుక తరలిస్తుండడంతో వాగు లో ఇసుక పూర్తిగా కరిగిపోతోందని ఇదేవిధంగా ఇంకా కొన్నాళ్లు సాగితే పూర్తిగా ఇసుక అయిపోయి నీటి కొరత ఏర్పడుతుందని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దొంగ కూపన్లతో ఇసుక రవాణా చేసే మధ్యవర్తులు, దళారులపై ప్రత్యేక నిగా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా కోరుచున్నారు.




### తహశీల్దార్ వివరణ :

ఇసుక రవాణాలో ఎటువంటి అక్రమాలు జరగడంలేదని మంగళవారం వచ్చిన ట్రాక్టర్ డ్రైవర్లలో ఇద్దరికి జ్వరం జ్వరం రావడంతో వారు ఇంటికి తిరిగి వెళ్ళడం జరిగిందని తహశీల్దార్ తెలిపారు. డ్రైవర్లకు జ్వరం రావడం వల్ల నిలిచిపోయిన ట్రాక్టర్లకు రాయపాడు కార్యదర్శి బుధవారం ఉదయం ఆ కూపన్ పై డేటు మార్చి పంపించారని తెలిపారు.

# పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కష్టాలు

- ఉన్న ఇల్లు పీకి పందిరేసారు
- ఓపెన్ కాని ఇందిరమ్మ యాప్
- 5 పంచాయతీలలో నిలిచిన నిర్మాణాలు
- లబ్ధిదారులలో ఆందోళన



**చర్ల, ఆగస్ట్ 6 (మనం న్యూస్) :** పేదలకు ఇందిరమ్మ ఇళ్ల కష్టాలు మొదలయ్యాయి. దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది వారి పరిస్థితి. ఇల్లు మంజూరయి అధికారులు పట్టాలను అందించడంతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేవు. ఇన్నాళ్లూ ఉన్న పాత ఇళ్లను తొలగించి ఇంటి నిర్మాణం చేపట్టేందుకు సమాయత్తమయ్యారు. పాత ఇంటి పక్కనే తాత్కాలికంగా చిన్న షెడ్డు వేసుకొని సేద దీరుతున్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు లబ్దిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి కేంద్రం నుండి వచ్చే నిధులకు సంబంధించిన వివరాలను ఆన్ లైన్ చేసారు. చివరి మజిలీగా లబ్దిదారుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వ ఇందిరమ్మ యాప్‌లో అప్ లోడ్ చేయాల్సి ఉండగా ఈ లోగా మండలంలోని ఐదు గ్రామ పంచాయతీల యాప్‌లు లాగిన్ కాకుండా మొరాయించాయి. ఇలా చర్ల పంచాయతీలో 69 ఇళ్లు, చిన్నమిడిసిలేరు పంచాయతీలో 24, కేశవాపురం పంచాయతీలో 34, పులిగుండాల పంచాయతీలో 13, కుదునూరు గ్రామ పంచాయతీలో 17 ఇళ్లు ప్రారంభానికి ముందే బ్రేకులు పడ్డాయి. వీటికి సంబంధించిన వివరాలు యాప్ లో అప్ లోడ్ అయిన తర్వాతనే సంబంధిత అదికారులు లబ్ధిదారుల ఇంటి నిర్మాణ ప్రాంతం వద్దకు వెళ్లి ముగ్గుపోయాల్సి ఉంటుంది. అనంతరం బేస్ మెంట్ లెవల్ కు వచ్చిన తర్వాత గ్రామ కార్యదర్శులు ఫోటో తీసి అప్ లోడ్ చేసిన అనంతరం మొదటి విడతగా రూ.లక్ష నగదు లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతాయి. ఈ నేపథ్యంలో ఆదిలోనే యాప్ కారణంగా నిర్మాణాలు ముగ్గు దశలోనే నిలిచిపోయాయి. ఈ క్రమంలో పాత ఇంటిని తొలగించిన లబ్ధిదారులు వర్షాకాలం పిల్లా పాపలతో చిన్న షెడ్డులో నివాసం ఉంటూ తీవ్ర అవస్థలు పడుతున్నారు. యాప్ విషయమై జిల్లా ఉన్నతాదికారులకు స్దానిక అధికారులు ఎన్నిమార్లు విన్నవించినా వారు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. అధికారులు ఇప్పటికయినా యాప్ సమస్యను పరిష్కరించి ఇల్ల నిర్మాణాలు సజావుగా సాగేలా చూసి తమ ఇబ్బందులు తొలగించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. కాగా లబ్దిదారుల పడుతున్న ఇబ్బందులను బుధవారం చర్ల పర్యటనకు వచ్చిన భద్రాచలం ఎంఎల్ఏ డాక్టర్ తెల్లం వెంకట్రావు దృష్టికి 'మనం' తీసుకువెళ్లగా స్పందించిన ఎం ఎల్ ఏ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారికి ఫోన్ చేసి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు.

# నిబద్ధత గల నాయకున్ని కోల్పోయాం

- అయోధ్యకు సిపిఐ నేతల ఘన నివాళి



**ఖమ్మం, ఆగస్టు 6(మనం న్యూస్):** సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు బొల్లోజు అయోధ్య మరణంతో కమ్యూనిస్టు పార్టీ ఒక నిబద్ధత కలిగిన నాయకున్ని కోల్పోయిందని సిపిఐ నేతలు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో మరణించిన సిపిఐ నాయకుడు బొల్లోజు అయోధ్య మృతదేహాన్ని ఖమ్మం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్కు తీసుకు వచ్చారు. సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, పోకలపాటి వెంకటేశ్వరరావు (పెద్దాబ్బాయి), సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ ఛైర్మన్ మహ్మద్ మౌలానా, జిల్లా కార్యదర్శి దండి సురేష్, ఎస్కె సాబీర్‌పాషా, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్రెడ్డి తదితరులు అయోధ్య పార్థివ దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు మాట్లాడుతూ చిరుప్రాయంలోనే ఎర్ర జెండా పట్టిన అయోధ్య తుదిశ్వాస వరకు ఎర్రజెండా నీడలోనే పని చేశారని ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తుదిశ్వాస వరకు ప్రజల పక్షాన నిలిచిన నాయకుడన్నారు. అనేక అటుపోట్లను తట్టుకుని నిలబడిన అయోధ్య భూ పోరాటంలో పాల్గొని వందలాది ఎకరాల భూ పంపిణీ చేశారని ఆయన తెలిపారు. సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మణుగూరు ప్రాంతంలోని -వివిధ కార్మిక సంఘాలు, ప్రజా సంఘాల నిర్మాణం కోసం అయోధ్య విశేష కృషి చేశారని ఆయన తెలిపారు. 1980 దశకంలో అప్పటి పీపుల్స్ వార్ బెదిరింపులకు సైతం అయోధ్య భయపడలేదని హేమంతరావు తెలిపారు. సమస్యల పరిష్కారంలో ముందు వరుసలో నిలిచేవారని సమస్యల పరిష్కారం కోసం తాను ఎంచుకున్న మార్గంలో తుదివరకు పోరాడే వారన్నారు. ఆయన మరణం పేద ప్రజలకు, హక్కుల కోసం పోరాడే వారికి తీవ్ర నష్టమని ఆయన తెలిపారు. ఆయన ఆశయ సాధన కోసం పునరంకితమవుతామన్నారు. నివాళులర్పించిన వారిలో పోకలపాటి లలిత రాజేశ్వరి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, మిరియాల రంగయ్య, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్దినేని కర్ణకుమార్, ముత్యాల సత్యనారాయణ, పలువురు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, ప్రజా సంఘాల బాధ్యులు ఉన్నారు.

# ప్రభుత్వ జూ. కళాశాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రతిపాదనలివ్వండి

- కలెక్టర్ విజయేందిర బోయి







**నవాబుపేట ఆగస్టు 6 (మనం న్యూస్ ):** ప్రభుత్వ జూనియర్ కళాశాల లో తరగతి గదుల్లో ప్యాన్ లు, లైట్ లు ఏర్పాటు,బాలురకు టాయిలెట్ నిర్మాణం,రిపేర్ లకు ప్రతిపాదనలు పంపాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు.బుధవారం నవాబ్ పేట మండలం యన్మన్ గండ్ల గ్రామంలో అంగన్ వాడి కేంద్రాన్ని,మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు.తొలుత అంగన్ వాడి కేంద్రం ను తనిఖీ చేశారు. అంగన్ వాడి కేంద్రం లో ఎంత మంది పిల్లలు ఉన్నారు.

ప్రతిరోజు ఎంత మంది వస్తున్నారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.29 మంది పిల్లలకు గాను 19 మంది పిల్లలు హాజరు అయ్యారని సి.డి.పి. ఓ వివరించారు. ఆహారం మెనూ అంగన్వాడీ కేంద్రంలో తనిఖీ చేశారు, కేంద్రంలో ముందుగా పిల్లల వివరాలు అడిగింది ఎంతమంది ఉన్నారు రోజు ఎంతమంది వస్తారు మొత్తం 29 మంది ఉన్నారు కానీ ఈరోజు 19 మంది వచ్చారని అంగనవాడి టీచర్ సమాధానం ఇచ్చారు. అంగన్వాడి కేంద్రంలో మెనూ ప్రకారం ఎగ్ బిర్యాని ,పప్పు అందించారు. పిల్లలకు మెనూ ప్రకారం పౌష్టికాహారం అందిస్తూ, ఆటపాటల ద్వారా పూర్వ ప్రాథమిక విద్యా కార్యక్రమాలను నిర్వహించాలని అంగన్‌వాడీ టీచర్ ను ఆదేశించారు. అంగన్ వాడి లో ప్యాన్ కు రెగ్యులేటర్,టాయిలెట్ రిపేర్ చేసి రన్నింగ్ వాటర్ సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.

**ప్రాథమిక పాఠశాల తనిఖీ....**

గ్రామం లో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం ను పరిశీలించారు.మధ్యాహ్న భోజనం నాణ్యతలో అందించాలని సూచించారు. ఇప్పటి నుంచి విద్యార్థులకు సరిపడే కూరగాయలను అందించాలని అధికారులను ఆదేశించారు. పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రత అలవాట్లు నేర్పించాలని సూచించారు. పాఠశాల ప్రాంగణ మంతా పరిసరాలను పరిశీలించారు. స్కూల్ ఆవర ణలో చెత్త నెలకొనడంతో ఎం.పి.డి. ఓ పంచాయతీ సెక్రెటరీ, ప్రధానోపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు.పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పాఠశాల లో,లైబ్రరీని పరిశీలించారు.లైబ్రరీలో స్విచ్ బోర్డ్ లు ఏర్పాటు చేయాలని అన్నారు. లైబ్రరీని విద్యార్థులు వినియోగించు కొనేలా చూడాలని అన్నారు. అధికారులు స్టడీ అవర్ లో విద్యార్థులచే చదివించాలని అన్నారు.పాఠశాలలో సెప్టిక్ ట్యాంక్ కు తవ్విన గుంట గమనించి పూడ్చి వేయాలని ఆదేశించారు. మూడవ తరగతి లో ప్రవేశించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థుల అందరితో ఇంగ్లీష్ అక్షర మాల చదివించి, గుణింతాలు, కూడికలు గురించి విద్యార్థులను ఆరా తీశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, వృక్షశాస్త్రం జంతుశాస్త్ర ప్రయోగశా లల ను కలెక్టర్ పరిశీలించారు. ఇంటర్ మీడియట్ రెండవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ మాట్లాడారు.

**ఎలా చదువుకుంటున్నారు ?...ఇంటర్ తర్వాత ఏమి చేస్తారు?**

ఎలా చదువుకుంటున్నారని, ఇంటర్ తర్వాత ఏమి చేస్తారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. చదువుతోపాటు ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని సూచించారు.. జూనియర్ కళాశాలలో టాయిలెట్ లు సరిపడా ఉన్నాయా అని ప్రిన్సిపాల్ ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు తప్ప విద్యార్థులకు,లెక్చరర్లకు టాయిలెట్ లు లేవని చెప్పడంతో కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కళాశాలలో కావలసిన సదుపాయాలు, ప్యాన్ లు, లైట్లు, విద్యుత్,టాయిలెట్ నిర్మాణం కు ,కంప్యూటర్ లకు డెస్క్ టేబుల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్ వెంట ఎం.పి.డి. ఓ జయరాం నాయక్, ఎం.పి. ఓ నసీర్ అహ్మద్,డి.టి.సువర్ణ,అర్. ఐ.గాయత్రి, ఏ.పి. ఓ జ్యోతి, పంచాయతీ కార్యదర్శి సుస్మిత, మాజీ ఎంపీటీసీ రామచంద్రయ్య, తదితరులు ఉన్నారు..



# తెలంగాణ గుండె చప్పుడు.. జాతిపిత

- తెలంగాణ సాధనకు అంకితమైన మహానుభావుడు
- జిల్లా కలెక్టరేట్లో తెలంగాణ జాతి పిత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి
- ఘనంగా నివాళులర్పించిన జిల్లా కలెక్టర్, శాసనమండలి సభ్యుడు



**నాగర్ కర్నూల్, ఆగస్టు 06 (మనం ప్రతినిధి) :** తెలంగాణ సిద్ధాంత కర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ తెలంగాణ గుండె చెప్పుడని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ జాతి పిత ప్రొఫెసర్ జయ శంకర్ జయంతి సందర్భంగా బుధవారం శాసనమండలి సభ్యుడు కూచకుళ్ళ దామోదర్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా శాసన మండలి సభ్యుడు కూచకుళ్ళ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధనే శ్వాసగా, ఆశయంగా భావించి జీవితాంతం ఆదిశగా నిరంతరంగా పోరాడిన మహానుభావుడు ప్రొఫెసర్ జయశంకర్ అని అన్నారు. స్వాప్నికుడిగా ఉద్యమ భావజాల వ్యాప్తి కోసం తన జీవితాన్ని అర్పించిన ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ జన హృదయాల్లో నిలిచిపోతారని కుచుకుళ్ళ దామోదర్ రెడ్డి కొనియాడారు. జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ తెలంగాణ తొలి ఉద్యమంలో రాష్ట్ర సాధన అనే భావన ప్రజల మనసుల్లో నిలిచిపోయేలా చేయడంలో ఆయన పాత్ర అమోఘమన్నారు. మేధావులు, విద్యావంతులు, ప్రజలు, యువతతో అనేక సభలు, సమావేశాలు నిర్వహిస్తూ ఉద్యమ జ్వాలను ప్రగతి పథంలో నిలిపారన్నారు. ఆయన చూపించిన దిశ, నిబద్ధత, ఆత్మీయత మలి ఉద్యమానికి ప్రేరణగా నిలిచి, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు బలమైన మౌలిక శిల్పిగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రజల గుండెల్లో ఆయన చిరకాలం చెరగని గుర్తుగా నిలుస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.అమరేందర్, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి ఖాజా నాజిమ్ అలీ అప్సర్, అన్ని శాఖల జిల్లా అధికారులు, వివిధ సంఘాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి



**కొండపాక, ఆగస్టు 6, మనం న్యూస్:** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అందుకు ల్యాబ్ లో పరీక్షలకోసం పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి వైద్య సిబ్బందికి సూచించారు. కొండపాక పీహెచ్.సిని బుధవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందించే వైద్య సేవలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. అటెండెన్స్ రిజిస్టర్ లీవ్ లెటర్లు, ఓ.పి రిజిస్టర్, ఫార్మసీ రిజిస్టర్ పరిశీలించారు. నోటి మాటతో సెలవు మంజూరు చేయవద్దని తప్పనిసరిగా లెటర్ పెట్టాలని డాక్టర్ శ్రీధర్ ను ఆదేశించారు. మండలంలో ఆయుష్ డిపార్ట్మెంట్ చేస్తున్న ఆక్టివిటీస్ గురించి ఆరా తీసి యోగాతో కలిగే ప్రయోజనాలను తెలుపుతూ ఎక్కువ మంది పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయుష్ డాక్టర్ రజినీకి తెలిపారు. ల్యాబ్ లో రోజు వారిగా ఎన్ని పరీక్షలు, ఎక్కువ ఏలాంటివి వస్తాయని విషయాలు ఆరా తీసి సీజనల్ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించడానికి అన్ని పరికరాలు ఉంచుకోవాలని తెలిపారు. మెడిసిన్ అందుబాటులో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. లోపల ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని అటెండర్ కు తెలిపారు. పిహెచ్.సి బయట గ్రామపంచాయతీ వర్కర్స్ తో శుభ్రం చేయించుకోవాలని డాక్టర్ ను ఆదేశించారు.

# ప్రభుత్వ వైద్యంపై ప్రజలలో నమ్మకం కలిగించాలి



- సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ కార్యాచరణ
- ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓపి సేవలు నిర్విరామంగా జరగాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి, ఆగస్టు 06 (మనం ప్రతినిధి):** ప్రభుత్వ వైద్యం పై ప్రజలలో నమ్మకం కలిగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్య ఆరోగ్య శాఖ పై సంబంధిత అధికారులతో రివ్యూ నిర్వహించారు.టీబీ ముక్త్ భారత్, సీజనల్ వ్యాధుల నియంత్రణ అంశాలపై చర్చించి అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సబ్ సెంటర్ పరిధిలో లక్ష్యాలను నిర్దేశించుకొని లక్షణాలు గల ప్రతి ఒక్కరికీ నిర్ధారణ పరీక్షల నిర్వహించాలని అన్నారు. ప్రతి ఫ్రై డే డ్రై డే కార్యక్రమం పక్కాగా జరగాలని అన్నారు. మనం తక్కువ ఇండ్లు కవర్ చేసినా నాణ్యతతో చేయాలని, నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని అన్నారు. సీజనల్ వ్యాధులు నియంత్రణ కోసం అవసరమైన చర్యలు పటిష్ఠంగా తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఔట్ పేషంట్ వచ్చే రోగులకు వ్యాధి లక్షణాలు ఉంటే తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. మన జిల్లాలో ఎక్కడ డెంగ్యూ, మల్లేరియా కేసు వచ్చినా పరిసర ప్రాంతాల్లోని 50 ఇండ్లకు ఫీవర్ సర్వే నిర్వహించాలని కలెక్టర్ అన్నారు. ఆసుపత్రిలో అవసరమైన మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు అందుబాటులో పెట్టుకోవాలని అన్నారు. 102 వాహనాల ద్వారా గర్భిణీ మహిళలకు సకాలంలో చెక్ అప్ జరిగేలా చూడాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న యంత్రాల మరమ్మత్తులు ఆగస్టు నెలాఖరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆగస్టు 11న జరిగే నులి పురుగుల నివారణ మందుల పంపిణీ కట్టుదిట్టంగా జరగాలని, 19 సంవత్సరాల వయసు లోపు పిల్లలకు మందులు పంపిణీ చేయాలని, ఆ రోజు మిస్ అయిన పిల్లలకు ఆగస్టు 18న తప్పనిసరిగా మందు అందేలా చూడాలని అన్నారు. పెద్దపల్లి జిల్లాలో అధికంగా సిజేరియన్ ఆపరేషన్లు జరుగుతున్నాయని, వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. మొదటి కాన్పు మహిళలకు మొదటి నుంచి సాధారణ ప్రసవాలు వైపు ప్రోత్సాహించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పరిధిలో ఎక్కువ గా ఆరోగ్య శ్రీ ఆపరేషన్ లు నిర్వహించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో సమయపాలన పాటించాలని, ఔట్ పేషెంట్ సేవలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట తప్పని సరిగా జరగాలని అన్నారు. జనరల్ మెడిసిన్ విభాగంలో పని తీరు మెరుగ్గా ఉండాలని అన్నారు. రోగులు, కుటుంబ సభ్యులతో వైద్యులు , సిబ్బంది మర్యాదతో ప్రవర్తించాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పని తీరు చాలా బాగుందని, ఇంకా మెరుగైన సేవలు అందించే సామర్థ్యం మన దగ్గర ఉందని ఆ దిశగా అధికారులు పని చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ అన్న ప్రసన్న కుమారి, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో జయశంకర్ జయంత్యుత్సవాలు



**జగిత్యాల ఆగస్టు 06 (మనం ప్రతినిధి):** ప్రొ. జయశంకర్ జయంతిని పురస్కరించుకొని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమములో ముందుగా డి. పి .ఓ. కార్యాలయ ఎ.ఓ.శశికళ ప్రొ. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అధికారులు, ఇతర పోలీస్ సిబ్బంది ప్రొ. జయశంకర్ చిత్రపటం వద్ద పూలను వుంచి తమ నివాళులను అర్పించారు. ఈ యొక్క కార్యక్రమంలో డి. సి. ఆర్. బి, ఎస్.బి, సి . సి.ఎస్. ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, ఆరిఫ్ అలీ ఖాన్, శ్రీనివాస్, ఆర్.ఐ. లు వేణు, సైదులు మరియు ఇతర పోలీసు అధికారులు పోలీస్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్వకుర్తి ఆర్డీఓగా జనార్ధన్ రెడ్డి



**కల్వకుర్తి ఆగస్టు 06(మనం న్యూస్):** తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజర్ గా పని చేస్తూ బుధవారం కల్వకుర్తి నూతన ఆర్డీఓగా ఎంపీ జనార్ధన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా కల్వకుర్తి నూతన ఆర్డీఓ పదవి బాధ్యతలు స్వీకరించిన ఎంపీ జనార్ధన్ రెడ్డి కు కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల తహసిల్దార్లు శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.గతంలో కల్వకుర్తి ఆర్డీఓగా పనిచేసిన శ్రీనునాయక్ పదోన్న తిపై నారాయణపేట జిల్లాకు అదనపు కలెక్టర్ గా వెళ్లారు.ఈ సందర్భంగా కల్వకుర్తి నూతన ఆర్డీఓ ఎంపీ జనార్ధన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజలకు రెవెన్యూ పరమైన సమస్యలను సిబ్బంది సహకా రంతో సత్వరం పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.అనంతరం ఆయన కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహసిల్దార్లతో సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ పరిధిలోని వివిధ మండలాల తహశీల్దార్లు సిబ్బంది పాల్గొన్నారు.

# మందులన్నీ ఉన్నాయా..?

## బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ

## ఆసుపత్రిలో వైద్య సేవల్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్, ఆగస్టు 06 (మనం ప్రతినిధి) :** మందులన్నీ ఉన్నయా..? వైద్యులు సకాలంలో హాజరౌతున్నరా..? అంటూ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆరా తీశారు. బిజినేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సేవలెలా ఉన్నాయో పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో రికార్డులు, ఔషధాల నిలువలను కలెక్టర్ పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది అందరూ రెగ్యులర్ విధులకు హాజరవుతున్నారా లేదా అని ఆరా తీశారు. రోజూ ఓపికి ఎంత మంది వస్తున్నారు..?, ఇప్పటి వరకు ఎంతమంది నమోదు అయ్యారని మెడికల్ ఆఫీసర్ ను అడిగి తెలుసుకున్నారు. అన్నిమందులు అందుబాటులో ఉన్నాయా లేవా అని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగ్యూ, చికున్ గునియా అంటు వ్యాధులకు అవసరమైన మందులు నిల్వలు ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన పేషెంట్స్ వద్దకు వెళ్లి ఆసుపత్రిలో వైద్య సేవలు ఎలా ఉన్నాయని, మంచిగా చూస్తున్నారా అని పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. మెడిసిన్ బయటి నుంచి తెచ్చుకోమని వైద్య సిబ్బంది ఏమైనా చెప్పారా అని ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గదులు, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ ఆసుపత్రి లో ఇప్పటి వరకు న్ని డెలివరీ కేసులు నమోదయ్యాయి, ఎన్ని నార్మల్ ప్రసవాలు జరిగాయని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, వైద్యులకు కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, పేద ప్రజల ఆరోగ్యాన్ని రక్షించేలా క్షేత్రస్థాయిలో వైద్యులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

# పౌరుల ప్రాణాలను రక్షించడంలో పోలీసుల పాత్ర అమూల్యమైనది

- ఎ ఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్



**మహబూబ్ నగర్, ఆగస్ట్ 6 (మనం న్యూస్):** పౌరుల ప్రాణాలను రక్షించడంలో పోలీసుల పాత్ర అమూల్యమైనదని ఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి. జానకి, ఆదేశాల మేరకు,బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సిపిర్ (కార్డీఓ పుల్మనరీ రెసుసైటేషన్) శిక్షణా కార్యక్రమం నిర్వహించరు. ఈ కార్యక్రమన్ని ఎ ఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో, మహబూబ్ నగర్ యం ఐ సి యూ హాస్పిటల్కు చెందిన ప్రముఖ వైద్యులు డా. రఘు సుప్రీత్ రెడ్డి మరియు వారి బృందం అందించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బందికి హఠాత్ హృదయ ఆపాత స్థితుల సమయంలో తీసుకోవలసిన అత్యవసర చర్యల గురించి ప్రాక్టికల్ పద్ధతిలో శిక్షణ ఇవ్వబడింది.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ, 'పౌరుల ప్రాణాలను రక్షించడంలో పోలీసుల పాత్ర అమూల్యమైనది. ఎలాంటి అత్యవసర పరిస్థితిలోనైనా మానవ సేవలో ముందుండేలా సిబ్బందికి ఈ రకమైన శిక్షణలు ఎంతో అవసరం,' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ రవి, ఆర్ ఎస్ ఐ లు, యం ఐ సి యూ హాస్పిటల్స్ సిబ్బంది మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు..

# వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, ఆగస్టు 06 (మనం ప్రతినిధి):** ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం ఉదయం 9 గంటలకు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి లోని ప్రతి వార్డు, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్ లను కలెక్టర్ పరిశీలించారు.ఔట్ పేషెంట్ విభాగంలో ఉదయం 9.30 తర్వాత ఆరుగురు వైద్యులు ఆలస్యంగా రావడం గమనించి ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలని, అవసరం అయితే క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని మెడికల్ సూపరింటెండెంట్, ఆర్. ఎం.ఓ లను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఔట్ పేషెంట్ సేవలు ఉదయం 9 గంటలకు ప్రారంభం కావాలని, ఆసుపత్రి వైద్యులు సకాలంలో విధులకు హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. వైద్యుల హాజరు పై సరైన పర్యవేక్షణ ఉండాలని, బయోమెట్రిక్ అటెండెన్స్ విధానం అమలులోకి తీసుకొని రావాలని కలెక్టర్ సూచించారు. ఆసుపత్రిలో పరిశుభ్రత పెంచుకోవాలని, కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రీమియం రేంజ్ లో సేవలు మరియు పారిశుధ్య సేవలు కూడా ఉండాలని, దీనికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు జిల్లా యంత్రాంగం నుంచి అందిస్తామని అన్నారు. ప్రభుత్వ వైద్యులు డ్యూటీ సమయంలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేయడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అదే విదంగా ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే సిబ్బంది పేషెంట్లతో మర్యాద పూర్వకంగా ఉండాలని ఆదేశించారు. ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ వేగవంతంగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం ఆయూష్ ఆసుపత్రి విభాగం పరిశీలించిన కలెక్టర్ రోగులతో అందుతున్న వైద్య సేవలు గురించి చర్చించారు. ఆయూష్ ఆసుపత్రిలో నెల రోజులకు అవసరమైన మందులు కొనుగోలు చేసి అందుబాటులో పెట్టడం జరిగిందని తెలిపారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత వైద్య అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం

- కలెక్టర్ ను అభినందించిన రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సెక్రటరీ, ఎండి వీపీ గౌతమ్.



**కామారెడ్డి, ఆగస్టు 06 (మనం జిల్లా ప్రతినిధి) :** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిలో రాష్ట్రస్థాయిలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపినందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ను, జిల్లా అధికార యంత్రంగాన్ని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ సెక్రటరీ, ఎండి వీపీ గౌతమ్ అభినందించారు.

బుధవారం హౌసింగ్ కార్పొరేషన్ ఎండి వీపీ గౌతం బిక్నూర్ మండలం బస్వాపూర్ గ్రామంను హౌసింగ్ అధికారులతో మరియు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తో కలిసి జిల్లాలోని బిక్నూరు మండలకేంద్రంలో ఫిల్టర్ రూప్ టెక్నాలజీ ద్వారా నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ హౌస్ ను మరియు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంను,

దోమకొండ మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం సందర్భంగా ఇసుక సరఫరా, బిల్లుల చెల్లింపు అంశాలపై లబ్ధిదారులతో మాట్లాడారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉచితంగా ఇసుక సరఫరా అయ్యేలా చూడాలని, దశలవారీగా నిర్మాణం జరిగిన కొద్దీ బిల్లులు వెంటనే లబ్ధిదారులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ., కామారెడ్డి జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతి రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉన్నదని, ఇందిరమ్మ లబ్ధిదారులచే ఇండ్ల నిర్మాణం ప్రారంభించడం, ఇండ్ల నిర్మాణాలకు ఇసుక, మొరం మరియు ఇతర మెటీరియల్, బిల్లుల చెల్లింపులలో ఎక్కడ సమస్య రాకుండా క్లస్టర్ వారిగా అధికారులను నియమించి అధికారులతో సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలలో పర్యటిస్తూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లాను రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో నిలిపినందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ కు మరియు ఇండ్ల నిర్మాణంలో పాలుపంచుకుంటున్న అన్ని స్థాయిల అధికారులకు అభినందనలు తెలిపారు. బిక్కనూరు మండల కేంద్రంలో ఫిల్టర్ రూప్ పద్ధతిలో నిర్మిస్తున్న మోడల్ ఇందిరమ్మ హౌసును చూడడం జరిగిందని, మామూలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కంటే ఈ పద్ధతిలో నిర్మించుకోవడం వలన నిర్మాణ వ్యయం తగ్గడమే కాకుండా ఇల్లు వేసవి కాలంలో చల్లగా మరియు శీతాకాలంలో వెచ్చగా ఉంటుందని లబ్ధిదారులు మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులను, మేస్త్రి లను తీసుకెళ్లి క్షేత్రస్థాయిలో చూపించాలన్నారు. ఇసుక అనేది ప్రభుత్వ ఆస్తి అని ప్రభుత్వ అనుమతి లేకుండా ఎవరు ఇసుక సరఫరా చేసిన అది చట్ట విరుద్ధం అని అలాంటి వారిపై నిగా పెట్టి చర్యలు తీసుకోవాలని అన్నారు. అదే సమయంలో ఇందిరమ్మ లబ్ధిదారులకు ఇలాంటి సమస్య ఇసుక రాకుండా హౌసింగ్ అధికారులు తాసిల్దార్ మరియు ఎంపీడీవోలతో సమన్వయం చేసుకొని ఉచితంగా ఇసుక టోకెన్లు అందించాలని, ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మాత్రమే ఇసుక రవాణా కొరకు ట్రాక్టర్లకు, లేబర్స్ లబ్ధిదారులు చార్జీలు చెల్లించేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. తద్వారా ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో ఎక్కువ వారం లబ్ధిదారుల పైన పడకుండా ఉంటుందని అన్నారు. అదేవిధంగా ఏర్పాటు చేసిన మండల స్థాయి ధరల నియంత్రణ కమిటీ కంకర, రాడ్లు, సిమెంటు, ఇటుకలు సరఫరా అయ్యేలా చూడాలని, మేస్త్రీలు అధిక మొత్తంలో నిర్మాణ చార్జీలు తీసుకోకుండా చూడాలని అన్నారు. హౌసింగ్ ఇంజనీర్లు ప్రతిరోజు నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ గృహాలను సందర్శించి లబ్ధిదారులకు సూచనలు, సలహాలు ఇస్తూ నాణ్యతగా ఇల్లు నిర్మాణం జరిగేలా చూడాలన్నారు. వారం వారం లబ్ధిదారులకు బిల్లును చెల్లించడం జరుగుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మట్టి గట్టిగా ఉంటుందని అన్ని ప్రాంతాలలో నిర్మాణానికి పిల్లర్స్ అవసరం లేవని అన్నారు. ప్లింత్ భీమ్ మాత్రమే వేసుకోవాలి తప్ప కాలమ్స్ మరియు పిల్లర్స్ వేసుకోవాలని లబ్ధిదారులపై ఒత్తిడి తీసుకురావద్దని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా అనర్హులు ఎంపిక అయితే వారు ఏ స్థాయిలో ఇల్లు నిర్మించుకున్న ఇంటి నిర్మాణం ఆపివేసి సంబంధిత అధికారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. అలాగే పెండింగ్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సమస్యలను పరిష్కరించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా12090 లక్ష్యంతో 11883 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా వాటిలో 5721 ఇండ్లకు ముగ్గు పోసి ప్రారంభించడం జరిగింది. ఇప్పటివరకు 2182 ఇండ్లు బేస్మెంట్ లెవల్ వరకు, 66 ఇండ్లు రూఫ్ లెవల్ వరకు నిర్మాణం పూర్తికాగా 1 ఇల్లు నిర్మాణం పూర్తయింది. 2111 ఇండ్లకు నిర్మాణ దశను బట్టి బిల్లులు చెల్లించడం జరిగింది. 431 మంది నిరుపేద లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం ప్రారంభించుకునేందుకు ఐకెపి మహిళా సంఘాల ద్వారా లింకేజీ రుణం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రెవెన్యూ విక్టర్, లోకల్ బాడీస్ చందర్ నాయక్, పిడి హౌసింగ్ విజయ్ పాల్ రెడ్డి, కామారెడ్డి ఆర్డీవో వీణ, హౌసింగ్ డిఇ సుభాష్, ఏఈలు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆచార్య జయశంకర్ జయంతి...



**కామారెడ్డి, ఆగస్టు 06 ( మనం ప్రతినిధి ) :** తెలంగాణ సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప త్యాగశీలి ఆచార్య జయశంకర్ అని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారికంగా నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసిన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ., అన్ని రంగాలలో వెనుకబడిన తెలంగాణ సమాజాన్ని చైతన్య పరిచేందుకు ఆచార్య జయశంకర్ తన జీవితాన్ని అంకితం చేశారని అన్నారు. ముఖ్యంగా ఉన్నత విద్యావంతుడైన ఆయన తెలంగాణ సమాజానికి జరుగుతున్న అన్యాయాలను చూసి చెలించి అన్ని దశల తెలంగాణ ఉద్యమాలలో క్రియాశీలకంగా పాల్గొని తన రచనలు, ప్రసంగాల ద్వారా తెలంగాణ సమాజాన్ని తట్టి లేపి తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమానికి ఊపిరి పోశారన్నారు. కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్స్ లర్ గా వేలాదిమంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి మార్గదర్శక నిలిచారని ఆయన అడుగుజాడల్లో తెలంగాణ సమాజ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ విక్టర్, కలెక్టరేట్ ఏవో, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది, టీఎన్జీవో, టీజీవో నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలి



- ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం డిమాండ్

**నిజామాబాద్, ఆగస్టు 06 (మనం బ్యూరో) :** రైతు ఆత్మహత్య యత్నానికి కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని అటవిశాఖ ఉన్నతాధికారులకు బంజారా సేవా సంఘం బుధవారం ఫిర్యాదు చేశారు. బైరాపూర్ గ్రామ పంచాయితీ పరిధిలో పోడు భూమిలో వేసిన పంటపైన మందు పిచికారీ చేసి ప్రకాష్ అనే గిరిజనుడు గడ్డి మందు తాగి ఆత్మహత్య యత్నం చేసుకోవానికి కారకులైన అధికారులపై చర్య తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం (ఎఐబిఎస్ఎస్) ఆధ్వర్యంలో అటవీ శాఖ కార్యాలయం ముందు ధర్నా చేశారు. మోపాల్ మండల మాజీ జడ్పీటీసీ నరేష్ నాయక్ సారథ్యంలో మోపాల్ మండల గిరిజనులు ప్రకాష్ ఆత్మహత్య యత్నానికి కారకులైన వారిపై చర్య తీసుకోవాలని దక్షిణ మండలం అటవీ శాఖ అధికారి రాధిక కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ నరేష్ మాట్లాడుతూ., మంగళవారం మోపాల్ వండలంలోని భైరపూర్ గ్రామనికి చెందిన ప్రకాష్ మోజిరామ్ నాయక్ తండా వద్ద తరాతరలుగా పోడు భూమలో సాగు చెస్తున్నారని గత ప్రభుత్వం గిరిజనులకు పట్టాలు ఇవ్వటంతో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు గిరిజన హక్కుల చట్టాన్ని ఉల్లంగిస్తూ అటవీ అధికారుల బృందం పంటలను నాశనం చేయడం సమంజసం కాదన్నారు.మొక్కజొన్న పంటపై గడ్డి మందు (హీర్బేడ్) పిచికారీ చెసి ప్రకాష్ కుటందానికి తీవ్ర నష్టం కలిగించారన్నారు. దీనిని జీర్ణించుకోలేక అటివిశాఖ అధికారుల తీరును నిరసిస్తూ అక్కడే ఉన్న గడ్డి మందును సేవించి ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించడం తీవ్రంగా కలచి వేసిందన్నారు ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామావత్ మోహన్ నాయక్, ప్రధానకార్యదర్శి కేతావత్ పీర్ సింగ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# వేల్పూర్‌లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు

- ఎంపీడీఓ, తహసీల్ కార్యాలయాల సందర్శన
- భూభారతి దరఖాస్తులపై రెవెన్యూ అధికారులతో సమీక్ష
- పీ.హెచ్.సీ, జెడ్పీ హైస్కూల్, ఎరువుల గోడౌన్ తనిఖీ



**నిజామాబాద్, ఆగస్టు 06 (మనం న్యూస్) :** వేల్పూర్ మండల కేంద్రంలో కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సహకార సంఘం ఎరువుల గోడౌన్ లను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలో బోధన, బోధనేతర సిబ్బందితో పాటు విద్యార్థుల హాజరును ఫేస్ రికగ్నేషన్ విధానం (ఎఫ్.ఆర్.ఎస్) ద్వారా చేపడుతున్నారా లేదా అని పరిశీలించారు. సాంకేతిక ఇబ్బంది కారణంగా కొంతమంది విద్యార్థుల ముఖ గుర్తింపు హాజరు నమోదు కావడం లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజన్న తెలుపగా, కలెక్టర్ అప్పటికప్పుడు తన సమక్షంలోనే ఎఫ్.ఆర్.ఎస్ ఇపద్ధతిన విద్యార్థుల హాజరును ఆన్లైన్ లో నమోదు చేయించారు. నూతనంగా ప్రవేశపెట్టిన ముఖ గుర్తింపు హాజరు విధానం సంపూర్ణంగా అమలు అయ్యేలా చూడాలని, క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తలెత్తితే వాటిని పరిష్కరించుకుంటూ ముందుకువెళ్లాలని సూచించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులకు వివిధ సబ్జెక్టులలో ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్న తీరును గమనించారు. ఆయా సబ్జెక్టులలో వెనుకబడి ఉన్న విద్యార్థులను గుర్తించి, అలాంటి వారి పట్ల ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని హితవు పలికారు. వంట గది, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసిన కలెక్టర్, విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, ఉడకబెట్టిన కోడి గుడ్డును అందించాలని ఆదేశించారు. విద్యార్థులు అందరూ తరగతులకు ప్రతిరోజూ హాజరయ్యేలా చూడాలని అన్నారు. అంతకుముందు కలెక్టర్ వేల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీ.హెచ్.సీ ద్వారా ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను, అందుబాటులో ఉన్న ఔషధ నిల్వలను కలెక్టర్ పరిశీలించారు. కాన్పులు చేసేందుకు వీలుగా అన్ని వసతులు అందుబాటులో ఉన్నందున గర్భిణీలు స్థానికంగానే సుఖ ప్రసవాలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వీణకు సూచించారు. జాతీయ నులి పురుగు నివారణ మాత్రల పంపిణీ, వ్యాక్సినేషన్, గర్భిణీలకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షల నిర్వహణ తదితర కార్యక్రమాలు సంపూర్ణంగా అమలయ్యేలా చూడాలని అన్నారు. లింగ నిర్ధారణ, భ్రూణ హత్యలు వంటివి చోటుచేసుకోకుండా గట్టి నిఘా ఉంచాలని, ఏదైనా స్కానింగ్ సెంటర్లలో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గమనిస్తే వెంటనే పై అధికారులకు సమాచారం అందించాలని, అలాంటి కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. కాగా, పీ.హెచ్.సీలలో బేబీ వార్మర్లు పని చేయడం లేదని తెలుసుకున్న కలెక్టర్, టీ.జీ.ఎం.ఎస్.ఐ.డీ.సీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కు ఫోన్ చేసి, వెంటనే అన్ని పీ.హెచ్.సిలలో బేబీ వార్మర్లకు మరమ్మతులు చేయించాలని, అవసరమైన చోట కొత్తవి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎరువుల గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల స్టాక్ వివరాలతో కూడిన బోర్డును రైతులకు కనిపించే విధంగా ప్రదర్శించాలని, పూర్తి స్థాయిలో అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, జిల్లాలో ఎక్కడ కూడా ఎరువుల పంపిణీ సమయంలో టోకెన్ పద్ధతి, క్యూ విధానాలను అమలు చేయకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులపై ఒక్కో గ్రామం వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. వచ్చిన దరఖాస్తులలో ఆయా మాడ్యుల్స్ లో ఎన్ని అర్జీలు పరిష్కరించారు, ఎన్ని పెండింగ్ లో ఉన్నాయి, ఎంతమందికి నోటీసులు ఇచ్చారు, క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ పూర్తయ్యిందా తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూభారతి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అర్జీల పరిష్కారంలో జాప్యం జరుగకుండా రోజువారీగా దరఖాస్తుల పరిశీలనను పర్యవేక్షిస్తూ, వేగవంతంగా వాటిని పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అక్కడి నుండి ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన కలెక్టర్, మండలంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ఎంపీడీఓ బాలకిషన్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా పాలన సేవా కేంద్రంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారా అని ఆరా తీసిన కలెక్టర్, ఆన్లైన్ వివరాలను పరిశీలించారు. ప్రజా పాలన సేవా కేంద్రం కొనసాగుతున్నట్లు ప్రజలకు తెలిసేలా ఫ్లెక్సిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాగా, ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతి గురించి పంచాయతి కార్యదర్శి వినోద్ ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. లబ్దిదారులు అందరూ ఇళ్ళను నిర్మించుకునేలా పర్యవేక్షణ జరపాలని సూచించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించిన ఆర్డీవో



**నాగిరెడ్డిపేట, ఆగస్టు 06 (మనం న్యూస్):** మండలంలోని గోలిలింగాల గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థసింహారెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో పార్థసింహారెడ్డి మాట్లాడుతూ., ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. గ్రామంలో వర్షాకాలంలో ఏలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసిల్దార్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి సంతోష్ కుమార్, నాయకులు సురేందర్ గౌడ్, మోహన్ రెడ్డి, అశోక్ గౌడ్, కుమార్, మహేష్, రామస్వామి, సాయిలు ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాన్సువాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన ప్రత్యేక అధికారి

**బాన్సువాడ, ఆగస్టు 06 ( మనం న్యూస్ ) :** కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను బుధవారం ఇంటర్మీడియట్ నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల స్పెషల్ ఆఫీసర్ దాసరి ఒడ్డెన్న ఆకస్మికంగా తనిఖీ చేశారు.



ఉదయం ప్రార్థన సమయానికి విచ్చేసి విద్యార్థినులతో కలిసి ప్రార్థన చేశారు. అనంతరం మొదటి సంవత్సరంలో అత్యధిక మార్కులతో ర్యాంకులు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించారు. తదనంతరం కళాశాల అధ్యాపకులతో స్టాఫ్ మీటింగ్ నిర్వహించి అధ్యాపకుల టీచింగ్ డైరీస్, హాజరు పట్టికలు, సబ్జెక్టు వారిగా ఉత్తీర్ణత శాతం, యూనిట్ టెస్ట్ వివరాలు, కళాశాలకు హాజరుకాని విద్యార్థుల వివరాలు పరిశీలించారు.అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించడానికి అధ్యాపకులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అన్ని చాలా చక్కగా బాగున్నాయని ప్రిన్సిపాల్ అసద్ ఫారూఖ్ ని అభినందించారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, కళాశాల ప్రిన్సిపాల్ అసద్ ఫారూఖ్, జిల్లా ఏ జి ఎం సి శివకుమార్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

**జాతీయం- అంతర్జాతీయం**

## ఎయిర్‌పోర్టులకు ఉగ్రవాద ముప్పు

- ఇంటెలిజెన్స్ హెచ్చరికలు

**ఢిల్లీ, ఆగస్టు 6 :** దేశవ్యాప్తంగా అన్ని విమానాశ్రయాల భద్రతకు ముప్పు పొంచి ఉందని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఉగ్ర, సంఘ వ్యతిరేక శక్తులు దాడులకు పాల్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యాయి. దేశంలోని అన్ని ఎయిర్‌పోర్టుల్లో హైఅలర్ట్ ప్రకటించారు. ఈ ఏడాది సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 మధ్య విమానాశ్రయాలపై దాడులు జరిగే అవకాశం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దీంతో కేంద్ర పౌర విమానయాన



భద్రతా బ్యూరో అన్ని ఎయిర్‌పోర్టులకు అడ్వైజరీ జారీ చేసింది. విమానాశ్రయాల్లో తక్షణమే భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించింది. రన్‌వేలు, హెలీప్యాడ్స్, ఫ్లైయింగ్ స్కూల్స్, ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్లలో భద్రత పెంచాలని సూచించింది. దీంతో విమానాశ్రయాల వద్ద భద్రతా సిబ్బంది అప్రమత్తమయ్యారు. టెర్మినల్స్, పార్కింగ్ ఏరియా, పెరీమీటర్ జోన్, ఇతర సున్నితమైన ప్రాంతాల్లో పెట్రోలింగ్‌ను పెంచారు. స్థానిక పోలీసుల సహకారంతో ఎయిర్‌పోర్టులకు వెళ్లే మార్గాల్లోనూ తనిఖీలు చేపట్టేందుకు సిద్ధమయ్యారు. అంతర్జాతీయ, దేశీయ మార్గాల్లో పంపే మెయిల్ పార్సిళ్లను క్షుణ్ణంగా సోదా చేస్తున్నారు. సిబ్బంది, కాంట్రాక్టర్లు, విజిటర్స్‌ను కూడా తనిఖీలు చేయాలని నిర్ణయించారు. విమానాశ్రయాల వద్ద అనుమానాస్పదంగా ఎవరైనా వ్యక్తులు గానీ, లగేజీ గానీ కన్పిస్తే తక్షణమే సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాలని ప్రయాణికులకు సూచించారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్స్‌ను యాక్టివేట్ చేశారు. అవసరమైతే మాక్ డ్రిల్స్ చేపట్టాలని పౌర విమానయాన భద్రతా బ్యూరో సంబంధిత అధికారులకు సూచించింది.

# ఆ 65 లక్షల ఓటర్ల వివరాలు సమర్పించండి

- ఎన్నికల సంఘాన్ని ఆదేశించిన సుప్రీం

**ఢిల్లీ, ఆగస్టు 6 :** బీహార్లో ఎన్నికల నేపథ్యంలో ఓటరు జాబితా నుంచి 65 లక్షల మంది ఓటర్లను తొలగించామని పేర్కొంటూ ఎన్నికల సంఘం ఇటీవల ముసాయిదా విడుదల చేసిన సంగతి తెలిసిందే. తాజాగా తొలగించిన ఆ 65 లక్షల ఓటర్ల వివరాలను సమర్పించాలని సుప్రీంకోర్టు ఈసీని ఆదేశించింది. ఇందుకోసం ఈనెల 9 వరకు గడువు ఇచ్చింది.

బీహార్‌లో ఈసీ ఓటర్ల ప్రత్యేక సవరణను నిర్వహించడాన్ని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే ఎన్జీవో గతంలో సుప్రీంలో సవాల్ చేసింది. ఈసీ ముసాయిదా విడుదల నేపథ్యంలో తొలగించిన ఓటర్ల వివరాలు వెల్లడించాలంటూ మరో దరఖాస్తు దాఖలు చేసింది. దీనిపై అత్యున్నత న్యాయస్థానంలో బుధవారం విచారణ జరగ్గా.. ఇప్పటికే రాజకీయ



పార్టీలకు వివరాలను సమర్పించిన నేపథ్యంలో ఎన్జీవోకు కూడా వాటిని అందించాలని ఆదేశించింది. రాజకీయ పార్టీలకు జాబితా ఇచ్చినప్పటికీ.. తొలగింపునకు గల కారణాలు తెలపలేదని ఎన్జీవో తరఫు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ప్రస్తుతం జాబితా వివరాలను మాత్రమే అందిస్తుందని, ఆ తర్వాత కారణాలను వెల్లడిస్తుందని స్పష్టంచేసింది. ఈసందర్భంగా పోల్ ప్యానెల్ సిబ్బంది ఓటరు జాబితా నుంచి కొంతమంది ఓటర్లను ఉద్దేశపూర్వకంగా తీసేశారని ఎన్జీవో తరఫు న్యాయవాది ఆరోపించారు. ఎస్ఐఆర్‌ను సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను ఈనెల 12న విచారిస్తామని, అక్కడ మీ వాదనలను వినిపించవచ్చని న్యాయస్థానం పేర్కొంది.

బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతోన్న వేళ ఈసీ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ప్రక్రియ పూర్తవడంతో దానికి సంబంధించిన ముసాయిదాను ఇటీవల విడుదల చేసింది. ఇది రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రతిపక్ష పార్టీలు ఈసీ చర్యను తీవ్రంగా తప్పుబడుతున్నాయి.

## బ్రెజిల్లో ట్రంప్ మిత్రునికి గృహనిర్బంధం

### బోల్సొనారోకు శిక్ష ఖరారుచేసిన ఆ దేశ సుప్రీంకోర్టు

**సావోపాలో, ఆగస్టు 6 :** బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు జైర్ బోల్సొనారో (70)కు దేశ సుప్రీంకోర్టు గృహనిర్బంధ శిక్ష విధించింది. 2022 అధ్యక్ష ఎన్నికలో ఓడిపోయి కూడా తన అనుయాయులతో తిరుగుబాటుకు ప్రయత్నించి, ఎన్నికల ఫలితాన్ని తారుమారు చేయడానికి ప్రయత్నించినందుకు ఆయనకు ఈ శిక్ష పడింది. 2023 జనవరి 8న బోల్సొనారో అనుయాయులు బ్రెజిల్ ప్రభుత్వ భవనాలపై దాడికి ప్రయత్నించారు. బోల్సొనారోకు క్షమాభిక్ష ఇవ్వాలని కోరుతూ సావోపాలో, రియో డి జనీరో నగరాల్లో ఆదివారం వేలమంది అభిమానులు భారీ ప్రదర్శన నిర్వహించారు. వారిలో ఆయన ఓటమి అనంతరం ప్రభుత్వ భవనాలపై దాడిచేసినవారు కూడా చాలామంది ఉన్నారు. సుప్రీం కోర్టు న్యాయమూర్తి అలెగ్జాండ్రే డి మొరేస్ సోమవారం బోల్సొనారోకు గృహ నిర్బంధ శిక్ష విధించగానే అమెరికా విదేశాంగ శాఖ ఆ నిర్ణయాన్ని ఖండించింది. అంతకుముందు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మిత్రుడు, అతిమితవాద మాజీ అధ్యక్షుడు బోల్సొనారోను బ్రెజిల్ వామపక్ష ప్రభుత్వం వేధిస్తోందని మండిపడ్డారు. ఆయనపై కోర్టు విచారణ జరుపుతున్నందుకు బ్రెజిల్ ఎగుమతులపై 50 శాతం సుంకం విధించారు. 2022లో బోల్సొనారో ఓడిపోయినప్పుడు నాటి ఎన్నికల్లో విజేత, ప్రస్తుత దేశాధ్యక్షుడు డ సిల్వా, సుప్రీం కోర్టు న్యాయమూర్తి డి మొరేస్‌లను హతమార్చాలని చూశారని ప్రాసిక్యూషన్ ఆరోపణ.

## ట్రంప్ సుంకాల హెచ్చరికల వేళ

### రష్యా పర్యటనకు అజిత్ డోభాల్



ఢిల్లీ, ఆగస్టు 6: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై సుంకాల హెచ్చరికలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రతరం చేశారు. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ రష్యా పర్యటనకు వెళ్లారు. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. డోభాల్ పర్యటన ముందుగానే ఖరారైందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. అయితే, భారత్- రష్యా సంబంధాలపై ట్రంప్ ఇటీవల కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో ఈ పర్యటన చర్చనీయాంశంగా మారింది. మాస్కోతో రక్షణ, ఇంధన సంబంధాల బలోపేతమే ఈ పర్యటన ముఖ్య లక్ష్యంగా తెలిపాయి. రష్యా చమురు సరఫరాలు, పరిశ్రమల సహకారం వంటి వాటితో పాటు మరిన్ని ఎస్-400 క్షిపణి వ్యవస్థలు, రష్యాకు చెందిన ఎస్క్యూ-57 యుద్ధ విమానాల కొనుగోలుకు సంబంధించిన కీలక అంశాలపై మాస్కో అధికారులతో డోభాల్ చర్చలు జరిపే అవకాశం ఉందని వెల్లడించాయి. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ కూడా ఈ నెలాఖరులో రష్యాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. ఇరుదేశాల మధ్య రక్షణ, ఇంధన, వాణిజ్య చర్చలే లక్ష్యంగా ఆయన పర్యటన ఉండనున్నట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. ద్వైపాక్షిక, అంతర్జాతీయ అంశాలపై చర్చించేందుకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్‌తో సమావేశం కానున్నారు.

# అధికారుల నిర్లక్ష్యం నిరుపేదకి శాపం

## అధికారుల నిర్లక్ష్యం నిరుపేదకి శాపం

ఎల్ వన్ లో ఉండాల్సిన వ్యక్తిని 3లో నమోదు చేసిన వైనం

ఇందిరమ్మ ఇల్లు మంజూరు దూరం

సొంత ఇంటి సహకారంకై

15 సంవత్సరాలుగా వికలాంగుడి నిరీక్షణ

ఇందిరమ్మ రాజ్యంలో నైనా

కంటతడి పెట్టుకున్న వికలాంగుడి కుటుంబం

నిరాసుడు అయిన వికలాంగులపై మనం ప్రత్యేక కథనం



**గరిడేపల్లి,ఆగస్టు 6,(మనం న్యూస్):** దేవుడు వరం ఇచ్చిన... పూజారి అడ్డుపడ్డ చందంగా మారింది ఓ వికలాంగుడి కుటుంబం.. 15 ఏళ్ల కాలంలో ఎన్ని ప్రభుత్వాలు మారినా... ఎంతమందికి ఆర్జీలను పెట్టుకున్న.. తన సొంత గూటికల కనగానే మిగిలిపోయింది... పేదవాడి సొంత ఇంటి సాకారం నెరవేరాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహం పథకం పేదలకు గొప్ప వరమైనప్పటికీ సర్వేకి వచ్చిన అధికారులు కిరాయి ఇంటిలో స్లాబ్ లో అద్దెకు ఉండే వారిని ఫోటో తీసి రెంటు హౌస్ అని రికార్డు పంపినా కానీ ఇందిరమ్మ పోర్టల్ లో ఎల్ 3 లో రికార్డ్ బిల్డింగ్ అని నమోదయి అర్హులైన వారు కూడా అనర్హులుగా రికార్డులోకెక్కుతున్నారు ఇది కేవలం అధికారుల నిర్లక్ష్య వైఖరికి అర్థం పడుతుంది....వివరాలలోకి వెళితే గరిడేపల్లి మండల కేంద్రానికి చెందిన కోమరాజు నరసింహారావు దివ్యాంగుడు వయసు 45.ఇతనికి భార్య,ఇద్దరు పిల్లలు ఉన్నారు.ఇతను గతంలో పోలీస్ స్టేషన్ ఎదురుగా పిటిషన్లు రాసి జీవనం సాగించేవాడు.ఇతనికి 81 చదరపు గజముల ఖాళీ స్థలము తప్ప సొంత ఇల్లు కూడా లేని నిరుపేద పిటీషన్లు రాసి పొట్ట పోషించుకునే ఈ నిరుపేదకు విధిరాత సైతం నిరాకరించింది.తన జీవిత ప్రయాణానికి తనకు సహకరించకపోక కాలు విరిగి ఇంటి వద్దనే జీవిస్తున్నాడు.ఇల్లు గడవని స్థితిలో ఉన్న తన కుటుంబానికి భార్య కూలి నాలి చేసి తన ఇద్దరు పిల్లలని చదివిస్తూ... 4000 పెన్షన్ తోని జీవనం కొనసాగిస్తున్న తనకు కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రజా పాలనలో ఇందిరమ్మ గృహం పథకంలో తన భార్య పేరైన కోమరాజు రమణ పేరుమీద ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్నాడు.15 సంవత్సరాలుగా ఒక కిరాయి ఇంట్లో తనకు వస్తున్న నాలుగు వేల పెన్షన్తో ఒక అద్దె ఇంట్లో (ఒక గది) డాబా స్లాబ్ జీవనం కొనసాగిస్తున్న అతనికి సర్వే కొచ్చిన అధికారులు ఫోటో తీసి రికార్డులో రెంట్ హౌస్ అని పంపించినప్పటికీ ఎల్ 3 రికార్డులో బిల్డింగ్ అని నమోదు కావడంతో ప్రజా పాలనలో దరఖాస్తు పెట్టుకున్న దరఖాస్తుదారుడికి ఇందిరమ్మ ఇల్లు సాంక్షన్ కాకపోవడంతో స్లాబ్ ఒక గదిలో నెలకు1500 రూపాయల కిరాయికి ఉంటున్న అతనికి స్లాబ్ గది కిరాయికి ఉండుటం కూడా ఒక శాపంగా మారిందని వారు తమ ఆవేదన వ్యక్తం చేశారు.కలెక్టర్ సాబ్ వికలాంగుడనై,నిరుపేదనైన నాకు ఇందిరమ్మ గృహం పథకంలో ఇల్లు మంజూరు చేయాలని వికలాంగుడి ఆవేదన వ్యక్తం చేశారు.

# ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలు జిల్లా నుండి ప్రారంభం

- సన్నబియ్యం, రేషన్ కార్డులు పంపిణి ఇక్కడి నుండి ప్రారంభించటం అదృష్టం
- ఇందిరమ్మ ఇళ్లకు ఇసుక ఉచితం
- రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
- ఇల్లు త్వరగా నిర్మించుకొని గృహప్రవేశానికి ఆహ్వానించాలి
- స్థానిక శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి



**ఆత్మకూర్ ఎస్ ఆగస్టు 6 (మనం న్యూస్):** రాష్ట్ర వ్యాప్తంగా హుజూర్నగర్ నుండి సన్నబియ్యం పంపిణీ, తిరుమలగిరి నుండి నూతన్ రేషన్ కార్డులు పంపిణీ చేయటం మన జిల్లా అదృష్టం అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం ఆత్మకూర్ (ఎస్) మండలం నెమ్మికల్లు లోని రామయ్య ఫంక్షన్ హల్ లో సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డితో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆత్మకూర్ ఎస్ మండలంకి చెందిన వారికి నూతన రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణి చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆత్మకూరు ఎస్ మండలంలో 704 నూతన కార్డుల ద్వారా 2239 మందికి సన్నబియ్యం పంపిణి అర్హత లభించిందని, అలాగే ఇప్పటికే ఉన్న కార్డులలో 1169 మందిని అదనంగా చేర్చి కొత్తగా అవకాశం కల్పించటం జరిగిందని, 1030 ఇందిరమ్మ ఇండ్లు ను మంజూరు అయ్యాయని అన్నారు. రేషన్ కార్డులు రాని వారు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని కొత్త కార్డు కొరకు మీ సేవ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని తదుపరి అర్హత ఉంటే తహసీల్దార్ పరిశీలించి పౌర సరఫరాల శాఖ ద్వారా కార్డు మంజూరు చేస్తారని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లను 400 నుంచి 600 చదరపు అడుగులలో నిర్మించుకోవాలని ముగ్గులు పోసిన తర్వాత ఫోటో క్యాప్చర్ చేస్తామని బేస్ మెంట్ పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ లెవెల్ గోడలు పూర్తి కాగానే లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తి కాగానే 2 లక్షల రూపాయలు, ఇల్లు పూర్తి కాగానే లక్ష రూపాయలు ఇలా నాలుగు దశలలో 5 లక్షల రూపాయలను ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని ఇండ్లు పొందిన లబ్ధిదారులు వెంటనే ప్రారంభించుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కొరకు ప్రభుత్వం ఇసుక ఉచితంగా ఇస్తుందని తాపీ మేస్త్రీలు, సిమెంటు,ఇనుము లాంటి నిర్మాణసామాగ్రి ధరలు అదుపులో ఉంచేందుకు మండల స్థాయిలో ధరల నియంత్రణ కమిటీ ఏర్పాటు చేశామని ఈ బృందం సమావేశం ఏర్పాటు చేసుకొని మేస్త్రీలతో వ్యాపారస్తులతో మాట్లాడి ధరలను అదుపులో ఉంచేలా చూస్తారని అన్నారు. సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం ఇవ్వటం,ఇల్లులు ఇవ్వటం అభినందనీయం అని ఇండ్లు త్వరగా పూర్తి చేసి గృహ ప్రవేశానికి ఆహానించాలని లబ్ధిదారులకి సూచించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసాక అన్ని అమలు చేయాలని సూచించారు. సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ ఆత్మకూర్ ఎస్ మండలంలో 1030 ఇందిరమ్మ ఇండ్లు అలాగే 704 నూతన రేషన్ కార్డులకి మంజూరు పత్రాలు ఈరోజు ఇస్తున్నామని అన్నారు. పేదవారికి ఇంకెవరికైనా ఇండ్లు, రేషన్ కార్డులు రానివారు ఉంటే మరల దరఖాస్తు చేసుకోవాలని పేదలు కడుపునిండా అన్నం తినాలని ప్రభుత్వం సన్న బియ్యం ఇస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వేణు మాధవ్, పి ఏ సి ఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి,మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ నాయక్,డి ఎస్ ఓ మోహన్ బాబు,హౌజింగ్ పిడి సిధార్థ,తహసీల్దార్ అమీన్ సింగ్, ఎంపిడిఓ మహమ్మద్ హసీం,మార్కెటింగ్ డైరెక్టర్లు,అధికారులు, లబ్ధిదారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి అర్జీలను వెంటనే పరిష్కరించాలి




**సూర్యాపేట, ఆగస్టు 06 (మనం ప్రతినిధి):** భూభారతి అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నందు అదనపు కలెక్టర్ పి రాంబాబు తో కలిసి జిల్లాలోని ఆర్డీవో, తహసీల్దార్ లతో వెబ్ ఎక్స్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూభారతి రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన ఆర్జీలను త్వరగా పరిష్కరించాలని, వీలైనంత ఎక్కువ సిబ్బందిని వినియోగించుకొని ప్రతి గ్రామాన్ని సందర్శించి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో స్థాయిలో పరిశీలించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా పరిష్కరించాలని, ఒక గ్రామంలో పూర్తిగా దరఖాస్తుల పరిశీలన పూర్తయిన పీదప మరొక గ్రామానికి వెళ్లాలని ఆ విధంగా ఆర్డీవో లు అందరూ సంబంధిత తహసీల్దార్ లకు దిశా నిర్దేశం చేయాలని, అవసరం అయితే పైస్థాయి సిబ్బందిని కూడ వినియోగించుకొని ఉదయం, సాయంత్రం ఎక్కువ సమయం కేటాయించుకొని పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని, అసైన్మెంట్ ల్యాండ్ లను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నిర్ణయం తీసుకోవాలని, ప్రతిరోజు సంబంధిత తాసిల్దార్లు ఆరోజు జరిగిన దరఖాస్తుల వివరాలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. తదుపరి జిల్లా కలెక్టర్ ఫుడ్ కమిషన్ చైర్మన్, మెంబర్లు గురువారం సూర్యాపేట జిల్లా సందర్శించిన సందర్భంగా అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి సంక్షేమ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గుడ్ కమిషన్ జిల్లా సందర్శన సందర్భంగా సంక్షేమ అధికారులు వారితో కలిసి సంక్షేమ హాస్టల్స్ ను, రెసిడెన్షియల్ హాస్టల్స్ ను సందర్శించి ఫుడ్ మెనూ వివరాలను వారికి వివరించాలని, అలాగే సాయంత్రం జరిగే ఫుడ్ కమిషన్ సమావేశానికి అన్ని ఏర్పాట్లు చేయాలని, సంక్షేమ హాస్టల్స్ వార్డెన్లను, ఎంఈఓ లను, ఐసిడిఎస్ సూపర్వైజర్ లను ఇట్టి సమావేశ మునకు హాజరు అయ్యేటట్లు చూడాలని సంక్షేమ అధికారులకు తెలిపారు.ఈ సమావేశంలో డిఇఓ అశోక్, డిఆర్ డి ఏ పి డి వి. వి.అప్పారావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మరియు స్త్రీ, శిశు సంక్షేమ వయోవృద్ధుల శాఖ ఇన్చార్జ్ అధికారి దయానంద్ రాణి, ఎస్టీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ నాయక్, గిరిజన సంక్షేమ శాఖ అధికారి శంకర్ నాయక్, పాల్గొన్నారు.

# సాంబశివుడు 58వ జయంతి



**తిరుమలగిరి, ఆగస్టు 6 మనం న్యూస్ :** కోనపురి సాంబశివుడు,రాములన్న అభిమాన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారి పరమేష్ ఆధ్వర్యంలో తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని పూలే,అంబేద్కర్ చౌరస్తాలో సాంబశివుడు 58వ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంబశివుడు,రాములన్న జయంతి,వర్ధంతి కార్యక్రమాలు ప్రభుత్వమే నిర్వహించాలని, అదేవిధంగా వారి యొక్క జీవిత చరిత్రలను పాఠ్యాపుస్తకాలలో చేర్చాలని,ట్యాంక్ బండ్ పై వారి యొక్క విగ్రహాలని పెట్టాలని డిమాండ్ చేసారు. భవిష్యత్తులో తిరుమలగిరి మండల కేంద్రంలో సాంబశివుడి విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి మండల మాజీ ఎంపీపీ లు కొత్తగట్టు మల్లయ్య, కొమ్మినేని సతీష్ కుమార్,యాదవ సంఘం పట్టణ అధ్యక్షులు హనుమంతు యాదవ్, దయా యాదవ్,తిరుమలగిరి వ్యవసాయ మార్కెట్ డైరెక్ట్ ఉప్పలయ్య,మాజీ డైరెక్టర్ వేల్పుల లింగయ్య, మాజీ కౌన్సిలర్ రామ్ గౌడ్,పయ్యంలా వెంకన్న, చిలుకల లింగయ్య,నర్సయ్య,కడెం మల్లయ్య, బేతు లింగన్న,కిరణ్, రెగుల మహేందర్ ముదిరాజ్, వల్లపు శోభన్ బాబు,తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కాంగ్రెస్ వర్గాల మధ్య తోపులాట

- పరస్పర విమర్శలతో సభలో కొద్దిసేపు రసాభాస
- జై జగదీష్.. జై దామన్న అంటూ ఇరుపార్టీ కార్యకర్తల నినాదాలు
- ఎవరికి వారే తమ ప్రభుత్వ హయాంలో జరిగిన సంక్షేమ అభివృద్ధి పై సవాళ్లు





**ఆత్మకూరు (ఎస్) ఆగస్టు 06 మనం న్యూస్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్ల రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియలో భాగంగా కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్.. పంపిన సభలో కొద్దిసేపు ఇరువర్గాల కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది.. బుధవారం మండల పరిధిలోని నెమ్మికల్ గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ కాపీలు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి , సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి, సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పా ల్గొన్నారు...మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు జగదీశ్ రెడ్డి మాట్లాడే క్రమంలో జై జగదీశ్ రెడ్డి అంటూ బీఆర్ఎస్ కార్యకర్తలు నినాదాలు చేశారు... పోటీగా జై దామన్న అంటూ కాంగ్రెస్ కార్యకర్తలు నినాదాలు చేశారు. కేసీఆర్ ని పొగుడుతూ బీఆర్ఎస్ పార్టీ హయంలోనే ఆత్మకూరు ఎస్ మండలం అభివృద్ధి చెందిందని,నీళ్లు తీసుకువచ్చామని అంటూ కేసీఆర్ పథకాలపై జగదీష్ రెడ్డి తమ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి సంక్షేమపై వివరించే క్రమంలో... అదే సమయంలో సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వేణారెడ్డి అభ్యంతరం తెలుపుతూ, బీఆర్ఎస్ పార్టీ హయాంలో ఆత్మకూర్ (ఎస్) మండలంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా ఇవ్వలేదని, కాళేశ్వరం ప్రాజెక్టు కాస్త కూలేశ్వరం అయిందని అంటూ విమర్శలకు దిగారు... దీంతో జై దామన్న, జై జగదీష్ అన్న అంటూ ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీగా నినాదాలు చేయడంతో సభలో కొద్దిసేపు ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో అక్కడే ఉన్న పోలీసులు రంగంలోకి దిగడంతో ఇరు పార్టీల కార్యకర్తల తోపులాట పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు...మరొక్క సారి ఇరు పార్టీల నాయకులు మాట్లాడే ప్రయత్నం చేయగా ఇది ప్రభుత్వ అధికారిక కార్యక్రమం అని అధికారులు మైకులు కట్ చేశారు... అనంతరం లబ్ధిదారులకు ప్రొసిడింగ్ కాపీలు అందజేశారు. దీంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు



**సూర్యాపేట ఆగస్టు 06 (మనం ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్తగా, రాష్ట్ర ఏర్పాటుకు నాయకత్వం వహించి ప్రజలను, నాయకులను ఏకతాటిపైకి తీసుకువచ్చి మన నీళ్లు, నిధులు,నియామకాలు మనకే కావాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ ఎంతో కీలక పాత్ర పోషించారని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాల సందర్భంగా బుధవారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పాల్గొని ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారత దేశానికి 1947 లో స్వతంత్రం వచ్చినప్పటికి తెలంగాణ నిజాం పాలనలో ఉందని తదుపరి అన్యాయాలను ఎదిరించేందుకు పోరాటాల ద్వారా, సాహిత్యం ద్వారా ప్రజలకి వారి హక్కులు తెలిసేలా చేశారని, మన ప్రాంతానికి చెందిన వారికే ఉద్యోగాలు వస్తే ప్రాంతంతో పాటు, దేశం అభివృద్ధి చెందుతుందని భావించి ఉద్యోగాల కోసం ప్రజల తరుపున ఎంతగానోపోరాడారని, వారిని స్ఫూర్తి గా తీసుకొని ప్రతి ఉద్యోగి బాధ్యతగా భావించి ప్రజలకు సేవ చేయాలని జిల్లాలో అభివృద్ధి పనులు,విద్య, వైద్యం, వ్యవసాయం, సంక్షేమ శాఖల ద్వారా ప్రజలలో చైతన్యం తీసుకొనిరావాలని అన్నారు. ఉద్యోగులు అర్హత ఉన్నవారికి సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రతి ఒక్కరూ సమిష్టి భాధ్యతగా భావించి కృషి చేయాలని, వెనుకబడిన వారిని అభివృద్ధి చేసి సమాజంలో స్థిర మార్పు తీసుకొచ్చేందుకు ఉద్యోగులందరూ ఒక బృందంగా ఏర్పడి సూర్యాపేట జిల్లాని రాష్ట్రంతో పాటు, దేశంలోనే ముందంజలో ఉంచాలని అన్నారు.అదనపు కలెక్టర్ పి. రాంబాబు మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ అత్యంత పురాతనమైన బెనారస్ యూనివర్సిటీలో చదువుకొని కాకతీయ యూనివర్సిటీకి వైస్ ఛాన్స్ లర్ గా పని చేశారని అన్నారు.1952 , 1969 అలాగే మలి తెలంగాణ ఉద్యమంలో ఎంతో కీలక పాత్ర పోషించారని, తెలంగాణ ప్రాంతానికి చెందిన నీళ్లు, నిధులు,నియమకాల కోసం ప్రజలందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో వారి కృషిని తెలంగాణ ప్రజలు మరవద్దని ఆ మహనీయుని జయంతి సందర్భంగా స్మరించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వి.వి. అప్పారావు, డిటిడిఓ శంకర్,పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, సూపరింటిండెంట్లు సాయి గౌడ్, సంతోష్ కిరణ్,శ్రీలత రెడ్డి అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అనాథ ఆడపిల్లలకు కలెక్టర్ ఆర్థిక చేయూత





- అయ్యో అమ్మానాన్నల మృతితో అనాధలైన ఆడబిడ్డలు

**తుంగతుర్తి: ఆగస్టు 6 ,( మనం న్యూస్ ):** మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన తడకమళ్ళ రాములమ్మ క్యాన్సర్ తో బాధపడుతూ మూడు సంవత్సరాల క్రితం మృతి చెందగా ఇటీవల భర్త తడకమళ్ళ వెంకన్న అనారోగ్యంతో ఇటీవల కన్నుమూశారు. వారి ఇద్దరు ఆడపిల్లలు అనాథలుగా మారారని వివిధ పత్రికల్లో వచ్చిన కథనాలకు స్పందించి బుధవారం కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆడబిడ్డలకు రూ.10వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు తహశీల్దార్ దయానందం, ఎంపీడీవో శేషు కుమార్, సీడీపీఓ శ్రీజలు కలిసి ఆడపిల్లలకు రూ.10వేలు తండ్రి దశదినకర్మకు ఆర్థిక సాయం కింద అందించారు. అదేవిధంగా పెద్దకూతురు ఉమా ఉన్నత చదువు కోసం, చిన్న కూతురు శ్రీజను గురుకుల పాఠశాలలో చేర్పించడంతోపాటు ఇల్లు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆడపిల్లలు ఇద్దరు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మడిపెద్ది శ్రీనివాస్, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

# జయశంకర్, గద్దర్‌ల స్ఫూర్తితో ముందుకెళ్దాం

- అవినీతి రహిత ప్రజాస్వామిక తెలంగాణ నిర్మాణానికి కృషి చేద్దాం
- కాళేశ్వరం అవినీతి ఊబిలో నిండా మునిగిన బీఆర్ఎస్



**సూర్యాపేట ఆగస్టు 06 (మనం ప్రతినిధి)** తెలంగాణ జాతిపిత తెలంగాణ ఉద్యమ సిద్ధాంత రూపశిల్పి ప్రొఫెసర్ జయశంకర్ మరియు ప్రజా యుద్ధ నౌక సామాజిక , ప్రజాస్వామిక తెలంగాణ స్వప్నికుడు గద్దర్ మరియు ప్రజాస్వామిక వాది జహీర్ అలీ ఖాన్ ల స్ఫూర్తితో ప్రజాస్వామ్య తెలంగాణ నిర్మాణం కై కృషి చేద్దామని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యపేట నియోజకవర్గ ఇన్చార్జి ధర్మార్జున్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి గద్దర్ మరియు జహీర్ అలీ ఖాన్ ఈ 98ఈవర్ధంతిని పురస్కరించుకొని బుధవారం పట్టణంలోని తెలంగాణ జన సమితి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ.... తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేవలం భౌతిక సరిహద్దుల కోసం వేరు కాదని రాష్ట్ర సాధన పోరాట నినాదం వెనుక ఎంతో సైదాంతిక భావజాల ఉద్యమ కూర్పు ఉన్నదని ఎంతో నిజాయితీతో తెలంగాణ సమాజం తెలంగాణను సాధించుకున్నదని అన్నారు కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆ లక్ష్యం వైపు అమరుల త్యాగాల ఆకాంక్షల సాధన వైపు అడుగులు వేయకుండా తొలి తెలంగాణ ప్రభుత్వ సారధి కేసీఆర్ అవినీతి బంధుప్రీతి రాజకీయ స్వార్థాలేలక్ష్యంగా పనిచేశాడని విమర్శించారు నీళ్లు నిధుల కొరకు కొట్లాడి తెలంగాణ సాధించుకుంటే ఆ నీళ్ల మాటున కెసిఆర్ నిధుల కైంకర్యానికి పాల్పడ్డారని. ఫలితంగా తెలంగాణ ప్రాజెక్టులు అపహాస్యాన్ని లోనయ్యాయనీ పేర్కొన్నారు. సరైన ప్రణాళికలు రూపొందించకుండా అంచనాలు పెంచి నిర్మించిన ప్రాజెక్టులు విపరీతంగా అవినీతి జరగడం మూలంగానే సరైన శాస్త్రీయ సాంకేతిక పద్ధతిలో నిర్మాణం చేపట్టకపోవడం మూలంగానే నేడు కాలేశ్వరం ప్రాజెక్టు నిరుపయోగంగా మారిందనీ ఈ విషయాన్ని తెలంగాణ జన తెలంగాణ జేఏసీగా తెలంగాణ జన సమితిగా మేము మొదటి నుంచి చెబుతున్నప్పటికీ కెసిఆర్ పెడ చెవిన పెట్టి మమ్ములను అణచివేసే కుట్రలు చేశాడు. నేడు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ ఎంక్వైరీకమిషన్ తన నివేదిక ఇవ్వగానే ఇప్పుడు టిఆర్ఎస్ నాయకులు బొబ్బలు పెడుతున్నారని ఎద్దేవా చేశారు. ఇది కేవలం కమిషన్ ని గ్గ తేల్చిన అంశాలను పక్కతోవ పట్టిొంచడానికి ఆపార్టీ క్యాడర్ ను రక్షణ కవచంగా వాడుకునేొదుకే మాజీ మంత్రులు హరీష్ రావు జగదీశ్వర్ రెడ్డి పవర్ పాయంటు ప్రజెంటేషన్ ల పేరుతో తమ నాయకుని మీద గౌరవ సెంటిమెంట్ ను రెచ్చగొడుతూమరొకసారి కుట్రలు పన్ను తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార దాహంతో ప్రజాస్వామిక రాజకీయాలను అవహేళన చేస్తూ అవినీతి పునాదుల మీద రాజకీయాలు చలామణి చేస్తున్న వారికి ఇప్పటికైనా బుద్ధి చెప్పాల్సిన అవసరం ఉందని ఆ దిశగా జన సమితి పార్టీ ప్రయాణం చేస్తుందని తెలిపారు. ఎస్టీ సెల్ పట్టణ కన్వీనర్ దేవత సతీష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి లీగల్ సెల్ జిల్లా అధ్యక్ష , కార్యదర్శులు కుంచం చంద్రకాంత్, బాషబోయిన వేణు రాజు ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బచ్చల గురు గోపి రైతు జన సమితి జిల్లా ఉపాధ్యక్షుడు పనుకోటి సూర్యనారాయణ ఎస్టీ సెల్ టౌన్ మైనార్టీ సెల్ పట్టణ కన్వీనర్ ర్ ఫరీద్ . ప్రవీణ్,గిరి తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్

- మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



రాయపర్తి ఆగస్టు 6(మనం న్యూస్): అబద్ధపు హామీలతో , ప్రజలనుమోసం చేసికాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విమర్శించారు.బుధవారం మండలంలోని మైలారం గ్రామంలో చెరికల కమిటీ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి సారథ్యంలో ఊకల్ గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ,బీజేపీ నాయకులు నాగపూరి రాంబాబు ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు దికొండ దేవేందర్,దికొండ సుధాకర్, దామర శెట్టి ఆగయ్య,బుర్ర రవి,కత్తి వెంకన్న, బండారి రాజు, రామగిరి భాస్కర్, అడ్లూరి రాంబాబు, చిదిరి రాజు, బండపల్లి సిద్దు లు బీజేపీ వీడి మాజి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సమక్షంలో బిఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా వారికి గులాబి కండువాలు కప్పి పార్టీ లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దయాకర్ రావు మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దె నెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను రైతులను అనేక ఇబ్బందులకు గురి చేస్తుందని అన్నారు.కేసీఆర్ పాలనలో రైతులు సంతోషంగా ఉన్నారని,కాంగ్రెస్ పాలనలో రైతులు అరిగోస పడుతున్నారని అన్నారు.కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.బి ఆర్ ఎస్ పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే బాధ్యత మాదని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కేసీఆర్ ను బిఆర్ఎస్ నాయకులను ఇబ్బందులు పెట్టాలని కాంగ్రెస్ నాయకులు చూస్తున్నారని అన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టు తో తెలంగాణ రాష్ట్రం సస్యశ్యామలం అయిందినని అన్నారు.బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఇబ్బంది పెడితే ప్రజలందరూ తిరగబడుతారని హెచ్చరించారు.స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టకుండా బిసి రిజర్వేషన్ల పేరుతో సిఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని అన్నారు.ఓటమి భయంతోనే స్థానిక ఎన్నికలు జరుగకుండా కాలయాపన చేస్తున్నారని అన్నారు.రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెపుతామని అన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహా నాయక్, మాజీ ఎంపీపీ అనిమి రెడ్డి,మాజీ జడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ ఎనగందుల యాకనారాయణ,మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు,ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి,బిల్లా వెంకట్ రెడ్డి, గారే నర్సయ్య,ఐత రాంచందర్, లేతకుల మధుకర్ రెడ్డి, గజవెల్లి ప్రసాద్, కోలా సంపత్,బొడ్డు రంగయ్య, కుందూరు యాదగిరి రెడ్డి, సదా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణి కంపెనీ విస్తరణకు వెంటనే చర్యలు తీసుకోవాలి

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య



స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 6,(మనం న్యూస్): సింగరేణి కంపెనీ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య బుధవారం పార్లమెంట్ లో డిమాండ్ చేశారు. ఈ మేరకు లోక్సభలో సింగరేణి కంపెనీ పై కీలక ప్రశ్నలు అడిగారు. వరంగల్ ప్రాంతానికి సింగరేణి ఇచ్చిన ఉద్యోగాలు, ఎస్సీ అభ్యర్థుల నియామకాలు, మరియు భవిష్యత్తులో సింగరేణి విస్తరణ గురించి వివరాలు తెలియజేయాలంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ఎంపీ ప్రశ్నకు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి సమాధానం ఇచ్చారు. అందులో భాగంగా 2020 నుండి 2025 వరకు వరంగల్లో 1,136 స్థానికులకు ఉద్యోగాలు ఇచ్చినట్లు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సింగరేణి కారణంగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలతో పాటు ఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరగాలన్నారు. సింగరేణి ఉద్యోగ నియామకాల్లో పారదర్శకత ఉండాలని స్పష్టం చేసారు. అలాగే, వరంగల్లో సింగరేణి విస్తరణ జరిగితే యువతకు మరిన్ని ఉద్యోగాలు వస్తాయని, జిల్లా అభివృద్ధి వేగవంతమవుతుందని ఎంపీ అభిప్రాయపడ్డారు. సింగరేణి కంపెనీ విస్తరణకు వెంటనే కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సందర్భంగా కోరారు.

# తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్‌కు నివాళులు అర్పించిన కలెక్టర్



జనగామ, ఆగష్టు 6(మనం ప్రతినిధి: ప్రొఫెసర్ జయశంకర్ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం కలెక్టరెట్ లోని కాన్ఫెరెన్స్ హల్ లో ఆచార్య జయశంకర్ చిత్ర పటానికి పూలమాల వేసి కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అందరికి ఆదర్శప్రాయులు అన్నారు. ఈ కార్యక్రమం లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని,. వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవానికి ఏర్పాట్లు చేయాలె

- జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్



హనుమకొండ, ఆగస్టు 6(మనం ప్రతినిధి): హనుమకొండ: ఆగస్టు 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సిద్ధం చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, మున్సిపల్, జిల్లా గ్రామీణ అభివృద్ధి, వైద్య ఆరోగ్య, విద్యుత్తు, అగ్నిమాపక, తదితర శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఆయా ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ హనుమకొండలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో ఆగస్టు 15వ తేదీన నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవం రోజున వేదిక, బ్యారికేడింగ్, స్టాల్స్ ఏర్పాటు, విద్యుద్దీపాల అలంకరణ, తాగునీటి సౌకర్యం, గ్యాలరీ, సాంస్కృతిక కార్యక్రమాలు, తదితర ఏర్పాట్లన్నీ 14వ తేదీ నాటికి పూర్తి చేయాలన్నారు. వివిధ డిపార్ట్మెంట్ల వారిగా ఆయా శాఖలకు సంబంధించిన అంశాలతో రూపొందించిన స్టాల్స్ ను ఆకట్టుకునేలా ఏర్పాటు చేయాలన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లను సిద్ధం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవానికి సంబంధించిన ఏర్పాట్లను గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై వి గణేష్, డిఆర్డిఓ మేన శ్రీను, సిపివో సత్యనారాయణ రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైల్వే మంత్రిని కలిసిన ఎమ్మెల్యేలు, ఎంపీ



హనుమకొండ, ఆగస్టు 6 (మనంప్రతినిధి): న్యూ ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య ,ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కే ఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ రావు,శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య తో మర్యాదపూర్వకంగా కలిసిన వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిఈ సందర్భంగా కేంద్ర మంత్రి ని రైల్వే డివిజన్ ఏర్పాటు,కాజీపేట రైల్వే స్టేషన్ ఆవరణలో నూతన బస్ స్టేషన్ నిర్మాణం కోసం కేటాయించాల్సిన స్థలం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద కాజీపేట రైల్వే జంక్షన్ అభివృద్ధి చేయాలని కోరారు. కాజీపేట బస్ స్టేషన్ ఏర్పాటు ఆవశ్యకత గురించి మంత్రి కి వివరించారు.ఇప్పటికే క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించారని ప్రజా రవాణా దృష్ట్యా బస్ స్టాండ్ నిర్మాణం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

# జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



- మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమండ్ల తిరుపతిరెడ్డి

తొర్రూరు ఆగస్టు 6 (మనం న్యూస్): తెలంగాణ ఆత్మగౌరవానికి పునాది వేసిన మహానేత, ఆచార్య కొత్తపల్లి జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమండ్ల తిరుపతి రెడ్డి అన్నారు. ఆచార్య జయశంకర్ జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల కేంద్రంలో బుధవారం ఆయన విగ్రహానికి కాంగ్రెస్ నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో బలపరిచిన జయశంకర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు..ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్ రావు, రామ సహాయం కిషోర్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుంచు సంతోష్, అనుమాండ్ల నరేందర్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు మెరుగు మల్లేశం గౌడ్, బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై జయశంకర్ సేవలను స్మరించుకున్నారు.తెలంగాణ సాధనకు ఆయన చూపిన మార్గమే మాకు ప్రేరణ అని నాయకులు వ్యాఖ్యానించారు.

# ప్రతి నెల అర్హులందరికీ పెన్షన్ అందే విధంగా చూడాలి




- జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్

ములుగు, ఆగస్టు6 (మనం ప్రతినిధి): ప్రతి నెల అర్హులందరికీ పెన్షన్ అందే విధంగా సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. సూచించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పెన్షన్ అమలుపై ఎంపీడీవోలకు , మున్సిపల్ కమిషనర్, పంచాయతీ కార్యదర్శు లకు, బిల్లు కలెక్టర్లు మరియు పోస్టల్ డిపార్ట్మెంటకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్. ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ పెన్షన్ కు అర్హత ఉన్న వారందరినీ ప్రతి నెల పెన్షన్ ఇప్పించే విధంగా కృషి చేయాలని అనహరులను గుర్తించి పెన్షన్ నుండి తొలగించాలని అలాగే ముఖచిత్రం ద్వారా పెన్షన్ ఇవ్వడం రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముందుగా టీజీ సెర్ప్ పెన్షన్ డైరెక్టర్ గోపాల్ రావు , అడిషనల్ కలెక్టర్ లోకల్ బాడీ ఎం సంపత్ రావు చేయూత పెన్షన్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి డిపిఓ దేవ్ రాజ్, అదనపు డి ఆర్ డి ఓ గొట్టే శ్రీనివాస్, ములుగు మున్సిపాల్ కమీషనర్ సంపత్, టీజీ ఆన్లైన్ ప్రతినిధి రాజు, జిల్లాలోని ఎంపీడీవోలు, సెర్ప్ డిపిఎంలు, ఏ పి ఎం లు, సి సీలు, పంచాయతీ కార్యదర్శులు హాజరైనారు.

# నైపుణ్యం ఉన్న యువతకు ఏ.టి.సి. కోర్సులతో ఉపాధి భరోసా

- జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- ఖమ్మం ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థలో ఏటిసి కేంద్రం ఏర్పాటు
- నూతనంగా ఏటీసీ 6 కోర్సులలో యువతకు శిక్షణ
- అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను తనిఖీ చేసిన కలెక్టర్



ఖమ్మం, ఆగస్టు 06(మనం బ్యూరో): యువతకు ఏ.టి.సి. కోర్సులతో ఉపాధి ఉద్యోగాలకు భరోసా లభిస్తుందని, జిల్లాలోని నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఖమ్మం టేకులపల్లిలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థను అప్ గ్రేడ్ చేసిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏటీసీ నూతన భవనంలో ఏర్పాటు చేస్తున్న అత్యాధికమైన మిషనరీలను పరిశీలించారు. పరికరాల పనితీరును ట్రైనర్స్, అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు, యువతకు కావలసిన సౌకర్యాలపై కలెక్టర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ఐటీఐలు ఇప్పుడు కొత్త సాంకేతికత తో అత్యాధునిక వసతులు, ల్యాబ్లు, టాటా టెక్నాలజీస్ సహకారంతో యువతకు నైపుణ్యంతో కూడిన శిక్షణను అందించనున్నట్టు తెలిపారు. పలు రకాల మెషనరీపై రియల్ టైం ప్రాక్టికల్ ట్రైనింగ్, ఇంతకుముందు ఎప్పుడూ లేనటువంటి అత్యాధునిక పరికరాలతో శిక్షణ ఉంటుందన్నారు. మారుతున్న కాలంలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు నిష్ణాతులైన ట్రైనర్ల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తామని, మెషనరీపై పని చేస్తూనే పని నేర్చుకునేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. ఉద్యోగాలకు లేదా సొంత వ్యాపారం చేసుకోవడానికి వీలుగా రూపొందించిన పలు కోర్సులు, ఇండస్ట్రీ అవసరాలకు తగిన విధంగా డిజైన్ చేసిన పూర్తిస్థాయి శిక్షణ అందిస్తామని వివరించారు. 10వ తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు ఏ.టి.సీ. కోర్సులు పొందేందుకు అర్హులని అన్నారు. ఈ కోర్సులతో మల్టి నేషనల్ కంపెనీలలో ఉద్యోగావకాశాలు లభిస్తాయని అన్నారు. ప్రస్తుతం మార్కెట్ డిమాండ్ ప్రకారం టాటా కన్సల్టెంట్స్ వారితో సమన్వయం చేసుకొని ఈ కోర్సులను డిజైన్ చేశామని అన్నారు. జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని వినియోగించుకొని కోర్సులలో జాయిన్ కావాలని కలెక్టర్ కోరారు. నూతనంగా ఏటీసీ కోర్సులకు సంబంధించి ప్రాక్టికల్స్ నిర్వహణకు అవసరమైన పరికరాలను నూతనంగా నిర్మించిన భవనంలో అమర్చడం వలన విద్యార్థులకు మరింత నాణ్యమైన బోధన అందుతుందని అన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, శిక్షకులు, అధికారులు, తదితరులు ఉన్నారు.

# పలిమేల మండలంలో కలెక్టర్ ఆకస్మిక పర్యటన

- త్వరిత గతిన పి హెచ్ సి భవనం పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



మహాదేవపూర్ ఆగస్ట్ 6,( మనం న్యూస్ ): మారుమూల పలిమేల మండలంలో భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆకస్మికంగా పర్యటించారు.పలిమేల మండలం పంకెన కస్తూరి భా గాంధీ పాఠశాలతో పాటునూతనం గా నిర్మిస్తున్న పి హెచ్ సి ఆసుపత్రి భవనాన్ని కలెక్టర్ పరిశీంచారు. కస్తూరీ భా పాఠశాల లో సమస్యలపై అరా తీశారు. విద్యార్థినిలకు అందిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. వారికి అందిస్తున్న భోజన నాణ్యత లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ హెచ్చరించారు. పంకెనలో కేజీబీవీ పాఠశాలలో ఆరవ తరగతి విద్యార్థులతో పాఠాలు చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, వంటగది,సైన్స్ ల్యాబ్ లను పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసి భోజనంలో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని నాణ్యత లోపించకుండా చూసుకోవాలని ఏదైనా నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని అవసరమైతే సస్పెన్షన్ చేసేందుకు కూడా వెనకాడ బోమని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి వారిలో ఉన్న ఆసక్తిని గమనించి ప్రోత్సహిస్తే అద్భుత ఫలితాలు వస్తాయని సూచించారు. పాఠశాలలో భోజనం సముదాయం కోసం టేబుళ్ళు కావాలని కోరగా అలాగే అదనపు మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు.అనంతరం మండల కేంద్రంలో నూతనంగా నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సమీకృత కార్యాలయ భవన నిర్మాణ పనులు ఎమ్మార్వో భవనాలను పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోడ్డు ప్రహరి గోడ నిర్మాణానికి నిధులు విడుదల చేస్తామని, ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్ నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఆదేశించారు. నర్సరీలో వెదురు మొక్కల పెంపకం తీరు ను పరిశీలించి ఈ ప్రాంతం వెదురు మొక్కల పెంపకానికి అనుకూలం కావడంతో వెదురు మొక్కలు పెంపకానికి చర్యలు తీసుకోవాలని అటవీశాఖ అధికారులకు సూచిం చారు. మండలంలోని మోడేడులో దట్టమైన అడవిలో పర్యటించి అటవీశాఖ వాచ్ టవర్ అడవుల సంరక్షణ పెంపకానికి తీసుకుంటున్న చర్యలను చూసి వాచ్ టవర్ ప్రాంతంలో మొక్కలు నాటారు పర్యావరణ పరిరక్షణకు కాలీగా ఉన్న అటవీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిఎఫ్ఓ నవీన్ రెడ్డి, తహసిల్దార్ అనిల్, ఎంపీడీవో ప్రకాష్ రెడ్డి తో పాటు పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమహిళా శక్తి ఎందరో మహిళలకు స్వయం ప్రతిపత్తి

- ఆర్థిక భరోసా కల్పిస్తున్న వనిత టీ స్టాల్
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



జనగామ, ఆగష్టు 6(మనం ప్రతినిధి): కోటి మంది మహిళామణులను కోటీశ్వరులగా తీర్చిదిద్దాలనే మహోన్నత లక్ష్యంతో ఇందిరా మహిళాశక్తి పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. కలెక్టరెట్ ముందు కళ్యాణి స్వయం సహాయక సంఘానికి చెందిన మంజుల అనే మహిళ 2 లక్షల ఋణం తో ఏర్పాటు చేసిన వనిత టీ స్టాల్ ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయం గా స్టవ్ వెలిగించి పాలు పెట్టి వ్యాపారం బాగా జరగాలని కోరారు. అనంతరం డి ఆర్ డి ఏ పీడీ, ఎల్. డి.ఎం, మున్సిపల్ కమిషనర్, బ్యాంక్ అధికారులతో కలిసి కలెక్టర్ టీ తాగి రుచికరంగా ఉందని చాలా బాగుందని మహిళా సంఘ సభ్యురాలు మంజుల ను కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరా మహిళాశక్తి పథకంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నారన్నారు.ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా ఎందరో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతుందని మహిళలను విజయవంతమైన వ్యవస్థాపకులుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఏ ఒక్క మహిళ ఎవరిపైన ఆధారపడకుండా మహిళామణుల స్వయం ఉపాధికి ప్రభుత్వం అండగా నిలబడుతుందన్నారు. ఇప్పటి వరకు ఏర్పాటుచేసిన వనిత టీ స్టాల్ ద్వారా దాదాపు రోజు మూడు వేల రూపాయల ఆదాయాన్ని మహిళలు పొందుతున్నారన్నారు.వవిత టీ స్టాల్ లో కేవలం టి అమ్మకం ఒక్కటే కాదని డిమాండ్ కు తగ్గట్టుగా చేతి ఉత్పత్తుల అమ్మకం, భోజనం, ప్రజలకు అవసరమైన వస్తువుల అమ్మకాలు కూడా ఉంటాయన్నారు ఈ కార్యక్రమం లో ఏ. పి. డి, డీపీఎం, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

# చరిత్ర సృష్టించిన రషీద్ ఖాన్.. టీ20ల్లో తొలి బౌలర్‌గా రికార్డు

అఫ్ఘానిస్థాన్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టీ20 క్రికెట్ లో అద్భుతమైన రికార్డు సాధించాడు. పొట్టి ఫార్మాట్ క్రికెట్ లో 650 వికెట్లు తీసిన తొలి బౌలర్ గా రికార్డులకెక్కాడు. ఇంగ్లాండ్ వేదికగా జరుగుతున్న ది హండ్రెడ్ లీగ్ ఆరంభ మ్యాచ్ లో ఈ ఘనతను సాధించాడు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ కు ప్రాతినిధ్యం వహిస్తున్న రషీద్ ఖాన్ లండన్ స్పిరిట్ తో జరిగిన లీగ్ ఆరంభ పోరులో విజృంభించాడు. 20 బంతుల్లో (3/11) అదరగొట్టాడు. 15 డాట్ బాల్స్ చేసిన రషీద్ వేన్ మాడ్సెన్, లియామ్ డాసన్, ర్యాన్ హిగ్గిన్స్ ను ఔట్ చేశాడు. ఈ ప్రదర్శనతో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు. ఇక, మ్యాచ్ విషయానికొస్తే తొలుత బ్యాటింగ్ చేసిన లండన్ స్పిరిట్ జట్టు 94 బంతుల్లో 84 పరుగులే చేసి ఆలౌటైంది. ఆ జట్టుకు ఆడుతున్న స్టార్ బ్యాటర్లు డేవిడ్ వార్నర్ (9), కేన్ విలియమ్సన్ (9) విఫలమయ్యారు. ఓవల్ ఇన్విన్సిబుల్స్ 4 వికెట్లు కోల్పోయి 31 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది.



**టీ20 క్రికెట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్లు**

రషీద్ ఖాన్ 651 (478 ఇన్నింగ్స్‌లు)
డ్వేన్ బ్రావో 631 (546 ఇన్నింగ్స్‌లు)
సునీల్ నరైన్ 589 (544 ఇన్నింగ్స్‌లు)
ఇమ్రాన్ తహీర్ 547 (417 ఇన్నింగ్స్‌లు)
షకీబ్ అల్ హసన్ 498 (443 ఇన్నింగ్స్‌లు)
ఆండ్రీ రస్సెల్ 485 (497 ఇన్నింగ్స్‌లు)
క్రిస్ జోర్డాన్ 436 (404 ఇన్నింగ్స్‌లు)
వహాబ్ రియాజ్ 413 (344 ఇన్నింగ్స్‌లు)

# టీమిండియా నేర్చుకోవాల్సిన పాఠాలు!

అనుభవం లేని ఆటగాళ్లతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన టీమ్‌ఇండియా ఐదు టెస్టుల సిరీస్ ను 2-2తో ముగించింది. సీనియర్లు లేకుండా, కొత్త సారథి నాయకత్వంలో టీమ్‌ఇండియా ఈ స్థాయి ప్రదర్శన చేయడం గొప్ప విషయమే. అయితే, ఈ టూర్ ద్వారా భారత జట్టు కొన్ని పాఠాలను నేర్చుకోవాల్సిన అవసరముంది. అవేంటంటే?

**ఓపెనర్లు ఓకే.. ఇద్దరూ కలిస్తేనే..**

ఇంగ్లాండ్ సిరీస్ లో మన ఓపెనర్లు రాణించారు కానీ.. కలిసికట్టుగా కాదు. కేఎల్ రాహుల్ (534), యశస్వి జైస్వాల్ (411) వ్యక్తిగతంగా మంచి ప్రదర్శనే చేశారు. కానీ, ఒకరు బాగా ఆడితే మరొకరు తొందరగా పెవిలియన్ చేరారు. ఐదు మ్యాచ్ ల్లో ఒక్కసారి కూడా తొలి వికెట్ కు 100కుపైగా భాగస్వామ్యం నమోదు కాలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. 6 ఇన్నింగ్స్ ల్లో జట్టు స్కోరు 20 కూడా దాటకముందే భారత్ తొలి వికెట్ కోల్పోయింది. ఓపెనర్ల వ్యక్తిగత ప్రదర్శన కంటే భారీ భాగస్వామ్యాలు చేయాలి. దీనిపై జట్టు మేనేజ్ మెంట్ దృష్టి సారించాలి.

సిరీస్ లో వన్‘డౌన్’ ఇబ్బంది ఐదు టెస్టుల్లోనూ కొనసాగింది. మూడో స్థానంలో వచ్చిన సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ ఒక్కసారి కూడా భారీ ఇన్నింగ్స్ ఆడింది లేదు. మూడు మ్యాచ్ ల్లో వన్ డౌన్ లో వచ్చిన సుదర్శన్ స్కోర్లు 0, 30, 61, 0, 38, 11. కరుణ్ నాయర్ రెండు మ్యాచ్ ల్లో ఆ స్థానంలో వచ్చి చేసిన అత్యధిక స్కోరు 40. వీరు కుదురుకోరనిపిస్తే.. వేరే ఆటగాళ్లను ప్రయత్నించే ఆలోచన చేయాలి. లేదంటే దేశవాళీలో టాప్ ఆర్డర్ లో బాగా ఆడిన అనుభవం ఉన్న రుతురాజ్ గైక్వాడ్, దేవ్ దత్ పడిక్కల్, అభిమన్యు ఈశ్వరన్, నారాయణ్ జగదీశన్ లాంటి ఆటగాళ్లను పరిశీలించొచ్చు.

**మరో అగ్రెసివ్ వెపన్?**

టెస్టుల్లో రిషబ్ పంత్ ఆట గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పరిస్థితులెలా ఉన్నా ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతాడు. ముఖ్యంగా విదేశీ గడ్డపై టెస్టులంటే పూనకం వచ్చేస్తుంది. ఈసారి ఇంగ్లాండ్ పర్యటనలోనూ పంత్ అదే జోరు కొనసాగించాడు. తొలి టెస్టులో రెండు సెంచరీలు బాదేసిన అతను తర్వాత ఆడిన మూడు టెస్టుల్లోనూ రాణించాడు. ఆఖరి రెండు టెస్టుల్లో మాత్రం ఆ జోరు మిస్సయ్యాం. నాలుగో టెస్టు ఆడినా గాయం కారణంగా అగ్రెసివ్ పంత్ ను చూడలేకపోయాం. ఇలాంటి అగ్రెసివ్ బ్యాటర్ జట్టులో మరొకరు ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, అభిషేక్ శర్మ వంటి దూకుడు ఉన్న యువ ఆటగాళ్లను ట్రై చేయొచ్చు. లేదంటే ఇప్పుడు రిజర్వ్ కీపర్ గా ఉన్న ధ్రువ్ జురెల్ ఆ బాధ్యత తీసుకునేలా చేయాలి.



**ఆ ఒక్కడేనా? ఇంకా లేరా?**

టీమ్‌ఇండియా పేస్ ఆల్ రౌండర్ల సమస్యను ఎప్పట్నుంచో ఎదుర్కొంటోంది. గత బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో రాణించిన పేస్ ఆల్ రౌండర్ నితీశ్ రెడ్డి.. ఇంగ్లాండ్ పర్యటనలో రాణిస్తాడు అనుకుంటే గాయం కారణంగా మధ్యలోనే దూరమయ్యాడు. నితీశ్ జట్టుకు దూరమైనప్పుడు భారత్ కు పేస్ ఆల్ రౌండర్ ప్రత్యామ్నాయం కనిపించలేదంటేనే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. కొంతమంది ఆటగాళ్లు దేశవాళీలో మెరుస్తున్నా.. జాతీయ జట్టు తలుపు తట్టలేకపోతున్నారు. ఈ క్రమంలో జట్టు యాజమాన్యం, బీసీసీఐ గట్టి ప్రయత్నాలే చేయాల్సి ఉంది. శార్దూల్ ఠాకూర్ రూపంలో ఓ పేస్ ఆల్ రౌండర్ ఉన్నా.. అంతర్జాతీయ స్థాయిలో తేలిపోతున్నాడు. ఈ క్రమంలో ‘నైట్ వాచ్ మ్యాన్’ ఆకాశ్ దీప్, హర్షిత్ రాణా పేర్లు చర్చకు వస్తున్నాయి.



**మూడో పేసర్ ఎవరు?**

టీమ్‌ఇండియాకు బుమ్రా, షమి, సిరాజ్ రూపంలో ముగ్గురు ప్రధాన పేసర్లున్నారు. అయితే, ఈ మధ్యకాలంలో ఈ ముగ్గురూ కలిసి ఆడిన సందర్భాలు తక్కువ. బుమ్రా, షమిలో ఎవరో ఒకరు గాయపడి జట్టుకు దూరమవుతున్నారు. ఈ క్రమంలో ఇంగ్లాండ్ పర్యటనలో షమి లేకపోవడంతో భారత్ కు మూడో పేసర్ కష్టం కొనసాగింది. ఆ స్థానంలో వచ్చిన ప్రసిద్ధ్, ఆకాశ్ దీప్ కొన్ని వికెట్లు తీసినా.. పరుగులు ఎక్కువగా ఇచ్చేశారు. ఈ నేపథ్యంలో మూడో పేసర్ స్థానంలో బలమైన బౌలర్ కావాలి. అప్పుడు మిగిలిన ప్రధాన పేసర్లపై పనిభారమూ తగ్గుతుంది. దీనికోసం ఆకాశ్ దీప్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా, అర్ష్ దీప్ సింగ్, ముకేశ్ కుమార్ లాంటివాళ్లపై ఫోకస్ పెట్టాలి.

# సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై స్పందించను: చిరంజీవి

సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్ పై తాను మాట్లాడకపోయినా తాను చేసిన మంచి మాట్లాడుతుందని అగ్ర కథానాయకుడు చిరంజీవి అన్నారు. ఫీనిక్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో ఏర్పాటుచేసిన బ్లడ్ డొనేషన్ డ్రైవ్ కు చిరంజీవి, తేజా సజ్జా ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రక్తదానం గొప్పతనాన్ని వివరించారు. ఒక జర్నలిస్ట్ మూలంగా తనకు బ్లడ్ బ్యాంక్ పెట్టాలనే ఆలోచన వచ్చిందని ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని అన్నారు. ఆయన రాసిన ఆర్టికల్ చదివిన తర్వాతే తనకు ఈ ఆలోచన వచ్చిందన్నారు. ఆయనను ఇప్పటివరకూ చూడలేదు కానీ, ఎప్పుడూ గుర్తుచేసుకుంటూనే ఉంటానని అన్నారు.

‘‘ఈ అద్భుతమైన కార్యక్రమానికి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు. బ్లడ్ డొనేట్ చేసిన వారందరికీ ధన్యవాదాలు. ముఖ్యంగా నా బిడ్డ లాంటి తేజ సజ్జాకు కూడా థాంక్యూ. రక్తదానం అనే పేరు చెప్పగానే నేను గుర్తొస్తున్నానంటే అది నా పూర్వజన్మ పుణ్యం. ఈ సందర్భంగా మీతో ఒక విషయం పంచుకోవాలని అనుకుంటున్నాను. నేను కొన్ని రోజులుగా రాజకీయాలకు పూర్తిగా దూరంగా ఉంటున్నాను. ఈ మధ్య ఓ నాయకుడు నన్ను అకారణంగా మాటలు అన్నారు. ఆ తర్వాత ఆయన ఓ ప్రాంతానికి వెళ్తే.. అక్కడ ఓ మహిళ ఆయనకు ఎదురుతిరిగింది. ‘చిరంజీవిని అన్నన్ని మాటలు అనాలని మీకు ఎందుకు అనిపించింది’ అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది. ఆ వీడియో చూసి ఆమె గురించి వివరాలు కనుక్కొన్నాను. ఒకప్పుడు చిరంజీవి బ్లడ్ బ్యాంక్ ద్వారా ఆమె బిడ్డ ప్రాణాలు నిలిచాయని అందుకే నేనంటే ఆమెకు గౌరవమని తెలిపింది. ఆ మాటలు విని నా హృదయం ఉప్పొంగింది’’.

‘‘సోషల్ మీడియాలో వచ్చే విమర్శలపై ఎందుకు స్పందించరు అని అందరూ అడుగుతారు. నేనెప్పుడూ స్పందించను. ఎందుకంటే నేను చేసిన మంచి కార్యక్రమాలు, నాపై అభిమానుల ప్రేమే నాకు రక్షణ కవచాలు. నేను మాట్లాడాల్సిన అవసరం లేదు. నా మంచితనమే మాట్లాడుతుంది. ఇది సత్యం. ఆ మహిళ మాట్లాడిన తర్వాత సదరు రాజకీయ నాయకుడు ఎక్కడా నా గురించి తప్పుగా మాట్లాడలేదు. వాళ్లకు కూడా మనసు ఉంటుంది కదా. ఆ క్షణంలో కోపంలో నన్ను తిట్టినా.. ఇంటికి వెళ్లాక వాళ్ల భార్య అయినా మరోసారి ఇలా మాట్లాడొద్దు అని చెబుతుంది’’ అని చెప్పారు.

‘‘మనం మాట్లాడాల్సిన అవసరం లేదు. మనల్ని ఎవరైనా మాటలు అంటే మన మంచే సమాధానం చెబుతుంది. అందుకే నేను ఎప్పుడూ దేనికీ స్పందించను. అంత అవసరం కూడా నాకు లేదు. మంచి చేసుకుంటూ వెళ్తాను. నాలాగా మంచి చేసే నా తమ్ముళ్లకు సాయంగా ఉంటాను. ఇతర దేశాల్లో ఉన్న అభిమానులు కూడా నా మాటను స్ఫూర్తిగా తీసుకొని రక్తదానం చేస్తున్నారు. నా పేరును మరింత ముందుకు తీసుకువెళ్తున్నారు. వాళ్లందరికీ అభినందనలు’’ అని చిరంజీవి తెలిపారు.



**చిరు - అనీల్ ప్రాజెక్ట్ టైటిల్ గ్లింప్స్ వచ్చేస్తుంది!?**

మన టాలీవుడ్ లెజెండరీ హీరో మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు అనీల్ రావిపూడితో చేస్తున్న సాలిడ్ ఎంటర్టైనర్ కూడా ఒకటి. మెగాస్టార్ కెరీర్ 157వ సినిమాగా ప్లాన్ చేసిన ఈ ప్రాజెక్ట్ పై మంచి బజ్ ఉంది. ఇక అనీల్ ఆల్రెడీ తన మార్క్ ప్రమోషన్స్ ని కూడా చేస్తుండగా ఈ సినిమా తాలూకా టైటిల్ గ్లింప్స్ ఇంకా ఫస్ట్ లుక్ పై లేటెస్ట్ అప్డేట్ తెలుస్తుంది.

దీని ప్రకారం మెగాస్టార్ సినిమా టైటిల్ అండ్ ఫస్ట్ లుక్ లు ఈ ఆగస్టు 22న చిరంజీవి పుట్టినరోజు కానుకగా అందిస్తున్నట్టుగా ఇప్పుడు తెలుస్తుంది. మెగా అభిమానులకి బాగా కనెక్ట్ అయ్యే సూపర్ టైటిల్ ని అనీల్ లాక్ చేశారట. మరి అదేంటి అనేది తెలియాలి అంటే ఈ 22 వరకు ఆగాల్సిందే. ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా నయనతార నటిస్తుండగా భీమ్స్ సంగీతం అందిస్తున్నాడు. అలాగే సాహు గారపాటి నిర్మాణం వహిస్తున్నారు.

# లంకా దహనం చేయనున్న సీత..




టాలీవుడ్ స్టార్ బ్యూటీ అనుష్క శెట్టి నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ ‘ఘాటి’ ఎప్పుడో రావాల్సి ఉంది. కానీ ఈ చిత్రం పలు కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. దర్శకుడు క్రిష్ జాగర్లమూడి డైరెక్ట్ చేసిన ఈ క్రైమ్ అండ్ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంలో అనుష్క నెవర్ బిఫోర్ పాత్రలో నటిస్తుంది. పూర్తి వయొలెన్స్ చిత్రంగా ఈ సినిమాను క్రిష్ రూపొందించినట్లు ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, గ్లింప్స్, టీజర్ చూస్తే అర్థమవుతుంది. ఇక తాజాగా ఈ సినిమా నుంచి థియేట్రికల్ ట్రైలర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. టీజర్ లో ఉన్నదానికంటే ఎక్కువ వయొలెన్స్ ఈ ట్రైలర్ లో చూపెట్టారు. దీంతో ఈ సినిమాతో క్రిష్ మనకు ఎలాంటి ట్రీట్ ఇవ్వబోతున్నాడో అర్థమవుతుంది. ఇక గంజాయి సరఫరా చేసే పాత్రలో అనుష్క రస్టిక్ పర్ఫార్మెన్స్ తో ఇరగదీసింది. ఈ ట్రైలర్ లో ఆమె పర్ఫార్మెన్స్ శాంపిల్ మాత్రమే మనకు చూపెట్టారు. కథలో లోతు.. దానికి తగ్గ ఎమోషన్స్.. వాటికి అదనంగా యాక్షన్ కలగలిపి ఈ చిత్రాన్ని ప్రేక్షకులకు అందించనున్నారు.

మొత్తానికి అనుష్క ఫ్యాన్స్ ఎంతోకాలంగా వెయిట్ చేస్తున్న సినిమా ఎట్టకేలకు వారి ముందుకు రాబోతుంది. ఈ సినిమాలో విక్రమ్ ప్రభుతో పాటు పలువురు నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సాగర్ నాగవెల్లి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు. ఇక ఈ సినిమాను సెప్టెంబర్ 5న గ్రాండ్ రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ వెల్లడించారు.

## 64 ఏళ్ల హీరో.. 32 ఏళ్ల హీరోయిన్

# కామెంట్‌పై ఫైర్ అయిన మాళవిక



పాన్ ఇండియా కథానాయకగా పేరు తెచ్చుకున్న నటి మాళవిక మోహన్. ముఖ్యంగా మలయాళం తమిళం తెలుగు భాషల్లో నటిస్తూ బిజీగా ఉన్న ఈమె ఏ తరహా పాత్రలోనైనా ఒదిగిపోయి నటించగల సత్తా కలిగిన నటి. ప్రస్తుతం ఈమె తమిళంలో కార్తీ కథానాయకుడుగా నటిస్తున్న సర్దార్ 2 చిత్రంలోనూ, తెలుగులో ప్రభాస్ హీరోగా రూపొందుతున్న ది రాజా సాబ్ చిత్రంలోనూ నటిస్తున్నారు. కాగా సోమవారం నటి మాళవిక మోహన్ పుట్టినరోజు ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ది రాజాసాబ్ చిత్రం యూనిట్, సర్దార్ 2 చిత్ర యూనిట్ ప్రత్యేక పోస్టల్ విడుదల చేశారు.

కాగా 32 ఏళ్లు టచ్ చేసిన మాళవిక మోహన్ మలయాళంలో మోహన్ లాల్ కు జంటగా హృదయ పూర్వం అనే చిత్రంలో నటిస్తున్నారు. కాగా మోహన్ లాల్ వయసు 64 ఏళ్లు ఆయనకు జంటగా 32 ఏళ్ల మాళవిక మోహన్ నటించడంతో సామాజిక మాధ్యమాల్లో కామెంట్స్ చేస్తున్నారు. వాటిపై స్పందించిన మాళవిక మోహన్ నటీనటుల వయసు గురించి గానీ, వయసు వ్యత్యాసం గురించి గానీ మాట్లాడకండి అంటూ హెచ్చరించారు.

ముందు ఇలాంటి విషయాల గురించి మాట్లాడటం ఆపేయండి అంటూ సినిమాలో ప్రతిభను చూడాలి గానీ అర్థం లేని విషయాల గురించి ఆరాలు తీయరాదనే అభిప్రాయాన్ని మాళవిక మోహన్ వ్యక్తం చేశారు.

# డేవిడ్ రెడ్డిగా మంచు హీరో!




మంచు వారి కుటుంబం నుంచి వచ్చిన టాలెంటెడ్ హీరోస్ ఇద్దరి నుంచి ఈ ఏడాది భైరవం, కన్నప్ప చిత్రాలు వరుసగా వచ్చాయి. ఇక మంచు విష్ణు కన్నప్ప తర్వాత తదుపరి సినిమా ఇంకా అనౌన్స్ చేయలేదు కానీ మంచు మనోజ్ నుంచి మాత్రం సాలిడ్ ప్రాజెక్ట్ ఇప్పుడు అనౌన్స్ అయ్యింది. ఒక భారీ పీరియాడిక్ డ్రామా తన నుంచి డేవిడ్ రెడ్డి గా అనౌన్స్ చేయడం జరిగింది. తన 21 ఏళ్ల సినీ కెరీర్లో తన 21వ ప్రాజెక్ట్ గా ఈ సినిమా తనకెంతో ప్రత్యేకం అని మనోజ్ చెబుతున్నాడు. దర్శకుడు హనుమ రెడ్డి యక్కంటి తెరకెక్కిస్తున్న ఈ సినిమా బ్రిటీష్ కాలం నాటి నేపథ్యంలో ప్లాన్ చేస్తున్నారు. 1897 నుంచి 1922 కాలంలో కథగా మేకర్స్ కన్ఫర్మ్ చేశారు. మరి మంచు మనోజ్ నుంచి ఈ బిగ్ ప్రాజెక్ట్ ఎలా ఉండబోతుందో చూడాలి. ఇక ఈ చిత్రానికి వెల్వెట్ సోల్, టూర్ రాడిక్స్ సంస్థలు నిర్మాణం వహిస్తుండగా ఇతర వివరాలు త్వరలోనే బయటకి రానున్నాయి.

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.